# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 85 | హైదరాబాద్ | మంగళవారం 16-09-2025 | పేజీలు : 12 | వెల : 1.00




10లో

అమెరికా వార్నింగ్‌లు బేఖాతరు.. భారత్‌పై రష్యా కీలక వ్యాఖ్యలు

# ఇందిరమ్మ ఇళ్లకు బిల్లుల కష్టాలు

- ఇందిరమ్మ ఇళ్లకు బిల్లుల కష్టాలు
- 10రోజులుగా ఫొటోలు అప్ లోడ్ చేయని వైనం
- 20 వార్డులకు ఏడుగురే వార్డ్ ఆఫీసర్లు
- వైరా మున్సిపాలిటీలో విచిత్ర పరిస్థితి
- త్వరగా బిల్లులు మంజూరు చేయాలని లబ్దిదారుల వేడుకోలు

11లో



## నేటి భారతం

- జీవితం అంటే నిన్ను నువ్వు చూసుకోవటం కాదు, నిన్ను నువ్వు రూపు దిద్దుకోవటం...
- నీకు కావలసిన దాని కోసం శ్రమించకుండా, పోగొట్టుకున్న దాని గురించి ఏడవటం మూర్ఖత్వం అవుతుంది..
- "అర్ధరహితమైన మాటలకన్నా, అర్థవంతమైన నిశ్శబ్దం చాలా ఉత్తమం"..
- మనం జీవితాన్ని బాగా గడపాలంటే, మన మనసులను కేవలం శక్తివంతమైన, ప్రేరేపకమైన మాటలతో నింపుకోవాలి"...

– పెద్ద విష్ణు ప్రసాద్ రెడ్డి



11లో

## రూ. 10 కోట్లకు బండి సంజయ్‌పై

కేటీఆర్ పరువు నష్టం దావా


### నాలాల కబ్జా వల్ల వరద సమయంలో

## ప్రమాదాలు జరుగుతున్నాయి

- భారీ వర్షం నేపథ్యంలో అఫ్జల్ సాగర్‌లో ఇద్దరు గల్లంతు
- నాలాల కబ్జాల వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్న హైడ్రా కమిషనర్
- అఫ్జల్ సాగర్ వద్ద కొన్ని ఇళ్ల తొలగింపుకు నిర్ణయం తీసుకున్నామన్న రంగనాథ్



11లో



### గూగుల్ 'నానో బనానా' ఏఐ టూల్ పై

11లో

## వీసీ సజ్జనార్ హెచ్చరిక!

- వైరల్ అవుతున్న 'నానో బనానా' ఏఐ ట్రెండ్
- వ్యక్తిగత ఫోటోల మార్ఫింగ్‌తో భద్రతకు ముప్పు అని హెచ్చరిక
- ఏఐ వాటర్‌మార్కులు నమ్మశక్యంగా లేవంటున్న టెక్ నిపుణులు
- నకిలీ యాప్‌ల ద్వారా డేటా చోరీ, ఆర్థిక మోసాల ప్రమాదం
- ఆన్‌లైన్‌లో వ్యక్తిగత ఫోటోలు పెట్టొద్దని పోలీసు అధికారి సూచన



### పనితీరు బాగుంటేనే కొనసాగింపు..

# కలెక్టర్లకు సీఎం స్ట్రాంగ్ మెసేజ్

- కాగితాలపై కాకుండా క్షేత్రస్థాయిలో వాస్తవాలు గ్రహించాలని కలెక్టర్లకు సీఎం సూచన
- సమర్థంగా పనిచేసే అధికారులకు పూర్తి మద్దతు ఉంటుందని భరోసా
- పనితీరులో విఫలమైతే మాత్రం కఠిన నిర్ణయాలు తప్పవని స్పష్టం చేసిన సీఎం
- డబుల్ ఇంజిన్ సర్కార్‌తో డబుల్ డిజిట్ వృద్ధి సాధించడమే లక్ష్యమన్న చంద్రబాబు
- స్వర్ణాంధ్ర విజన్ 2047 పత్రమే అధికారులకు భగవద్గీత, బైబిల్, ఖురాన్ కావాలి
- సూపర్ సిక్స్ పథకాల విజయవంతం, సంక్షేమం-అభివృద్ధిపై సమీక్ష

11లో

### కృత్రిమ మేధపై

## కేంద్రం కీలక వైఖరి..

నిర్మల సీతారామన్ స్పష్టత



11లో

### తిరుమల శ్రీవారికి విద్యుత్ వాహనం అందజేసిన

## టీవోల్ట్ కంపెనీ

11లో



### జూబ్లీహిల్స్ ఉపఎన్నిక

## కవిత కొత్త వ్యూహం.. బరిలో మాజీ ఎమ్మెల్యే?

- మాగంటి గోపీనాథ్ మృతితో జూబ్లీహిల్స్‌కు ఉపఎన్నిక
- రేసులోకి కవిత.. సొంత అభ్యర్థిని నిలబెట్టే యోచన
- జాగృతి తరఫున విష్ణువర్ధన్ రెడ్డి పోటీ చేసే అవకాశం
- విష్ణుతో కవిత భేటీ.. అరగంటకు పైగా మంతనాలు
- దసరా వేడుకలకే ఆహ్వానించానన్న విష్ణు.. రాజకీయ భేటీ కాదని వెల్లడి
- బతుకమ్మ పండుగనాడు కొత్త పార్టీ ప్రకటనపై ఊహాగానాలు



11లో

# సంపాదకీయం

## విధాన రచనలో స్త్రీల భాగస్వామ్యమేది?

స్వాతంత్ర్యంకోసం భారతావని చేస్తున్న పోరాటంలో స్త్రీ పురుషులందరూ భాగస్వాములు కావాలని మహాత్ముడు పిలుపిచ్చినప్పుడు- తరతరాలుగా తమను ఇంటికే పరిమితం చేసిన సామాజిక సంకెళ్లను తెంచుకుని మహిళలు ముందడుగు వేశారు. పరాయి పాలకుల దాష్టీకాలను ఖండిస్తూనే దేశీయంగా సమాన హక్కులకోసం, సమన్యాయంకోసం వారు గళమెత్తారు. స్వతంత్ర భారతాన్ని ప్రగతి పథంలోకి నడిపించే కృషిలోనూ స్త్రీలకు సమాన అవకాశాలు లభించాలని రాజ్యాంగ పరిషత్తు సభ్యులు రేణుకా రే, హంసా మెహతా తదితరులు ఆకాంక్షించారు. బాధ్యతాయుతమైన నాయకత్వ స్థానాల్లోకి మహిళలు ఎంత ఎక్కువగా వస్తే- అంత అధికంగా వారి సామాజిక ఆర్థిక స్థితిగతుల్లో మేలిమి మార్పులు వస్తాయని, అంతిమంగా అవి భారతావని సమ్మిళిత ప్రగతికి ఆలంబనలవుతాయని వారు ఆశించారు. అందుకే రాజకీయ రంగంలో మహిళల ప్రవేశం అవసరం కాదు అనివార్యమని సంవిధాన సభలోనే పూర్ణిమా బెనర్జీ తేల్చిచెప్పారు. స్వేచ్ఛా భారత తొలినాళ్లలో ఉదయించిన ఈ స్వప్నాలేవీ ఈనాటికీ సాకారం కాలేదు. దేశ గమనాన్ని నిర్దేశించే రాజకీయాల్లో స్త్రీల భాగస్వామ్యం ఆశించిన స్థాయిలో పెరగలేదు. ఈ పరిస్థితుల్లో నిన్న తిరుపతిలో ఆరంభమైన జాతీయ మహిళా సాధికార సదస్సు- వికసిత భారతావనిని ఆవిష్కరించుకునే బృహత్ యజ్ఞంలో మహిళలే కీలక పాత్రధారులని ఉద్ఘాటించింది. ఇటువంటి భేటీల తీర్మానాల్లో కనిపించే ఘనసంకల్పాలు ఆచరణ రూపం దాల్చినప్పుడే నిజమైన స్త్రీ సాధికారతా సాధనకు దారులు విశాలమవుతాయి.

మెక్సికో, న్యూజిలాండ్, స్వీడన్, నార్వే, ఫిన్లాండ్, దక్షిణాఫ్రికా వంటి దేశాల దిగువసభల్లో మహిళల ప్రాతినిధ్యం 45శాతం అంతకు మించి ఉంది. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఖ్యాతిగడించిన ఇండియాలో మాత్రం అందుకు భిన్నమైన దుస్థితి నెలకొంది. తొలి లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీలుగా గెలిచినవారిలో మహిళలు 4.5శాతమైతే- ఇన్నేళ్లలో ఆ సంఖ్య దాదాపు 14శాతానికే చేరింది. దిగువ సభల్లో స్త్రీల వాటా పరంగా 190 దేశాల్లో ఇండియా 148వ స్థానంతో సరిపెట్టుకుంటోంది. ఆర్థిక కార్యకలాపాల్లో స్త్రీల భాగస్వామ్యం, విద్యార్జన, రాజకీయ ప్రాతినిధ్యం తదితరాల ఆధారంగా గణించే లింగ సమానత్వ సూచీలోనూ 148 దేశాల నడుమ భారత్ 131వ స్థానానికి పరిమితమైంది. ఇక దేశవ్యాప్తంగా నాలుగు వేల మందికి పైబడిన ఎమ్మెల్యేలలో మహిళల వాటా పట్టుమని తొమ్మిది శాతమే! ఇంటా బయటా స్త్రీలు చవిచూసే చేదు అనుభవాల గురించి వారికి తెలిసినంతగా పురుషులకు తెలియదు. స్త్రీల అభివృద్ధిని వెనక్కిలాగుతున్న వ్యవస్థాగత, సామాజిక సమస్యలకు సరైన పరిష్కారాలు సత్వరం లభించాలంటే- విధాన రచనలో మహిళల ప్రాతినిధ్యం పెరిగి తీరాలి!

స్థానిక సంస్థల్లో స్త్రీలకు 33శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగాన్ని సవరించారు. కొన్ని రాష్ట్రాలైతే పంచాయతీరాజ్ సంస్థల్లో మహిళలకు సగం స్థానాలు ప్రత్యేకిస్తున్నట్లు భుజాలు చరచుకొంటున్నాయి. కానీ, ఆయా పదవులను చేపట్టిన స్త్రీలలో ఎంతమంది స్వతంత్రంగా పనిచేయగలుగుతున్నారు? చాలాచోట్ల మహిళా నేతలను వెనక్కినెట్టి వారి కుటుంబసభ్యులే పెత్తనం చలాయిస్తున్నారు. ఇదేమి ప్రజాస్వామ్యం? లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లో టిక్కెట్లు దక్కించుకుంటున్న కొద్దిమంది స్త్రీలలోనూ ఎక్కువశాతం రాజకీయ కుటుంబాల నుంచి వస్తున్నవారే. అట్టడుగు వర్గాలకూ అభివృద్ధి ఫలాలు అందాలంటే విభిన్న నేపథ్యాలకు చెందినవారు చట్టసభల్లోకి అడుగుపెట్టాలి. ఆ మేరకు పాలనలో మహిళలు క్రియాశీలక భూమిక పోషించే విధంగా పార్టీలన్నీ చేయూతనందించాలి. మహిళా సాధికారత పట్ల వాటి నిబద్ధతకు ఇదే పరీక్ష!

## తెలంగాణ జాగృతి తరపున జూబ్లీహిల్స్ ఉపఎన్నికల బరిలో విష్ణువర్ధన్ రెడ్డి?

హైదరాబాద్ సెప్టెంబర్ 15 ( **భారతశక్తి ప్రతినిధి**)
జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో ఎంఎల్ఎ కవిత తరపున అభ్యర్థిని బరిలోకి దించే అవకాశం ఉంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి సమావేశమయ్యారు. ఇద్దరు మధ్య దాదాపుగా అరగంటకు పైగా మంతనాలు సాగాయి. ఉపఎన్నికలో విష్ణును పోటీకి దించే యోచనలో కల్వకుంట్ల కవిత ఉన్నట్టు సమాచారం.బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా దివంగత ఎంఎల్ఎ మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత పేరును దాదాపు ఖరారు చేసినట్లు తెలుస్తోంది.

తెలంగాణ భవన్‌లో ఇటీవల జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలోని బిఆర్ఎస్ కార్యకర్తలతో కెటిఆర్ సమావేశమైన విషయం తెలిసిందే. సునీత పేరును ఫైనల్ చేసినట్లు సమాచారం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దింపాలని ఆ పార్టీ అధిష్ఠానం వ్యూహాత్మకంగా అడుగులు వేయాలని యోచిస్తోన్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. ఇక్కడి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగుంట గోపినాథ్ అకాల మరణంతో ఉప ఎన్నిక జరగబోతున్న విషయం తెలిసిందే.

# తురకపాలెంలో యురేనియం అవశేషాలు గుర్తింపు

**గుంటూరు, సెప్టెంబర్ 15, ( భారతశక్తి ప్రతినిధి)**
గుంటూరు జిల్లాలోని తురకపాలెంలో వరుస మరణాలతో జాతీయ వ్యాధుల నియంత్రణ కేంద్రం దీనిపై ఫోకస్ చేసింది. చెన్నైలో చేసిన టెస్టుల్లో యురేనియం ఉన్నట్లు గుర్తించారు.ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లాలోని తురకపాలెంలో రెండు నెలల్లో ముప్ఫయి మందికి పైగా మరణించడానికి గల కారణాలు ఒక్కొక్కటి వెలుగు చూస్తున్నాయి. అయితే తురకపాలెంలో మరణాలకు ఒక ఆర్ఎంపీ ఇచ్చిన మందులు, ఇన్ ఫెక్షన్లు కారణమయి ఉండవచ్చని ఆ దిశగా విచారణ సాగింది. ఆ ఆర్ఎంపీని అదుపులోకి తీసుకుని విచారించారు. ఆర్ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్ ను కూడా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సీజ్ చేశారు. అయితే తాజాగా తురకపాలెంలో మరణాలకు, అనారోగ్య సమస్యలకు యూరేనియం అవశేషాలు కలిసిన నీరు తాగడం వల్లనేనంటూ మరో అధ్యయనంలో వెల్లడి కావడం విశేషం. గ్రామంలో అందరికీ రక్త పరీక్షలు నిర్వహించారు. వాటిని ల్యాబ్ కు పంపించారు. అంతేకాదు నీరు, మట్టి నమూనాలను కూడా సేకరించి పరీక్షల కోసం ల్యాబ్ కు పంపారు. అయితే నీటి నమూనాలు మాత్రం చెన్నై ల్యాబ్ కు పంపారు. ఈ ల్యాబ్ నుంచి రిజల్ట్ వచ్చినట్లు సమాచారం. అందులో తురకపాలెంలో ఉన్న నీటిలో యురేనియం అవశేషాలు వెల్లడయినట్లు తెలిసింది.తురకపాలెం గ్రామం చుట్టూ అనేక క్వారీలు ఉన్నందునఅక్కడ క్వారీ గుంతల్లో నీటిని ప్రజలు వినియోగిస్తున్నందున ఈ మరణాలు, తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తినట్లు తెలిసింది. స్ట్రాన్షియం అనే పదార్థంతో పాటు ఈకొలి బాక్టిరియా కూడా నీటిలో ఉన్నట్లు కనుగొన్నారని చెబుతున్నారు. అలాగే గ్రామంలో వివిధ ప్రాంతాల్లో నీటి నమూనాలను సేకరించి ల్యాబ్ కు పంపారు. కానీ ఒక్క చోట తప్ప మిగిలిన చోట్ల ఎక్కడా బాక్టీరియా ఆనవాళ్లు లేవని గుర్తించారు. అయితే చెన్నై నివేదికలో మాత్రం అందుకు విరుద్ధంగా ఫలితాలు రావడంతో అక్కడి తాగు నీటి వల్లనే ఈ మరణాలు, తీవ్రమైన




అనారోగ్యానికి కారణాలుగా వైద్యులు భావిస్తున్నారు. యురేనియం శరీరంలోకి వెళితే చాలా వెళితే చాలా ప్రమాదమని, దీనిద్వారా తొలుత కిడ్నీలకు, తర్వాత చర్మ సంబంధితమైన వ్యాధులు తలెత్తడమే కాకుండా మెదడు, కాలేయం, ఊపిరితిత్తులు, ఎముకలను దెబ్బతినడం ఖాయమని, అవే మరణాలకు కారణం కావచ్చని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. పరిశోధన కోసం గ్రామంలోని త్రాగు నీరు, మట్టి, స్థానికుల రక్త నమూనాలను సేకరించి చెన్నై, ఎయిమ్స్, గుంటూరు జీజీహెచ్ ల్యాబ్‌లకు పంపించారు. రెండు నెలల వ్యవధిలో 30 మందికి పైగా చనిపోవడంతో గ్రామంలో భయాందోళన నెలకొంది. జ్వరాలు వస్తున్నాయని ఆస్పత్రికి తీసుకెళ్తే మళ్లీ ఇంటికి తిరిగొచ్చే వారు తక్కువ అని గ్రామస్తులు చెబుతున్నారు. చిన్న జ్వరాలకే ప్రాణాలు పోతున్నాయని, దీని వెనుక ఏదో పెద్ద కారణం ఉందని తురకపాలెం వాసులు అధికారులకు తెలిపారు. గత కొన్ని నెలలుగా గ్రామంలో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, ప్రాణాలు పోవడం ఆందోళన కలిగిస్తుందని చెప్పారు.జాతీయ వ్యాధుల నియంత్రణ కేంద్రం ఆధ్వర్యంలోని వైద్య నిపుణులు గుంటూరు శివారులోని తురకపాలెంను మంగళవారం (సెప్టెంబర్ 9న) సందర్శించారు. అసాధారణ మరణాలకు కారణాలపై ఎన్‌సీడీసీ సంయుక్త సంచాలకురాలు డాక్టర్ హేమలత, నోడల్ అధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలోని బృందం గ్రామంలో సమీక్షించింది. గ్రామస్తులను అడిగి పరిస్థితి తెలుసుకుని, కొన్ని వివరాలు సేకరించారు.

చెన్నైలో పరీక్షించిన నీటి నమూనాల ఫలితాలు శనివారం వెలుగులోకి వచ్చాయి. అందులో తురకపాలెం పరిసరాల నీటిలో యురేనియం అవశేషాలు ఉన్నట్టు తేలింది. ఈ ప్రాంతంలో రాళ్ల క్వారీలు విస్తారంగా ఉండటం, వాటిలోనే స్థానికులు పని చేయడం, అలాగే ఆ క్వారీ గుంతలలోని నీటిని వినియోగించడమే ఈ సమస్యకు కారణమయ్యుండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అలాగే, నీటిలో స్ట్రాన్షియం అనే హానికర మూలకం మరియు ఈకొలి బ్యాక్టీరియా కూడా ఉన్నట్లు చెన్నై నివేదికలో తేలింది. అయితే, మొదటిసారిగా నిర్వహించిన పరీక్షల్లో మాత్రం బ్యాక్టీరియా కేవలం ఒకేచోటే ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయంపై చెన్నై నివేదిక ఫలితాలు కొంత భిన్నంగా వచ్చాయని అధికారులు తెలిపారు.యురేనియం మానవ శరీరానికి ఎంతో ప్రమాదకరం అని డాక్టర్లు చెబుతున్నారు. ఇది తాగునీరు లేదా ఆహార మార్గంలో శరీరంలోకి ప్రవేశిస్తే మొదటగా మూత్రపిండాలకు తీవ్ర నష్టం కలుగుతుంది. అనంతరం చర్మ సమస్యలు, కాలేయం, మెదడు, ఊపిరితిత్తులు, ఎముకలకు దెబ్బతీసి ప్రాణాంతకంగా మారే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరించారు. పూర్తి సమాచారం మాత్రం ఇంకా అందాల్సి ఉండటంతో గుంటూరు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దీనిపైఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. అప్పటి వరకూ వారికి రోజూ భోజనం, మంచినీరు అందించాలని నిర్ణయించారు.

# ఆదిమూలానికి ఏమైంది...

ఒంగోలు, సెప్టెంబర్ 15, ( **భారతశక్తి ప్రతినిధి**)
వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు మంత్రిగా పనిచేసిన ఆదిమూలపు సురేష్ అధికారం కోల్పోయిన తర్వాత మాత్రం యాక్టివ్ గా ఉండటం లేదు. ఆదిమూలపు సురేష్ వైసీపీ హయాంలోని ఐదేళ్లలో కొన్నాళ్లు విద్యాశాఖ మంత్రిగానూ, మరికొన్నాళ్ల పాటు మున్సిపల్ శాఖ మంత్రిగానూ ఉన్నారు. అయితే ఆయన ప్రభుత్వం మారిన తర్వాత తాను ప్రాతినిధ్యం వహించిన శాఖలకు సంబంధించిన విమర్శలు అధికార పార్టీ నుంచి వచ్చినప్పటికీ ఆయన స్పందిచడం లేదు. పైగా ప్రస్తుతం యర్రగొండపాలెంలో ఉన్న వైసీపీ ఎమ్మెల్యేకు ఇబ్బందికరంగా మారారంటున్నారు. అక్కడ వైసీపీ ఎమ్మెల్యేపై తన అనుచరులతో సోషల్ మీడియాలో నెగిటివ్ ప్రచారం చేయిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.ఆదిమూలపు సురేష్ 2009, 2014, 2019, 2024 లలో జరిగిన ఎన్నికల్లో మూడు నియోజకవర్గాల్లో పోటీ చేశారు. నాలుగు సార్లు పోటీ చేసి మూడు సార్లు విజయం సాధించారు.ఆదిమూలపు సురేష్ దక్షిణ మధ్య రైల్వేలో ఐఆర్ఎస్ అధికారిగా పనిచేశారు. తర్వాత వీఆర్ఎస్ తీసుకుని రాజకీయాల్లోకి వచ్చారు. 2009 లో కాంగ్రెస్ తరుపున యర్రగొండపాలెం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అయితే ఆయనకు యర్రగొండపాలెం అంటేనే ఎక్కువ మక్కువ. అక్కడే తన రాజకీయాలను కొనసాగించాలని గట్టిగా అనుకుంటున్నారు. అయితే 2024 ఎన్నికల్లో ఆయనను యర్రగొండపాలెం నుంచి తప్పించి కొండపి నియోజకవర్గం నుంచి పోటీ చేయించారు. అక్కడ ఓటమితో ఇక కొండపి నియోజకర్గం నుంచి క్యాడర్ కు కూడా దూరంగా ఉన్నారు. 2009లో యర్రగొండపాలెం నుంచి పోటీచేసిన ఆదిమూలపు సురేష్ తొలిసారి గెలిచారు. అయితే వైఎస్ మరణం తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన జగన్ తో కలసి ప్రయాణం చేయాలని నిర్ణయించారు. జగన్ 2014 ఎన్నికల్లో ఆదిమూలపు సురేష్ ను సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి పోటీ చేయించారు. అప్పుడు అధికారంలోకి రాలేదు. 2019 ఎన్నికలకు వచ్చేసరికి సంతనూతలపాడు నుంచి ఆదిమూలపు సురేష్ ను మళ్లీ యర్రగొండపాలెంకు జగన్ పంపించి అక్కడి నుంచి పోటీ చేయించారు. అక్కడి నుంచి విజయం సాధించారు. జగన్ తొలి కేబినెట్ లో విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. రెండున్నరేళ్ల తర్వాత జరిగిన మంత్రివర్గ విస్తరణలో ఆదిమూలపు సురేష్ ను జగన్ కేబినెట్ లో కొనసాగించారు. అయితే ఈసారి విద్యాశాఖ కాకుండా మున్సిపల్ శాఖకు మార్చారు. ఆదిమూలపు సురేష్ కారణంగానే తన సొంత బంధువును బాలినేనిని కూడా జగన్ పక్కన పెట్టారు.జగన్ సొంత జిల్లా అయిన కడపకు ఆయనను ఇన్‌ఛార్జి మంత్రిగానూ నియమించారు.

అంత నమ్మకాన్ని జగన్ సురేష్ పై ఉంచారు. కానీ అధికారం కోల్పోయిన తర్వాత మాత్రం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తున్నారు. తనను యర్రగొండపాలెం నుంచి కొండపి పంపించడంపై ఆయన కొంత ఇబ్బంది ఫీలవుతున్నారు. 2024 ఎన్నికల్లో యర్రగొండపాలెం నుంచి తాటిపర్తి చంద్రశేఖర్ వైసీపీ నుంచి గెలవడంతో అక్కడకు కూడా వెళ్లలేక హైదరాబాద్ కే ఆదిమూలపు సురేష్ పరిమితమయ్యారంటున్నారు. అయితే తనకు బలమైన అనుచరులు, క్యాడర్ ఉన్న యర్రగొండ పాలెంలో ఆదిమూలపు సురేష్ వేలు పెడుతుండటం, స్థానిక ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా వర్గాన్ని తయారు చేయడంతో పార్టీ నాయకత్వం కూడా సీరియస్ కావడంతో ఇక ఏపీ రాజకీయాలకు ఆదిమూలపు సురేష్ దూరంగా ఉన్నారని తెలిసింది. ఐదేళ్లు మంత్రి పదవి ఇచ్చినా జగన్ కు కష్టకాలంలో మాత్రం దూరంగా ఉండిపోయిన ఆదిమూలపు సురేష్ పై వైసీపీ సోషల్ మీడియాలో ట్రోల్ అవుతున్నారు.

## మళ్లీ దగ్గరవుతున్నా జవహర్

విజయవాడ, సెప్టెంబర్ 15 ( **భారతశక్తి ప్రతినిధి**)
ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లోనూ, అందులో తెలుగుదేశం పార్టీలో మాజీ మంత్రి కేఎస్ జవహర్ మళ్లీ అధిష్టానానికి దగ్గరయ్యారు. ఆయన వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ కోసం ఇప్పటి నుంచే తన ప్రయత్నాలు మొదలు పెట్టినట్లుంది. కేఎస్ జవహర్ కు 2024 లో జరిగిన ఎన్నికల్లో టిక్కెట్ దక్కలేదు. ఆయన 2014లో కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఉపాధ్యాయ వృత్తి చేస్తూ రాజకీయాల్లోకి వచ్చిన జగన్ వచ్చిన వెంటనే ఎమ్మెల్యేగా ఎన్నికవ్వడమే కాకుండా మంత్రి పదవి కూడా వరించింది. అయితే కొవ్వూరు నియోజకవర్గంలోని టీడీపీ నేతలతో పొసగక పోవడంతో ఆయన రాజకీయ జీవితంలో స్పీడ్ కు కొంత ఫుల్ స్టాప్ పడినట్లయిందన్నది వాస్తవం. కొవ్వూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కె. జవహర్ ను అక్కడి నేతలు వ్యతిరేకించడంతో 2019 ఎన్నికలలో ఆయనను తిరువూరుకు చంద్రబాబు పంపించారు. అయితే అక్కడ ఆయన వైసీపీ అభ్యర్థి రక్షణ నిధి చేతిలో ఓటమి పాలయ్యారు. అయితే తిరువూరు మొన్నటి ఎన్నికల్లో కొలికపూడి శ్రీనివాసరావుకు కేటాయించారు. అమరావతి ఉద్యమంలో పాల్గొన్న కొలికపూడికి టిక్కెట్ ఇవ్వడంతో ఆయన అక్కడ ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే తిరువూరు లో కొలికపూడికి, అక్కడి పార్టీ నేతలకు, క్యాడర్ కు పడకపోవడం, అనేక వివాదాలు చోటు చేసుకుంటుండటంతో జవహర్ చూపు తిరిగి తిరువూరు పై పడిందని అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో జవహర్ తిరువూరు నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కొవ్వూరు కంటే ఆయనకు తిరువూరు పైనే ప్రస్తుతం దృష్టి ఉన్నట్లు కనపడుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత చంద్రబాబు భర్తీ చేసిన నామినేటెడ్ పోస్టుల్లో జవహర్ కు కీలకమైన పోస్టు లభించింది. ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ గా నియమితులయ్యారు.

# పోరాటాలకు సిద్ధమౌతున్నా వైసీపీ


విజయవాడ, సెప్టెంబర్ 15 ( **భారతశక్తి ప్రతినిధి**)
ఏపీలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కొత్త పోరాటాలకు సిద్ధం అవుతోంది.ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేయడాన్ని తప్పుపడుతూ పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టడానికి రెడీ అవుతోంది. ఈ విషయంలో ఇతర రాజకీయ పక్షాల సహకారం తీసుకోవాలని జగన్మోహన్ రెడ్డి నిర్ణయించారు. రాజకీయ పార్టీలతో పాటు ప్రజా సంఘాలు తమతో కలిసి రావాలని కోరారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఏర్పాటు జరిగిందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చెబుతోంది. కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడికక్కడే పునాదుల స్థాయిలో ఉన్న భవనాలను చూపించి.. ఇదేనా మెడికల్ కాలేజీలు అంటూ టిడిపి ప్రశ్నిస్తోంది. అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి మాత్రం నేతలు పెద్దగా మాట్లాడడం లేదు. ఒకరిద్దరు తప్పిస్తే గట్టిగా రిప్లై ఇవ్వలేకపోతున్నారు. దీనిపై విమర్శలు రావడంతో అధినేత జగన్మోహన్ రెడ్డి సీరియస్ అయినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే మాజీ మంత్రి రోజా ఈ అంశంపై మాట్లాడడం విశేషం. కొద్దిరోజులుగా రోజా కనిపించడం లేదు. ఆమె అరెస్టు ఉంటుందని అంతటా ప్రచారం జరిగింది. వైసిపి హయాంలో ఆమె క్రీడల శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహించారు. ఆ సమయంలో భారీ అవినీతి జరిగిందన్నది కూటమి ప్రభుత్వ ఆరోపణ. దీనిపై విజిలెన్స్ విచారణ కూడా ప్రారంభం



అయింది. పెద్ద ఎత్తున నిధులు పక్కదారి పట్టాయని విజిలెన్స్ విచారణలో తేలింది. ఈ క్రమంలో అప్పటి మంత్రిగా వ్యవహరించిన రోజాతో పాటు శాప్ చైర్మన్గా ఉన్న బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కి సైతం ఈ కుంభకోణంలో హస్తం ఉందని విజిలెన్స్ విచారణలో తేలినట్లు తెలుస్తోంది. సెప్టెంబర్ లో ఖచ్చితంగా మాజీ మంత్రి రోజా అరెస్టు జరుగుతుందని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అప్పటినుంచి రోజా సైతం వ్యూహాత్మకంగా సైలెంట్ అయ్యారు. అయితే ఇప్పుడు మెడికల్ కాలేజీల విషయంలో ఏకంగా హోంమంత్రి వంగలపూడి అనిత పై విరుచుకుపడ్డారు రోజా. తద్వారా తన అరెస్టు విషయంలో భయపడడం లేదని తెలుస్తోంది. తనను అరెస్టు చేస్తే సానుభూతి వర్కౌట్ అవుతుందని ఆమె భావిస్తున్నట్లు సమాచారం. అందుకే గట్టి వాయిస్ తోనే రోజా ఇప్పుడు ముందుకు వచ్చారు.జగన్మోహన్ రెడ్డిక్యాబినెట్లో మంత్రిగా వ్యవహరించారు రోజా. ఆమె క్రీడల శాఖ మంత్రిగా ఉన్న సమయంలో 2024 డిసెంబర్లో ఆడుదాం ఆంధ్రా పేరిట క్రీడా పోటీలు నిర్వహించారు. అయితే అప్పట్లో ఆ క్రీడా పోటీలపై అనేక రకాల విమర్శలు వచ్చాయి. వాలంటీర్లే ఎంపైర్లుగా మారగా.. వైసీపీ సానుభూతిపరులతో క్రీడా పోటీలు నిర్వహించి పెద్ద ఎత్తున నిధులను పక్కదారి పట్టించారన్న విమర్శ ఉంది. నాసిరకం క్రీడా పరికరాలను అందించి భారీగా నిధులు గోల్మాల్ చేశారన్నది ప్రధాన ఆరోపణ. అయితే దీనిపై అన్ని జిల్లాల నుంచి విజిలెన్స్ విచారణ జరిగింది. మాజీ మంత్రి రోజాతో పాటు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిని అరెస్టు చేస్తారని టాక్ నడిచింది. అయితే కొన్ని రోజులపాటు రోజా సైలెంట్ గా ఉన్నారు. అయితే ఇప్పుడు ఉన్నఫలంగా మీడియా ముందుకు వచ్చి ఏకంగా వంగలపూడి అనితకు సవాల్ చేశారు. మెడికల్ కాలేజీలపై అనిత తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. తనతో వస్తే పాడేరు మెడికల్ కాలేజీని చూపిస్తానంటూ సవాల్ చేశారు. మొత్తానికి అయితే కూటమి కేసుల విషయంలో డోంట్ కేర్ అన్నట్టు రోజా వ్యవహార శైలి ఉంది. మరి కూటమి నుంచి ఎలాంటి రిప్లై ఉంటుందో చూడాలి.

# స్థానిక సంస్థల ఎన్నికల సందడి షురూ

విజయవాడ, సెప్టెంబర్ 15, **భారతశక్తి ప్రతినిధి)**
ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి ప్రారంభం అయింది. పాలకవర్గాల పదవీకాలం ముగియడానికి మూడు నెలల ముందే ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. మొత్తం నాలుగు విడతల్లో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని వచ్చే ఏడాది మార్చిలో పదవీ విరమణ చేయనున్నారు. ఈ లోపే స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తిచేసి పదవీ విరమణ చేయాలన్న ఆలోచనతో ఉన్నారు. అయితే అధికార పార్టీలో సన్నాహాలు ప్రారంభం అయ్యాయి కానీ.. ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి కదలిక లేదు. కేంద్ర బలగాల సాయంతోనే ఎన్నికలు నిర్వహిస్తేనే అన్నమాట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వినిపిస్తోంది. దీంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలను ఎలా తీసుకుంటుందో అర్థమవుతోంది. గత అనుభవాల దృష్ట్యా స్థానిక సంస్థల విషయంలో జగన్మోహన్ రెడ్డి ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో ఎన్నో రకాల ట్విస్టులు కొనసాగాయి. చంద్రబాబు హయాంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గా నియమితులయ్యారు నిమ్మగడ్డ రమేష్




కుమార్. అదే సమయంలో కరోనా వచ్చింది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో తన ఆదేశాలు పాటించలేదని.. నిమ్మగడ్డ రమేష్ కుమార్ చంద్రబాబు మనిషి అంటూ తప్పించే ప్రయత్నం చేశారు జగన్మోహన్ రెడ్డి. కానీ చివరకు కోర్టు ఆదేశాలతో నియమితులయ్యారు నిమ్మగడ్డ. ఆయన కమిషనర్ గా ఉండగానే స్థానిక సంస్థలు ఎన్నికలు జరిగాయి. అయితే ఇప్పుడు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ గా నీలం సాహ్ని ఉన్నారు. ఆమె జగన్ హయాంలో నియమితులయ్యారు. కానీ ఇప్పుడు ఆమె ఎన్నికల నిర్వహణకు ప్రతిపాదనలు పెడితే ప్రభుత్వం నుంచి ఆమోదముద్ర వచ్చింది. ఇప్పటికే ఆమె నేతృత్వంలో పులివెందుల, ఒంటిమిట్ట జడ్పిటిసి ఎన్నికలు జరిగాయి. ఆమెపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి రకరకాల ఒత్తిడిలు వెళ్లాయి. కానీ ఆమె పెద్దగా చలించలేదు. దీంతో స్థానిక సంస్థల ఎన్నికలు ఏ స్థాయిలో? ఎలా జరుగుతాయో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అర్థమయింది. అందుకే ఎన్నికలను బహిష్కరించేందుకు ఆ పార్టీ ఇప్పటినుంచే కారణాలను వెతుక్కుంటుందివైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సంక్లిష్ట పరిస్థితుల్లో ఉంది. ఇప్పుడే ఆ పార్టీలో ఆశావహులు ముందుకు వచ్చే అవకాశం లేదు. కనీసం పార్టీ పిలుపు ఇస్తున్న కార్యక్రమాలకు సైతం పార్టీ శ్రేణులు హాజరవుతున్న దాఖలాలు లేవు. పులివెందులతో పాటు ఒంటిమిట్టలో వచ్చిన ఫలితం పార్టీ శ్రేణులకు తీవ్ర కలవరపాటుకు గురిచేసింది. గతంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంతో పాటు జాతీయస్థాయిలో అధికారంలో ఉన్నప్పుడే.. ఉప ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సత్తా చాటింది. అటువంటిది ఇప్పుడు ఈ రెండు జెడ్పిటిసి ఎన్నికల్లో ఓడిపోవడం అనేది ఆ పార్టీకి చాలా నష్టమే. పార్టీలో ఒక అపనమ్మకాన్ని, నైరశ్యాన్ని అలుముకునేలా చేసింది ఈ ఫలితం. అందుకే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలను బాయ్ కట్ చేసేందుకు నిర్ణయించుకున్నట్లు సమాచారం. దానికి కారణాలు చెప్పుకునేందుకే.. కేంద్ర బలగాలతో ఎన్నికలు నిర్వహించాలన్న డిమాండ్. అయితే స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారిక నోటిఫికేషన్ వచ్చిన తర్వాత.. ఒక పద్ధతి ప్రకారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తన నిర్ణయాన్ని వెల్లడించే అవకాశాలు కనిపిస్తున్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో?

# నవంబర్ లో లోకల్ బాడీ ఎన్నికలు

హైదరాబాద్, సెప్టెంబర్ 15, **భారతశక్తి (ప్రతినిధి)**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు జరుగుతాయని అందరూ భావిస్తున్నారు. భారత ఎన్నికల సంఘం బీహార్ రాష్ట్ర ఎన్నికలతో పాటు అక్టోబర్ చివరి వారంలో లేదా నవంబర్ ప్రారంభంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను షెడ్యూల్ చేస్తుందని కాంగ్రెస్ అంచనా వేస్తోంది. దీంతో నవంబర్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందిగ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, మునిసిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించడానికి గతంలో నిర్ణయించిన సెప్టెంబర్ 30 గడువును పొడిగించాలని కోరుతూ ప్రభుత్వం వచ్చే వారం హైకోర్టును ఆశ్రయించడానికి ప్రయత్నాలు చేస్తోంది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల మీద కూడా క్లారిటీ రావాల్సి ఉంది.ఈ అంశంపై ఇటీవల అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు గవర్నర్, రాష్ట్రపతి ఆమోదం కోసం వేచి ఉన్నాయి. కోటా అంశంపై స్పష్టత వచ్చే వరకు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం కష్టమే. సెప్టెంబర్ చివరి నాటికి ఎన్నికలు పూర్తి చేయాలని జూన్‌లో ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అయితే సెప్టెంబర్ నెల దాదాపు సగం వరకు వచ్చింది. దీంతో ప్రభుత్వం అధికారికంగా మరింత సమయం కోరాలని నిర్ణయించింది. స్థానిక సంస్థల ఎన్నికలలో జాప్యం అనివార్యమన్నట్టుగా చెప్పారు. స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ కోటాను అమలు చేయడానికి కాంగ్రెస్ దృఢంగా కట్టుబడి ఉందని మరోసారి చెప్పారు. రిజర్వేషన్ల సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రభుత్వం ఎన్నికలను కొనసాగించదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకత్వం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ప్రాధాన్యత ఇస్తోందని పార్టీ అంతర్గత వర్గాలు చెబుతున్నాయి. అక్టోబర్ ప్రారంభంలో భారత ఎన్నికల సంఘం బీహార్ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్‌తో పాటు ఉప ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉందనే అభిప్రాయం ఉంది.అక్టోబర్ 2న దసరా తర్వాత వెంటనే జూబ్లీహిల్స్‌లో తన ప్రచారాన్ని ముమ్మరం చేయాలని పార్టీ ప్రణాళికలు సిద్ధం చేసింది. జూబ్లీహిల్స్‌లో విజయం సాధించడానికి అన్ని వనరులను ఉపయోగించాలని కాంగ్రెస్ అనుకుంటోంది.

# జగన్‌తో కలిసేది ఎవరు

నెల్లూరు, సెప్టెంబర్ 15, **భారతశక్తి (ప్రతినిధి)**

రాజకీయం రాజకీయంగానే చేయాలి. రాజకీయ కోణంలోనే చూడాలి. ఎవరి అవసరం.. ఏ పార్టీ అవసరం ఎప్పుడొస్తుందో తెలియదు. అందుకే మిగతా రాజకీయ పార్టీలతో సఖ్యత గానే ఉండాలి. ఈ విషయంలో ఏపీ సీఎం చంద్రబాబును మెచ్చుకోవాల్సిందే. ఎందుకంటే ఆయన ప్రతి పార్టీతోను మంచి సంబంధాలే నడుపుతారు. ఏ పార్టీతో వైరం పెట్టుకోరు. ఆయన చరిత్ర తీసుకుంటే ఇట్టే అర్థం అవుతుంది. వైసిపి హయాంలో రాజకీయ సంక్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడు కూడా ఆయనకు వామపక్ష నేతల మద్దతు లభించింది. విధానపరమైన అంశాల్లో తప్పించి.. వామపక్ష నేతలతో ఎప్పుడూ సఖ్యత గానే మెలుగుతారు. ఈసారి కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత కూడా వామపక్ష నేతల అభిప్రాయాలను గౌరవిస్తున్నారు. వారి వినతులను పరిగణలోకి తీసుకుంటున్నారు. అయితే ఆ విషయంలో జగన్మోహన్ రెడ్డి మాత్రం కాస్త భిన్నం. తనకు ఎవరి అవసరం లేదని.. ప్రజా మద్దతు ఉందని ఇతర రాజకీయ పార్టీలను నిర్లక్ష్యం చేశారు. ఇప్పుడు అది ఆయనకే శాపంగా మారింది.జాతీయస్థాయిలో ఎన్డీఏ కూటమికి వ్యతిరేకంగా ఇండియా కూటమి అవతరించింది. జాతీయ పార్టీగా కాంగ్రెస్ సారథ్య బాధ్యతలు చూస్తోంది. కానీ అది అధికారికంగా కాదు. అయితే ఇండియా కూటమిలో వామపక్షాలు కూడా కీలక భాగస్వాములు. అయితే ఏ రాష్ట్రంలోనైనా ప్రతిపక్షానికి వామపక్షాల బలం అవసరం. ప్రజా పోరాటాలు రాజకీయ పార్టీలు చేస్తే ప్రజలు ఒకలా కనెక్ట్ అవుతారు. అదే వామపక్షాలు, ప్రజా సంఘాలు చేస్తే ప్రజల్లోకి ఆ ఉద్యమ ఫలాలు బాగా వెళ్తాయి. అందుకే వైసిపి అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు వామపక్షాలతో కలిసి పోరాటాలు చేశారు. ప్రజా పోరాటాల విషయంలో అందర్నీ కలుపుకొని వెళ్లేవారు. అయితే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి ప్రజా పోరాటాలకు ఇతర రాజకీయ పార్టీలకు పిలుపునివ్వడం మాత్రం విశేషం.అయితే జగన్మోహన్ రెడ్డి పిలుపునకు వామపక్షాలతో పాటు కాంగ్రెస్ పార్టీ నుంచి పెద్దగా రెస్పాన్స్ రావడం లేదు. ఇటీవల ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణం, నిర్వహణ విషయంలో ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసింది. ప్రభుత్వ, ప్రైవేట్, పబ్లిక్ భాగస్వామ్యంతో నిర్మిస్తామని సీఎం చంద్రబాబు క్యాబినెట్ భేటీలో వెల్లడించారు. అయితే అది పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే కుట్రగా అభివర్ణించారు జగన్మోహన్ రెడ్డి. దీనిపై రాష్ట్రస్థాయిలో ఉద్యమించేందుకు సిద్ధపడుతున్నారు. అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరుతున్నారు. కానీ సహకరించేందుకు కాంగ్రెస్ పార్టీ కానీ.. వామపక్షాలు కానీ ముందుకు వచ్చే అవకాశం లేదు. గతంలో జగన్మోహన్ రెడ్డి అనుసరించిన వైఖరి ఒక కారణం కాగా.. ఇటీవల రాష్ట్రపతి ఎన్నికల్లో వ్యవహరించిన తీరు మరో కారణంకూటమి అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో జగన్మోహన్ రెడ్డి ఢిల్లీలో పోరాటం చేశారు. ఆ సమయంలో కొన్ని జాతీయ పార్టీల నేతలు వెళ్లి సంఘీభావం తెలిపారు. ప్రధానంగా ఇండియా కూటమిలోని ఉన్న కీలక పార్టీల నేతలు వెళ్లి మద్దతు ప్రకటించారు. అయితే ఆ సమయంలో వామపక్ష నేతలు కానీ.. కాంగ్రెస్ పార్టీకి కానీ కనీస సమాచారం లేదు. నాడు జాతీయస్థాయిలో జగన్మోహన్ రెడ్డికి మద్దతు తెలిపిన పార్టీలు ఇప్పుడు ఏపీలో లేవు. ఉన్న పార్టీల విషయంలో జగన్మోహన్ రెడ్డి నిర్లక్ష్యం చేశారు. అందుకే ఇప్పుడు ప్రజా పోరాటాల



విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో అడుగులు వేసేందుకు కాంగ్రెస్, వామపక్షాలు ముందుకు రావడం లేదు. ఒక విధంగా చెప్పాలంటే ఇది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంక్లిష్ట సమయం. నాడు జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యవహారాలే ఇప్పుడు ఆయనకు శాపంగా మారాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ప్రతికూల పరిస్థితులను తట్టుకోని.. లోకేష్ అడుగులు...

విజయవాడ, సెప్టెంబర్ 15, **భారతశక్తి (ప్రతినిధి)**

ప్రతికూల పరిస్థితులను అధిగమించి సమర్థ నాయకుడు అనిపించుకున్నారు చంద్రబాబు. 1995లో టిడిపి సంక్షోభంలో.. ఎన్టీఆర్ నుంచి పార్టీతో పాటు ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకున్న సమయంలో.. చంద్రబాబు వెన్నుపోటు దారుడు అని ముద్రపడింది. చాలా కాలం పాటు అపవాదు అలానే ఉండిపోయింది. కానీ తన పనితీరు, సమర్థతతో ఆ అపవాదును రూపుమాపుకున్నారు చంద్రబాబు. సమర్థతతో పాటు అభివృద్ధి అజెండా పుణ్యమా అని తనకంటూ ఇండియన్ పొలిటికల్ హిస్టరీలో స్థానం సంపాదించుకున్నారు. అయితే చంద్రబాబు మాదిరిగానే ఆయన కుమారుడు లోకేష్ సైతం రాజకీయాల్లో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్నారు. అయితే తండ్రి మాదిరిగానే సమర్థతతో వాటిని ఎదుర్కొనే తీరు మాత్రం అభినందనలు అందుకుంటోంది. ఆయన ఎదిగిన తీరు చాలా భిన్నంగా ఉంది. పొలిటికల్ గ్రాఫ్ కూడా చాలా వేగంగా విస్తరించింది. చంద్రబాబు తండ్రి గానే కాకుండా.. మార్గదర్శకుడుగా నిలిచారు. కుమారుడిని సమర్థవంతమైన నేతగా తీర్చిదిద్దారు. అదే సమయంలో లోకేష్ సైతం రాజకీయ పాఠాలను క్షుణ్ణంగానే నేర్చుకున్నారు.సంక్షోభాలను, సవాళ్లను ధీటుగా ఎదుర్కొన్నారు సీఎం చంద్రబాబు. ప్రతికూల పరిస్థితుల్లో ఈ రాష్ట్రానికి తొలిసారిగా ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు తన నాయకత్వ సమర్థత నిరూపించుకునేందుకు? చాలా రకాల అవకాశాలు వచ్చాయి. ముఖ్యంగా పెను విపత్తులు ఎదురైనప్పుడు.. ప్రజలను అలవోకగా కష్టాల నుంచి గట్టెక్కించగల నేర్పరి చంద్రబాబు. అందుకే ఒడిస్సా ప్రజలు సైతం చంద్రబాబు నాయకత్వాన్ని ఇష్టపడతారు. ప్రజలకు ఎన్నో రకాల ప్రకృతి వైపరీత్యాలనుంచి బయట పడేశారు చంద్రబాబు. అయితే ఇప్పుడు లోకేష్ సైతం చంద్రబాబు మాదిరిగానే ప్రజలకు అండగా ఉంటున్నారు. నేపాల్ లో చిక్కుకున్న తెలుగువారిని ఏపీకి రప్పించడంలో లోకేష్ విజయవంతం అయ్యారు. సింగిల్ హ్యాండ్ లో ఈ పెద్ద టాస్క్ ని డీల్ చేసి అందరి చేత అభినందనలు అందుకున్నారు.లోకేష్ అంటే టిడిపి శ్రేణులకే నమ్మకం లేనంత పరిస్థితి ఉండేది. అటువంటి సమయంలో లోకేష్ కంటే జూనియర్ ఎన్టీఆర్ను తెచ్చుకుంటే మంచిది అని అభిప్రాయం వినిపించేది. కానీ లోకేష్ అలా ఉండిపోలేదు. తనపై ఉన్న అభిప్రాయాన్ని మారేలా చేసుకున్నారు. పార్టీ శ్రేణుల బాగోగులు చూసే నేతగా ఎదిగారు. వారికి బీమా సౌకర్యాన్ని కల్పించి ధీమా కల్పించారు. ఎప్పటికప్పుడు పార్టీ క్యాడర్ తోనే కాదు నాయకులతో సమావేశాలు పెడుతూ.. పార్టీలో తన స్థానం ఏమిటో సంకేతాలు పంపారు. మొన్నటి వరకు పార్టీ అంటే చంద్రబాబు మాత్రమే అనే అభిప్రాయం ఉండేది. ఇప్పుడు మాత్రం



చంద్రబాబుతో పాటు లోకేష్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ముందు పార్టీ శ్రేణుల్లో పట్టు సాధించారు. సీనియర్లను సైతం ఆకట్టుకుంటున్నారు. పార్టీ మంత్రులతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులతో సమన్వయం చేసుకుంటున్నారు. వారందరూ తమ ఫ్యూచర్ లీడర్ లోకేష్ అని భావించేలా యువనేత తనను తాను ఆవిష్కరించుకోవడం గొప్ప విషయంఒకప్పుడు లోకేష్ అంటే చంద్రబాబు తనయుడు. వారసత్వంగా వచ్చిన నేత. అన్నింటికీ మించి బలవంతంగా రుద్దపడిన నాయకుడు. ఇలా రకరకాల అభిప్రాయాలు ఆయనపై ఉండేవి. అందుకే కేంద్ర పెద్దలు సైతం లోకేష్ నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్నారన్న ప్రచారం ఉండేది. కానీ ఇప్పుడు అదే లోకేష్ ను ఢిల్లీ పిలిపించుకుని మాట్లాడుతున్నారు కేంద్ర పెద్దలు. ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా ప్రత్యేకంగా సమయం ఇచ్చి లోకేష్ తో మాట్లాడుతున్నారు. కేంద్ర పెద్దలను, కేంద్ర మంత్రులను లోకేష్ అలవోకగా కలుస్తున్నారు. జాతీయస్థాయిలో సైతం తన పరపతిని పెంచుకుంటున్నారు. చంద్రబాబు సైతం ఒక వ్యూహం ప్రకారం లోకేష్ కు పనులు అప్పగిస్తున్నారు. వాటిని ఇట్టే పూర్తిచేసి ఆకట్టుకుంటున్నారు లోకేష్. కేవలం దర్శకత్వం మాత్రమే చేస్తున్నారు చంద్రబాబు. ఈ పరిస్థితి చూస్తుంటే భావి నాయకుడిగా తెలుగుదేశం పార్టీ గుర్తించింది. ఆపై కేంద్రం గుర్తించింది. జాతీయస్థాయిలో కూడా ఇప్పుడు బలమైన చర్చ సాగుతోంది. ఏదైనా లోకేష్ ను ప్రాజెక్ట్ చేస్తున్న తీరు అభినందనలు అందుకుంటోంది.

# నేపాల్... అంతా స్వయం కృతాపరాధమే

ఖాట్మాండు, సెప్టెంబర్ 15, **భారతశక్తి (ప్రతినిధి)**

నేపాల్.. ప్రపంచంలో ఏకైక హిందూ దేశం. రాచరికం నుంచి ప్రజాస్వామ్యంగా పరిణామం చెందినా ఇప్పటికీ అక్కడ సుస్థిర ప్రభుత్వం లేదు. కేవలం 3.5 కోట్ల జనాభాకు సుస్థిర పాలన అందించడంలో అక్కడి నేతలు విఫలమవుతున్నారు. కేవలం వ్యక్తిగత ప్రయోజనాల కోసమే అధికారాన్ని వాడుకుంటున్నారు. ఆర్థికంగా, రాజకీయంగా ఎదుగుతున్నారు. అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇక వీరి పిల్లలు వేసే వేషాలు మామూలుగా ఉండడం లేదు. తమ తల్లిదండ్రుల సంపాదించిన సొమ్ముతో విదేశాల్లో విలాసాలు చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా చెలరేగిగన ఆందోళనలు ఆ దేశ రాజకీయాల్లో ఒక ఆసియాలో అవినీతి ఎక్కువగా ఉన్న దేశాల్లో ఒకటి. ఈ అసమానతలు యువతను రోధాలకు దూరం చేసి, పొలిటికల్ 'నెపో కిడ్స్' (నెపోటిజం పిల్లలు)పై దృష్టి పెట్టేలా మార్చాయి.గత వారాల్లో, సోషల్ మీడియాలో 'నెపో కిడ్స్' ట్రెండ్ వైరల్ అయింది. ఇది రాజకీయ నేతల పిల్లల విలాస జీవనశైలిని టార్గెట్ చేసింది. మాజీ మంత్రి కుమార్తె శ్రింఖల ఖటీవాడ, మాజీ ప్రధాని కోడలు శివానా శ్రేష్ఠ, ప్రచండ మనవరాలు స్మితా దహాల్ వంటి వారి ఖరీదైన దుస్తులు, విదేశీ పర్యాటనలు, లగ్జరీ వస్తువులు ఎక్స్‌పోజ్ అయ్యాయి. ఎౌవజూనీఃజీఎతివబఔవజూజీశ్రీ హ్యాష్‌ట్యాగ్ మిలియన్ల వ్యూస్ సాధించింది, ఇది యువత ఆగ్రహాన్ని డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లకు



మార్చింది. ఈ క్యాంపెయిన్ టిక్‌టాక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్ వంటి సైట్లలో వ్యాపించి, సామాన్య ప్రజల బాధలతో పోల్చి సెటైర్‌లు, వీడియోలు సృష్టించింది. దీని పరిణామంగా, కొందరు తమ అకౌంట్లు మూసివేశారు, మరికొందరు ఆన్‌లైన్ యాక్టివిటీ ఆపేశారు.మీడియా నిషేధం (26 ప్లాట్‌ఫారమ్‌లపై) ఈ ట్రెండ్‌ను అడ్డుకోవడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యగా కనిపించింది. కానీ ఇది యువతను రోధాలకు దారి తీసింది. సెప్టెంబర్ 8న కాఠ్మండూలో మొదలైన నిరసనలు పార్లమెంట్ భవనంపై దాడులు, మంత్రుల ఇళ్లపై దాడులుగా మారాయి. పోలీసులు టియర్ గ్యాస్, రబ్బర్ బులెట్లు, లైవ్ ఫైరింగ్

కొత్త అధ్యాయాన్ని రాస్తున్నాయి. జనరేషన్ జెడ్ (జెన్ జెడ్) నేతృత్వంలో మొదలైన ఈ పోరాటం, అవినీతి, ఆర్థిక అసమానతలపై దృష్టి సారించడంతో ప్రభుత్వాన్ని కూల్చివేసింది. సోషల్ మీడియా నిషేధం ఈ తిరుగుబాటుకు ఊపందుకునేలా చేసింది, ఫలితంగా ప్రధాని కేపీ శర్మ ఓలీ రాజీనామా చేశారు. ఈ సంఘటనలు యువత ఆగ్రహాన్ని, ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని, సామాజిక మార్పు అవసరాన్ని సూచిస్తున్నాయి.నేపాల్‌లో యువత నిరుద్యోగం ఒక ప్రధాన సమస్యగా మారింది. 15?24 సంవత్సరాల దాటిన యువతలో 20.8% మంది నిరుద్యోగులుగా ఉన్నారు, ఇది వారిని విదేశాలకు వలసలు వెళ్లేలా చేస్తోంది. దేశంలో చేరుకున్న వార్షిక ఆదాయం సగటున 1,400 డాలర్లు మాత్రమే, 20% ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో, రాజకీయ నేతల కుటుంబాలు విలాసవంతమైన జీవితాలు గడపడం యువతలో ఆగ్రహాన్ని రేకెత్తించింది. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ నివేదికల ప్రకారం, నేపాల్ ఉపయోగించడంతో 19?31 మంది మరణించారు, వేలాది మంది గాయపడ్డారు. ప్రభుత్వం సైన్యాన్ని రంగంలోకి దించి, కర్ఫ్యూ విధించింది, ఇది హింసను మరింత పెంచింది. ఈ ఘటనలు యువత ఆందోళనలను అవినీతి వ్యతిరేక పోరాటంగా మాత్రమే కాకుండా, ప్రభుత్వ దమనపరమైన విధానాలపై తిరుగుబాటుగా మార్చాయి.హింసాత్మక ఆందోళనలు ప్రధాని కేపీ శర్మ ఓలీని రాజీనామా చేయించాయి. ఇది దశాబ్దాల్లో అరుదైన మార్పును తీసుకొచ్చింది. అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్ మధ్యవర్తిత్వం చేస్తూ, యువత నేతలతో చర్చలు జరుపుతున్నారు. సైన్యం పహారా విధించి, రాజ్యాంగపరమైన పరిష్కారాలు కోరుతోంది. యువత డిమాండ్లు: అవినీతి విచారణలు, రాజ్యాంగ మార్పులు, మరణించినవారి కుటుంబాలకు సహాయం, ఆస్తులపై దర్యాప్తు. మాజీ చీఫ్ జస్టిస్ సుషీలా కార్కి ఇంటరిమ్ పీఎంగా ఎంపిక అయినట్లు ట్రెండింగ్, ఇది యువత ఆశలకు కొత్త ఆకారాన్ని ఇస్తోంది.

# అందుబాటులోకి నానో యూరియా

ఏలూరు, సెప్టెంబర్ 15, **భారతశక్తి (ప్రతినిధి)**

ఏపీలో యూరియా కొరత పొలిటికల్ హీట్ ఎక్కించింది. ప్రభుత్వం యూరియా కొరత లేకుండా చేసాం అంటూ ప్రకటన చేసింది. కానీ ప్రతిపక్షాలు మాత్రం ఈ విషయంలో ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో యూరియాను పెద్ద ఎత్తున అందుబాటులోకి తెస్తోంది ఏపీ ప్రభుత్వం. మరోవైపు నానో




యూరియా సైతం అందుబాటులోకి వచ్చింది. బస్తాలను మోసుకెళ్లే పని లేకుండా అర లీటర్ నానో యూరియా వాడితే సరిపోతుంది. అంటే ద్రవ రూపంలో ఈ నానో యూరియా అందుబాటులోకి వచ్చింది. దీని వినియోగం కూడా చాలా సులువు అని చెబుతున్నారు అధికారులు. యూరియా కొరత ఉన్న నేపథ్యంలో ఈ నానో యూరియా వాడాలని అధికారులు సూచిస్తున్నారు. వరి, పత్తి వంటి పంటలపై ఈ నానో యూరియా పిచ్చికారి చేయవచ్చు. గత కొద్దిరోజులుగా అధికారులు అవగాహన పెంచడంతో ఈ నానో యూరియా వాడకం పెరిగిందిఅయితే ఇప్పటివరకు ఏపీలో పాత పద్ధతిలోనే ఎరువులను వాడుతున్నారు. నానో యూరియాత అధిక ప్రయోజనాలు ఉన్న దాని జోలికి పోవడం లేదు. వ్యవసాయ శాఖ నిపుణులు, శాస్త్రవేత్తలు యూరియాకు బదులుగా నానో యూరియా వాడాలని సూచిస్తున్నారు. సాధారణ యూరియా బస్తాలో ఉండే పోషకాలు.. అర లీటరు నానో యూరియాలో ఉంటాయని చెబుతున్నారు. సాధారణ యూరియా గుళికల రూపంలో ఉంటే.. నానో యూరియా ద్రవ రూపంలో ఉంటుంది. సాధారణంగా రైతులు ఉపయోగించే యూరియాలో కణాల పరిణామం 2.8-4 మిల్లీ మైక్రాన్లు ఉంటే.. అందులో మొక్కకు 30% వరకు మాత్రమే చేరుతుంది. మిగిలిన యూరియా నీటిలోనూ, భూమిలోను కలిసిపోతుందని నిపుణులు చెబుతున్నారు.శత శాతం పంటలకు ఉపయోగపడుతుంది. ఈ నానో యూరియా కణాల పరిణామం 32 నానో మైక్రాన్లు ఉంటుంది. ఏకంగా 80% పైగా మొక్కకు చేరుతుంది. అస్సలు వృథా ఉండదు. కాలుష్యం కూడా తగ్గే అవకాశం ఉంది. రైతులు ఉపయోగిస్తున్న సాధారణ యూరియా వేర్ల ద్వారా మొక్కకు అందెందుకు ఆలస్యం అవుతుంది. నానో యూరియా అలా మొక్కల ఆకులపై పిచికారి చేయగానే నేరుగా పత్ర హరితానికి చేరి వెంటనే ప్రభావం చూపుతుంది. ఎకరాకు అర లీటరు నానో యూరియా సరిపోతుంది. సాధారణ యూరియాతో పోల్చుకుంటే ధర కూడా తక్కువ. రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

# పాకిస్తాన్‌కు తీవ్ర అవమానం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15,

పహాల్గాం దాడి తర్వాత పాకిస్తాన్ తో క్రికెట్ ఆడటాన్ని సగటు భారతీయుడు తప్పు పట్టాడు. క్రికెట్ అభిమానులయితే భారత జట్టు మేనేజ్మెంట్ మీద తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రక్తం, నెత్తురు కలసి ప్రవహించలేవు అని చెప్పినవారు.. ఇప్పుడు ఎందుకు క్రికెట్ ఆడుతున్నారంటూ విమర్శించారు. సోషల్ మీడియాలో ఒక ఉద్యమాన్ని కూడా నడిపారు. మైదానంలో కాదు, చివరికి టీవీలో కూడా మ్యాచ్ చూడకూడదని తీర్మానించుకున్నారు. అయితే టీమిండియా ద్వైపాక్షిక సిరీస్ ఆడటం లేదని.. కేవలం న్యూట్రల్ వేదిక మీద మాత్రమే సిరీస్ ఆడుతోందని.. అది కూడా ఐసీసీ నిర్వహిస్తున్న మెగా టోర్నీ అని.. ఇందులో వివాదానికి తావు లేదని కేంద్ర క్రీడా శాఖ మంత్రి, బిసిసిఐ క్లారిటీ ఇచ్చాయి. అయినప్పటికీ వ్యతిరేక ఉద్యమం ఆగలేదు.మైదానంలోకి ప్రేక్షకులు భారీగానే వచ్చారు. టీవీలలో కూడా మ్యాచ్ ను భారీగానే వీక్షించారు. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన పాకిస్తాన్ జట్టు ముందు బ్యాటింగ్ ఎంచుకుంది.. భారత బౌలర్లు పిచ్ మీద డ్యూ ను సద్వినియోగం చేసుకొని అద్భుతంగా బౌలింగ్ వేశారు. నిర్ణీత 20 ఓవర్లలో పాకిస్తాన్ జట్టును 127 పరుగులకు పరిమితం చేశారు. కులదీప్ మూడు, అక్షర్, బుమ్రా చెరి రెండు వికెట్లు దక్కించుకున్నారు. పాకిస్తాన్ జట్టులో ఫర్హాన్ 40, అఫ్రీది 33 పరుగులతో టాప్ స్కోరర్లుగా నిలిచారు. చివర్లో అఫ్రిది 16 బంతుల్లో నాలుగు సిక్సర్లు కొట్టి 33 పగులు చేయడంతో పాకిస్తాన్ ఆమాత్రమైన స్కోర్ చేయగలిగింది.అనంతరం 128 పరుగుల విజయ లక్ష్యంతో రంగంలోకి దిగిన టీమిండియా ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. తొలి ఓవర్ నుంచి పాకిస్తాన్ మీద ఎదురుదాడికి దిగడం మొదలు పెట్టింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (31) దుమ్మురేపాడు. మరో ఓపెనర్ గిల్(10) నిరాశపరచాడు. కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్ (47×), తిలక్ వర్మ (31), శివం దుబే(10×) సత్తా చూపించడంతో భారత జట్టు 15.5 ఓవర్లలో మూడు వికెట్ల కోల్పోయి టార్గెట్ ఫినిష్ చేసింది. ఈ విజయం ద్వారా టీమిండియా టాప్ 4 లోకి చేరుకుంది..

# ఓవర్ నైట్ స్టార్‌గా తేజ

హైదరాబాద్, సెప్టెంబర్ 15, **భారతశక్తి (ప్రతినిధి)**తేజ సజ్జ హీరో గా నటించిన 'మిరాయ్' చిత్రం రీసెంట్ గానే భారీ అంచనాల నడుమ విడుదలై బాక్స్ ఆఫీస్ వద్ద అద్భుతాలను నెలకొల్పుతూ ముందుకు దూసుకుపోతుంది. నిర్మాతలు చెప్తున్నా లెక్కల ప్రకారం ఈ సినిమాకు రెండు రోజుల్లో వరల్డ్ వైడ్ గా 55 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ వసూళ్లు వచ్చాయి. సాధారణంగా ఏ సినిమా నిర్మాత అయినా వచ్చిన డబ్బులకంటే ఎక్కువ డబ్బులు వచ్చినట్టుగా పోస్టర్స్ లో వేసి చూపిస్తుంటారు. కానీ మిరాయ్ నిర్మాతలు అలా చేయడం లేదు. ఎంత కలెక్షన్స్ అయితే వచ్చాయో, అంతే పోస్టర్స్ లో వేసే ప్రయత్నం చేశారు. 55 కోట్ల రూపాయిల గ్రాస్ అని చెప్పారు కానీ, ట్రేడ్ విశ్లేషకులు అందిస్తున్న లెక్కల ప్రకారం చూస్తే ఈ చిత్రానికి రెండు రోజుల్లో వచ్చింది 53 కోట్ల రూపాయిలు మాత్రమే. కానీ తెలుగు రాష్ట్రాల్లో మాత్రం మొదటిరోజు కంటే ఎక్కువ వసూళ్లు వచ్చాయని అంటున్నారు.ట్రేడ్ పండితులు అందిస్తున్న సమాచారం ప్రకారం ఈ చిత్రానికి రెండవ రోజున 8 కోట్ల 20 లక్షల రూపాయిల షేర్ వసూళ్లు వచ్చాయట. ఈ ఏడాది భారీ అంచనాల నడుమ విడుదలైన రామ్ చరణ్ గేమ్ చేంజర్, పవన్ కళ్యాణ్ 'హరి హర వీరమల్లు' చిత్రాలకు కూడా ఈ రేంజ్ షేర్ వసూళ్లు రాకపోవడం గమనార్హం. మూడవ రోజు అయితే రెండవ రోజు కంటే అద్భుతమైన ఆక్యుపెన్సీలు నమోదు అవుతున్నాయట. ప్రస్తుతం ఉన్న ట్రెండ్ ప్రకారం చూస్తే ఈ చిత్రం కచ్చితంగా రెండవ రోజు కంటే ఎక్కువ వసూళ్లను రాబట్టే అవకాశం ఉందని అంటున్నారు.

హిందీ లో కూడా రెండవ రోజున ఈ చిత్రానికి 3 కోట్ల 50 లక్షల రూపాయిల నెట్ వసూళ్లను రాబట్టింది. గ్రాస్ వసూళ్లు దాదాపుగా 5 కోట్ల రూపాయిల వరకు ఉండొచ్చు. ఓవర్సీస్ లో కూడా రెండవ రోజున ఈ చిత్రం హాఫ్ మిలియన్ డాలర్ల గ్రాస్ వసూళ్లను రాబట్టినట్టు సమాచారం.ఓవరాల్ గా చూస్తే రెండవ రోజున ఈ చిత్రానికి 27 కోట్ల రూపాయిల వరకు గ్రాస్ వసూళ్లు వచ్చాయని అంటున్నారు. ఈరోజు 30 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు వస్తాయట. అలా ఓవరాల్ గా ఈ చిత్రం మూడు రోజుల్లో 85 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ వసూళ్లను రాబట్టే సూచనలు కనిపిస్తున్నాయని, బ్రేక్ ఈవెన్ మార్కుని కూడా అవలీల గా దాటిందని అంటున్నారు. మరి ఇదే రేంజ్ స్టడీ రన్ ని ఈ చిత్రం రేపటి నుండి కూడా కొనసాగించగలిగితే ఫుల్ రన్ లో ఎంత వసూళ్లు వస్తాయో చూడాలి. 'హనుమాన్' చిత్రం దాదాపుగా 400 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లను రాబట్టింది. మిరాయ్ చిత్రం కనీసం 200 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లను అయినా రాబడుతుందో లేదో చూడాలి.

# ఖమ్మం కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు

ఖమ్మం సెప్టెంబర్ 15, **భారతశక్తి ప్రతినిధి)**

ఖమ్మం కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు బయటపడింది. ఇరువర్గాలు కర్రలతో పరస్పర దాడులు జరుపుకున్నాయి. ఘటనలో ఒక వ్యక్తి చెవి తెగిపోయింది. ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలో వర్గపోరు నేపథ్యంలో పార్టీ నేతలు కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. న్న ఒక వ్యక్తి చెవి తెగిపోగా, మరో వ్యక్తిని మహిళలు చెప్పులతో కొట్టారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అందరిని చెదరగొట్టారు.

# శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం..

## 24 గంటలు అందుబాటులో ఉంటాం ... తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు

తిరుపతి సెప్టెంబర్ 15, **భారతశక్తి ప్రతినిధి)**



శాంతి భద్రతల పరిరక్షణే పోలీసుల ధ్యేయమని తిరుపతి జిల్లా ఎస్పీగా ఎల్. సుబ్బారాయుడు తెలియజేశారు. ఆదివారం మొదట తిరుమల లో శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్ పటిష్టంగా ఉంచడమే పోలీసుల ధ్యేయమని, 24 గంటల పాటు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లా ప్రజలు సమస్యలు ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని, పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేయడంతో పాటు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల అత్యంత కఠినంగా ఉంటామన్నారు. విజిబుల్ పోలీసింగ్ ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల నుండే కాకుండా ప్రపంచంలోని అన్ని దేశాల నుండి శ్రీవారిని దర్శించుకునేందుకు ప్రతినిత్యం వేలాది సంఖ్యలో భక్తులు వస్తారని, వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలీస్ శాఖ చర్యలు చేపడుతుందన్నారు.

# తక్షణమే వేతనం చెల్లించాలి

విశాఖపట్నం సెప్టెంబర్ 15, **భారతశక్తి ప్రతినిధి)**

విశాఖ ఉక్కు కార్మికులకు తక్షణమే వేతనం చెల్లించాలని స్టీల్ సిఐటియు గౌరవ అధ్యక్షులు జె అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. నేడు స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో ఉక్కు ప్రధాన పరిపాలన భవనం ఎదుట కంచాలు కొట్టి తమ నిరసనలు ఉక్కు కార్మికులు, ఉక్కు మహిళలు తెలియజేశారు. ధర్నాకు అధ్యక్షులుగా స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటిదాస్ వ్యవహరించారు.

ఈ ధర్నా ను ఉద్దేశించి జె అయోధ్య రామ్ మాట్లాడుతూ ఉక్కు కార్మికులకు జీతాలు చెల్లించామని కేంద్ర మంత్రివర్యులు ప్రకటించడం అత్యంత దుర్మార్గమని ఆయన అన్నారు. ఉక్కు కార్మికులకు గత సంవత్సర కాలంగా పూర్తి జీతాలు చెల్లించకుండా యాజమాన్యం మొండి వైఖరిని ప్రదర్శిస్తోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. జీతాలు చెల్లించమని అడిగిన కార్మిక నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తూ షోకాజ్ నోటీసులు ఇచ్చే ప్రయత్నం తక్షణం విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు వాస్తవ విషయాలను గ్రహించి కేంద్రం పైన స్టీల్ యాజమాన్యం పైన తగిన సూచనలు ఇచ్చి తక్షణమే వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా స్టీల్ కార్మికులకు చెల్లించాల్సిన బోనస్ పై చర్చలు జరుపుతుంటే ఇక్కడ స్థానిక స్టీల్ యాజమాన్యం తో గుర్తింపు యూనియన్ చర్చలు జరిపి తక్షణమే ఉక్కు కార్మికులకు జీతాలు, బకాయి పడిన జీతాలు మరియు బోనస్ చెల్లించే విషయంపై తగిన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు గా గతంలో ఈ అంశంపై సంతకాలు సేకరించామని ఆ సంతకాలను ఉక్కు యాజమాన్యానికి అందిస్తామని ఆయన అన్నారు. అప్పటికి స్టీల్ యాజమాన్యం తగిన చర్యలు చేపట్టుకుంటే కార్మిక వర్గాన్ని చైతన్యపరిచి సమ్మెకు వెళ్లడానికి కూడా సిద్ధంగా ఉన్నామని ఆయన హెచ్చరించారు. కనుక ఈ అంశాన్ని సానుకూలంగా పరిష్కరిస్తూ తక్షణమే వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

జిల్లా సిఐటియు నాయకులు ఎన్ రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా అని ఆయన ప్రశ్నించారు. పనిచేసిన కాలానికి కార్మికులకు జీతాలు చెల్లించమని అడుగుతున్న కార్మికులపై చర్యలు చేపట్టడం అత్యంత దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులకు చేసుకొని స్టీల్ కార్మికులకు తక్షణం వేతనం చెల్లించాలని, తొలగించిన నిర్వాసిత కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, పూర్తిస్థాయి ఉత్పత్తికి అవసరమైన ముడి ఖనిజాన్ని సమకూర్చే విధంగా కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి దాస్, మహిళా నాయకురాలు కె వేణు మాట్లాడుతూ కార్మికుల హక్కు అయినటువంటి వేతనాలు చెల్లించడంలో యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరిని వారు తీవ్రంగా విమర్శించారు. స్టీల్ యాజమాన్యం వేతనాలు చెల్లించడంలో తగిన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు పి శ్రీనివాసరాజు, కె గంగాధర్, టి వి కె రాజు, పుల్లారావు, బి అప్పారావు, వి ప్రసాద్, యు వెంకటేశ్వర్లు, బి తౌడన్న, డి కృష్ణమూర్తి,శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, అప్పారావు, రాజు, సంజీవరావు, కె ఆర్ కె రాజు, రామ్ శేఖర్, పవన్, దుర్గాప్రసాద్ తదితరులతోపాటు వివిధ విభాగాల అధ్యక్ష కార్యదర్శులు, అధిక సంఖ్యలో కార్మికులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం చంద్రబాబు అలోచనలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు ఎదగాలి

## పజలకు సంతృప్తి స్థాయిలో సేవలు అందచేయాలి :మంత్రి పయ్యావుల కేశవ్

అమరావతి సెప్టెంబర్ 15, **భారతశక్తి ప్రతినిధి)**



రాష్ట్ర సచివాలయంలో జరిగిన 4 వ జిల్లా కలెక్టర్ల సమావేశం లో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రసంగించారు. ప్రభుత్వ ముఖ చిత్రాన్ని క్షేత్ర స్థాయిలో ప్రతిభవించే విధంగా జిల్లా కలెక్టర్ కృషి చేయాలి. కొత్త విషయాలను కొత్తగా ఆలోచించే ఎనర్జీ, జీల్ ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పని చేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ముఖ్య మంత్రి ఉన్నత స్థాయి ఆలోచనలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ ఎదగాలి, ప్రజలకు సంతృప్తి స్థాయిలో సేవలు అందచేయాలి. ఏ ప్రభుత్వంలోనూ ప్రణాళిక శాఖలకు ఎవరు అంతగా ప్రాధాన్యత నివ్వరు, కానీ ఈ ముఖ్య మంత్రి ఎంతో ఉన్నతంగా ఈ శాఖను వినియోగించు కోవడం వల్ల జీఎస్డీపీ సాధనలో దేశంలోనే ప్రథమ స్థానంలో రాష్ట్రాన్ని నిలపడం జరిగింది. జాతీయస్థాయి జీఎస్డీపీ 8.8% ను అధిగమిస్తూ రాష్ట్ర జీఎస్డీపీ 10.8% ని సాధించడం జరిగింది. వినూత్న ఆలోచనలతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో సమూల మార్పులు తీసుకు వస్తూ రాష్ట్ర ఆదాయాన్ని, సంపదను సృష్టించడం జరుగుతున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రిని స్ఫూర్తిగా తీసుకుంటూ జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో అంకితభావంతో పనిచేస్తూ 2026 కార్యచరణ ప్రణాళికను పటిష్టంగా అమలు చేస్తూ ప్రజల సంతృప్తి స్థాయిని పెంచాలని పిలుపునిచ్చారు.

# సునీతమ్మకే టిక్కెట్

హైదరాబాద్, సెప్టెంబర్ 15, **భారతశక్తి ప్రతినిధి)**



త్వరలోనే జూబ్లీహిల్స్ ఉపఎన్నిక రాబోతుంది. ఇప్పటికే రాష్ట్ర రాజకీయాలు రసవత్తరంగా సాగుతుండగా.. ఈ బైపోల్ తో మరో లెవల్ కి వెళ్లే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ సర్కార్ పై తీవ్రస్థాయిలో వ్యతిరేకత ఉందని బీఆర్ఎస్ చెబుతుంటే? అలాంటి పరిస్థితే లేదంటోంది కాంగ్రెస్. ఇదే టైమ్ లో కాంగ్రెస్, బీఆర్ఎస్ లను టార్గెట్ చేస్తూ బీజేపీ నేతలు వాయిస్ పెంచుతున్నారు. ఇలాంటి పరిస్థితుల మధ్య గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎవరు పైచేయి సాధిస్తారనేది ఆసక్తికరంగా మారింది. అసెంబ్లీ ఎన్నికలో ఇక్కడ్నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపినాథ్ గెలిచారు. అనారోగ్యంతో ఆయన ఇటీవలే మృతి చెందటంతో ఇక్కడ ఉపఎన్నిక రానుంది. దీంతో ఈ సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవటం బీఆర్ఎస్ సవాల్ అనే చెప్పొచ్చు. గతంలో కంటోన్మెంట్ లో కూడా సిట్టింగ్ ఎమ్మెల్యే మృతి చెందటంతో ఉపఎన్నిక జరిగింది. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి గెలిచారు. అయితే ఇక్కడ మాత్రం...అలా జరగకుండా పక్కాగా అడుగులు వేసే పనిలో పడింది బీఆర్ఎస్ నాయకత్వం. ఈ ఉపఎన్నిక కోసం ఎవర్నీ అభ్యర్థిగా నిలపాలనే విషయంపై బీఆర్ఎస్ బాగానే కసరత్తు చేసింది. పార్టీకి చెందిన పీజేఆర్ కుమారుడైన విష్ణువర్ధన్ రెడ్డితో పాటు రావుల శ్రీధర్ రెడ్డి పేర్లను పరిశీలించింది. అంతేకాకుండా మాజీ మంత్రి పువ్వాడ అజయ్ పేరును కూడా పరిశీలించినట్లు వార్తలు వచ్చాయి. అయితే ఇవన్నీ కాకుండా...మాగంటి గోపినాథ్ భార్య సునీతకే టికెట్ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. తాజాగా తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తలతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేటీఆర్... మాగంటి గోపినాథ్ సతీమణి సునీతకు అండగా పార్టీ ఉంటుందన్నారు. ఆపదలో ఉన్నప్పుడు గోపీనాథ్ కుటుంబం నియోజకవర్గ ప్రజలను ఆదుకున్నదని... ఇప్పుడు ఆపదలో ఉన్న ఆయన కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత మనపై ఉందంటూ చెప్పుకొచ్చారు. కేటీఆర్ వ్యాఖ్యలతో దాదాపుగా ఆమెకే టికెట్ ఖరారైనట్లు తెలుస్తోంది. అయితే అధికారికంగా త్వరలోనే పేరును ప్రకటించే అవకాశం ఉంది. ఇక 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజకవర్గంలో పోలింగ్? శాతం 47.49 నమోదైంది. ఈ నియోజకవర్గం నుంచి మాగంటి గోపీనాథ్ వరుసగా 3 పర్యాయాలు విజయం సాధించారు. 2023 ఎన్నికల్లో మాగంటి 80,549 ఓట్లు సాధించగా? సమీప కాంగ్రెస్ అభ్యర్థి అజాహరుద్దీన్?కు 64,212 ఓట్లు దక్కిన సంగతి తెలిసిందే. మరోవైపు ఎన్నికల సంఘం తాజాగా విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం? జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో 3,92,669 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 2,04,288 మంది పురుషులు కాగా?. 1,88,356 మంది మహిళలు ఉన్నారు. ఈ ముసాయి జాబితాపై అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు ఉంటే సెప్టెంబర్ 17 వరకు అప్లికేషన్లు ఇవ్వొచ్చని సూచించింది. ఇక మార్పులు చేర్పులు మాత్రమే కాకుండా? కొత్తగా ఓటు నమోదు కూడా చేసుకునే వీలు ఉందని ఈసీ తెలిపింది. వచ్చిన అభ్యంతరాలను సెప్టెంబర్ 29వ తేదీ వరకు పరిశీలిస్తారు. సెప్టెంబర్ 30వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. ఉపఎన్నిక కోసం 407 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు.

# సిటీ అస్తవ్యస్తం

## ఇంటర్నెట్, కేబుల్, టెలిఫోన్ సేవలు తీవ్ర అంతరాయం

హైదరాబాద్, సెప్టెంబర్ 15, **భారతశక్తి ప్రతినిధి)**



హైదరాబాద్ నగరంలో నెల రోజులుగా ఇంటర్నెట్, కేబుల్, టెలిఫోన్ సేవలు తీవ్ర అంతరాయాన్ని ఎదుర్కొంటున్నాయి. విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్స్‌ను అధికారులు కత్తిరించడంతో ఈ సమస్య తలెత్తింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో వేలాడే తీగలను తొలగించాలనే ఉద్దేశంతో తీసుకున్న చర్యలు, ప్రజల రోజువారీ జీవనాన్ని దెబ్బతీస్తున్నాయి. ఈ నిర్ణయం వల్ల సచివాలయం వంటి కీలక సంస్థల నుంచి సామాన్య పౌరుల వరకు అందరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ స్తంభాలపై సుమారు 2 వేల కిలోమీటర్ల పొడవైన ఇంటర్నెట్, కేబుల్ టీవీ, మరియు టెలిఫోన్ కేబుల్స్ ఉన్నాయి. ఈ కేబుల్స్ నగర జీవనానికి అత్యవసరమైనవి. అయితే, వేలాడే తీగలు వాహనాలకు ఇబ్బంది కలిగిస్తున్నాయని, ఇటీవల రామాంతాపూర్‌లో జరిగిన ప్రమాదం వంటి సంఘటనలు జరుగుతున్నాయని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. దీని పరిష్కారంగా, కోర్టు ఆదేశాలతో అధికారులు కేబుల్స్‌ను తొలగిస్తున్నారు. కానీ, ఈ చర్యలు సమస్యను పరిష్కరించడానికి బదులు, సచివాలయం వంటి కీలక ప్రాంతాల్లో సేవల నిలిచిపోవడానికి దారితీశాయి. వర్క్ ఫ్రం హోం ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, మరియు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైకోర్టు ఆదేశాలను అమలు చేసే క్రమంలో అధికారులు తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి. కేబుల్స్‌ను నిర్వహించే ఆపరేటర్లు లేదా ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లపై చర్యలు తీసుకోవడానికి బదులు, అధికారులు కేబుల్స్‌ను నేరుగా కత్తిరించడం ద్వారా ప్రజలకు సేవలను ఆపేస్తున్నారు. ఇది ప్రజల రోజువారీ జీవనాన్ని దెబ్బతీస్తోంది. టీవీ ప్రసారాలు నిలిచిపోవడం, ఫోన్ సేవలు అందుబాటులో లేకపోవడం, మరియు ఆన్‌లైన్ తరగతులకు అంతరాయం కలగడం వంటి సమస్యలు తలెత్తాయి. ఈ చర్యలు చిన్న వ్యాపారాలను మూతపడే పరిస్థితికి తీసుకొస్తున్నాయి. ఇంటర్నెట్, టెలికమ్యూనికేషన్ సేవలు నీటి, విద్యుత్ వంటి ప్రాథమిక అవసరాలుగా మారాయి. చట్టప్రకారం, బిల్లులు చెల్లించే ప్రజలకు ఈ సేవలు అందించడం సర్వీస్ ప్రొవైడర్ల బాధ్యత. అయితే, అధికారుల నిర్ణయాలు ఈ ప్రాథమిక హక్కును ఉల్లంఘిస్తున్నాయని ఆరోపణలు వస్తున్నాయి. గతంలో సుప్రీం కోర్టు కూడా ఇంటర్నెట్ సేవలను అంతరాయం కలిగించడం ప్రజల హక్కుల ఉల్లంఘనగా పరిగణించింది.

అయినప్పటికీ, హైదరాబాద్‌లో ఈ సమస్యకు పరిష్కారం కనిపించడం లేదు. ఈ సమస్యకు పరిష్కారంగా, అధికారులు కేబుల్ నిర్వాహకులు, సర్వీస్ ప్రొవైడర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. వేలాడే తీగల సమస్యను పరిష్కరించడానికి కేబుల్స్‌ను సరిగ్గా నిర్వహించేలా నిబంధనలు అమలు చేయాలి, కానీ సేవలను నిలిపివేయడం సరైన పరిష్కారం కాదు. సమస్యకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడం ద్వారా, ప్రజల ఇబ్బందులను తగ్గించవచ్చు. అలాగే, ఇంటర్నెట్ మరియు కేబుల్ సేవలను పునరుద్ధరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి.

# వరికుంటపాడులో ఉద్రిక్తత

## మైనింగ్ కు వ్యతిరేకంగా గ్రామస్తుల అందోళన భారీగా పోలీసుల మొహరింపు

నెల్లూరు సెప్టెంబర్ 15, **(భారతశక్తి ప్రతినిధి)**

నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలంలో నూతనంగా ఓ కొండ ప్రాంతంలో మైనింగ్ చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు పొందేందుకు ప్రజాభిప్రాయ సేకరణ సేకరించారు,ఈ ప్రజాభిప్రాయ సేకరణలో నాలుగు గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో తమ ప్రాంతంలో మైనింగ్ చేపట్టవద్దని మైనింగ్ చేపడితే కొండ మొత్తం తవ్వేస్తారని ఈ ప్రాంతంలో వ్యవసాయ పొలాలు, పాడిపంటలు వర్షాధారంతోనే తమ నాలుగు గ్రామాల ప్రజలు జీవిస్తున్నారని అంటున్నారు. మైనింగ్ చేపడితే ఈ కొండ మొత్తం కనుమరుగైపోయి తమ బతుకులు చిద్రమైపోతాయని పశువులు కూడా తినేందుకు గడ్డి దొరకదని వాతావరణం మొత్తం కాలుష్యం అయిపోతుందని చెరువులకు నీరు వచ్చే మార్గాలు కూడా మూసుకుపోతాయని కావున తాము బ్రతకాలంటే "మైనింగ్ వద్దు ప్రజలే ముద్దు" అనే నినాదంతో గత మూడు నెలలుగా ఉద్యమం చేపట్టారు ఇటీవల తమ సమీపంలోని జాతీయ రహదారిని దిగ్బంధించడం, స్థానిక ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ని అడ్డుకోవడం,రాజకీయ నాయకులు మనసుమారాలని దేవాలయాల్లో పూజలు చేయడం లాంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు, ఈ క్రమంలో అనేక మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు, ఈ నేపథ్యంలో బీసీవై పార్టీ అధ్యక్షులు బోడె రామచంద్ర యాదవ్ ఈరోజు సాయంత్రం మూడు గంటలకు వరికుంటపాడు మండలం లోని మైనింగ్ వద్దు అంటున్న గ్రామాలలో పర్యటిస్తారు అన్న సమాచారంతో పోలీసులు పెద్ద ఎత్తున మొహరించారు,ముందుగా వరికుంటపాడు మండలంలో కొన్ని గ్రామాలతో పాటు ఉదయగిరి సర్కిల్ పరిధిలో 144 సెక్షన్ తో పాటు పోలీస్ యాక్ట్ 1912 సెక్షన్ 30 ని కూడా అమలు చేస్తున్నామని ఉదయగిరి నియోజకవర్గంలో ప్రదర్శనలు, గుంపులుగా చేరడాలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, సందర్శనాలు లాంటివి చేయరాదని పోలీసులు నోటీసులు జారీ చేశారు,దీంతో పాటు పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మొహరించి వీధుల్లో కవాతులు నిర్వహించారు, ఎన్నికల సమయంలోనూ లేక లా అండ్ ఆర్డర్ గతితప్పినప్పుడు మాత్రమే పోలీసులు తమ బలప్రదర్శనను ప్రదర్శిస్తారు,అలాంటిది ఈరోజు బోడే రామచంద్ర యాదవ్ వరికుంటపాడు మండలంలో పర్యటిస్తారా లేకుంటే ఆయన్ను పోలీసులు అడ్డుకుంటారా అనేది చూడాలి,ఇటీవలే నెల్లూరు జిల్లాలోని కందుకూరు నియోజకవర్గంలో ఇండోసోల్ కంపెనీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కందుకూరు నియోజకవర్గానికి వెళ్లాలనుకున్న బోడే రామచంద్ర యాదవ్ ను వెంకటాచలం టోల్ ప్లాజా వద్ద పోలీసులు అడ్డుకుని వెనక్కి పంపించేశారు,

# శివ శివా.. ఇదేమి అపచారం శివయ్యా..!

భక్తుల మనోభావాలకు భంగం కలిగించిన ఆలయ పూజారి

-వేటుపడిన నడవడికలో మార్పు రాలే.!

-మంత్రాలు పలకాలంటే మద్యం సేవించాల్సిందే.!

-పురోహిత్యంలో ఎన్ని సార్లు మందలించిన తీరుమారని వైనం

-ఎమ్మెల్యేకు వినతిపత్రాలు సమర్పణ

-సస్పెన్షన్ పూర్తి అయ్యేవరకు తనయుడిని కొనసాగించాలంటూ విశ్వప్రయత్నాలు



మణుగూరు, సెప్టెంబర్ 15 (భారతశక్తి): ముల్లోకాలను వేలే పరమ శివుడిని దర్శించు కోవాలంటే భక్తులు నియమనిష్ఠలతో పవిత్రంగా దేవాలయాలకు వస్తుంటారు. అలాంటి పరమ శివుడికి భక్తులకు మధ్య అనుసంధానంగా వ్యవహరించే ఆలయ పూజారి నడవడిక భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ఉందని భక్తులు పెదవి విరుస్తున్నారు. దింతో భక్తులు శివ శివా.. ఇదేమి అపచారం శివయ్య.! అంటూ నీమీదే భారం వేస్తున్నామని మొక్కులు చెల్లించుకొని వెనుతిరుగుతున్నారు. భక్తుల కోరిన కోరికలు తీర్చే నీలకంఠేశ్వరుని సన్నిధిలో ఓ పూజారి రోజు రోజు కు ఓ కుయుక్తితో వ్యవహరిస్తున్నారు. ఇదంతా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని పాత మణుగూరులో స్వయంభూగా వెలసిన శ్రీశ్రీశ్రీ నీలకంఠేశ్వర ఆలయంలో అర్చకుడి వ్యవహార శైలితో ఆలయ నిర్వహణ గాడి తప్పుతుందని భక్తులు ముక్కున వేలుసుకుంటున్నారు. అధికారులను కూడా లెక్క చేయని ఆయన తీరుతో దేవాదాయశాఖ అధికారులు కూడా ఏమి చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. దీని ప్రభావం ఆలయ ప్రతిష్టత, భక్తులపై స్పష్టంగా కనిపిస్తోంది. అర్చకుని వ్యవహారతీరుపై భక్తుల ఫిర్యాదుతో దేవాదాయ అధికారులు ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. అయినా ఆ పూజారి తీరు మార్చుకోక దేవాదాయ శాఖ అధికారులపైనే ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారని, తిరిగి తన పాత పోకడనే అనుసరిస్తున్నారని, భక్తులు ఆరోపిస్తున్నారు. దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు చుక్కలు చూపించి, శివయ్య సన్నిధిలో తప్పులు మీద తప్పులు చేసిన ఆపూజారి మాకు వద్దే వద్దు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శివ శివా ఇదేం అపచారం అంటూ భక్తులు లోలోపల మదన పడుతున్నారు.

**రచ్చకెక్కిస్తున్న ఆ అర్చకుడు**

పురాతన నీలకంఠేశ్వర ఆలయంలో పూజారి వ్యవహారంపై భక్తుల ఫిర్యాదులతో పాటు పలు పత్రికలలో కథనాలు రావడంతో అధికారులు ఆయనను అర్చకత్వ బాధ్యతల నుండి తొలగించారు. దీనిని జీర్ణించుకోలేని ఆ పూజారి ఆలయ పతిష్టతను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారని, భక్తులు చెప్తున్నారు. అటు అధికారులపైన, ఆలయ సిబ్బందిపైన రోజుకో రకంగా కుయుక్తులతో గ్రామస్తులకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు తప్పుడు ఫిర్యాదులు చేస్తూ శివయ్య పతిష్టతను రచ్చకెక్కిస్తున్నారని భక్తుల నుండి అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. తనకు తిరిగి మళ్లీ పూజారి బాధ్యతలను అప్పగించాలని, సస్పెన్షన్ పూర్తయ్యే వరకు తనయుడికి బాధ్యతలు ఇవ్వాలని, అనారోగ్య సమస్యతో, మానసిక పరిస్థితి బాగా లేక పోవడం వల్ల ఆలయంలో నిద్ర చేశానని, దానిని వేరే రకంగా వక్రీకరించారని ఆలయ అధికారులపై పూజారి వాదనకు దిగుతున్నారు. కానీ ఆలయ పూజారి గతంలో కూడా భక్తుల కానుకల విషయంలో చేతివాటం ప్రదర్శించారని, కాసులిచ్చే వారికే పెద్దపీట వేస్తూ స్వామి దర్శనం, పూజలు, హెూమాలలో వారికే ప్రాధాన్యం కల్పించారని, సామాన్య భక్తులకు చుక్కలు చూపించారని, భక్తులు ఆరోపిస్తున్నారు. ఆలయ నిర్వహణ అంతా దేవాదాయ శాఖ పరిధిలో ఉన్నా.. ఆలయ కమిటీ ఉన్న, ఇక్కడ మాత్రం ఆ పూజారిదే పెత్తనమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు ఆలయ కమిటీ కూడా ఆయన గుర్రుగా ఉన్నట్టు తెలుస్తుంది. భక్తుల మనోభావాలకు దెబ్బతినకుండా పెద్దపీట వేస్తామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొంటున్నారు.

**తనయుడికి పురోహిత్యం కట్టబెట్టేందుకు ప్రయత్నం**

ఆలయంలో పూజలు, మంత్రాలు చదవాలంటే మద్యంతో నాలుక తడవాల్సిందేనని స్వయాన ఆయన తనయుడు, భక్తులు చెపుతున్నారు. నియమ నిష్ఠలతో పవిత్రంగా భక్తులు దైవ దర్శనానికి వస్తే వారి మనోభావాలను అర్చకులు అపవిత్రత చేస్తున్నారని భక్తులు ఆలయ నిర్వహణాధికారికి ఫిర్యాదులు చేసిన సంధర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఎన్నో సార్లు ఆలయ అధికారులు, భక్తులు మందలించిన వ్యవహార శైలిలో మార్పు రాలేదని భక్తులు తెలిపారు. చేతుకాలక ఆకులు పట్టుకున్న చందంగా మద్యం బాటిల్స్ తో ఆలయంలో దొరకడంతో దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల నుండి వేటు పడింది. దింతో పూజారి, సన్నిహితులు కలిసి చుట్టుపక్కల వారి చేత సంతకాలు సేకరించి ఆయన తనయుడికి భాధ్యతలు అప్పగించాలని స్థానిక ఎమ్మెల్యే కు వినతిపత్రాన్ని సమర్పించారని తెలుస్తోంది. అంతేకాకుండా ఉన్నతాధికారులకు కూడా వత్తిడికి గురిచేస్తున్నారని సమాచారం. పూజారి పలుకుబడి ఉపయోగించి సామా, దాన, దండోపాయలతో మరల తిరిగి నిలకంఠేశ్వర స్వామి ఆలయంలో అర్చకత్వం పొందేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తుంది.

**కానుకలు .. దక్షిణలు ఆయనకే**

ఇక్కడ ఆలయానికి వేలాదిగా వచ్చే భక్తులు వేసే కానుకలు ఉండి వేసేదానికన్నా, పూజారికి సమ ర్పించుకునే దక్షిణాలే ఎక్కువగా ఉంటాయనే చర్చ జరుగుతుంది. గర్భగుడిలో పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రధాన హుండీ కి అడ్డంగా హారతి పల్లాలను అడ్డంపెట్టి, హుండీలో వేయాల్సిన డబ్బు హారతి పళ్లెంలో వేయాల్సిందిగా సైగలు చేస్తారని కొంతమంది భక్తులు ఆయన తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. అలాంటి పూజారి మాకు వద్దే వద్దు అంటూ, ఆలయ కమిటీకి విన్నవించుకుంటున్నారు. దేవాదాయశాఖ ఉన్నత అధికారులు దృష్టి సారించి పూజారులను ప్రక్షాళన చేస్తే తప్ప మరో మార్గం లేదని భక్తులు పేర్కొంటున్నారు. ఆలయ కార్యనిర్వహణ సిబ్బందికి, అర్చకుల మధ్య విభేదాలతో శివాలయం ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని భక్తులు చర్చించుకుంటున్నారు.

# రూ. 37 లక్షల అధునాతన సౌకర్యాలతో 108 అంబులెన్స్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే

క్షత గాత్రులు, రోగులకు ఎంతో ఉపయోగం
ప్రాణ నష్టం జరగకూడదనిదే ప్రభుత్వ ఉద్దేశ్యం
అన్ని విధాలా ఆసుపత్రిని అభివృద్ధి చేస్తాం.. ఎమ్మెల్యే అమర్






తిరుపతి జిల్లా ప్రతినిధి/చిత్తూరు, సెప్టెంబర్ 15( భారత శక్తి) : క్షతగాత్రులు మరియు రోగుల ప్రాణాలను కాపాడడమే ధ్యేయంగా ప్రభుత్వం మంజూరు చేసిన అధునాతన సౌకర్యాలతో కూడిన 108 అంబులెన్స్ ను పలమనేరు శాసనసభ్యుల అమరనాథ్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వం మరియు భవ్య హెల్త్ సర్వీసెస్ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆసుపత్రిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబులెన్స్ వాహనానికి పూజలు నిర్వహించి జెండా ఊపి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడిన ఆయన.. పలమనేరు నియోజకవర్గం జాతీయ రహదారికి ఆనుకుని ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతుంటాయని గుర్తించి రూ. 37 లక్షలతో ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాకు రెండు అధునాతన అంబులెన్లను మంజూరు చేశారన్నారు. ఇందులో అత్యవసర పరికరాలన్నీ కలిగి ఉండడం చేత ప్రాణాపాయం నుంచి క్షతగాత్రులను కాపాడే అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా పలమనేరు ఏరియా ఆసుపత్రిని అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రిలోని పలు వార్డులను ఆయన పరిశీలించి అక్కడ అందుతున్న సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి నుంచి పలు కేసులు జిల్లా కేంద్రానికి రెఫర్ అవుతున్నట్లు గుర్తించిన ఆయన ఇకపై అలా జరగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూపరింటెండెంట్ మమతా రాణిని ఆదేశించారు. ఏదైనా సమస్యలుంటే వాటి పరిష్కారానికి తమ కృషి చేస్తామని కాబట్టి రోగులకు ఎటువంటి ఇబ్బందులు ఇకపై తలెత్తకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు నాగరాజు,సుధాకర్, వైద్యులు సుబ్రహ్మణ్యం, భవ్య హెల్త్ సర్వీసెస్ నిర్వాహకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఆర్.వి. బాలాజీ, ఆల కుప్పం రాజన్న, ఆర్ బి సి కుట్టి, సురేష్ బాబు, సుబ్రహ్మణ్యం గౌడ్, సుదర్శన్ బాలాజీ, సుధాకర్, చాంద్ బాషా, డిష్ రమేష్ , మదన్, శ్రీధర్, కుమార్, శ్రీనివాసులు, చిన్ని, లోకేష్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛత ఉత్సవ్ కార్యక్రమాల విజయవంతం చేయాలి:జిల్లా కలెక్టర్ పి .ప్రావీణ్య

- సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత ఉత్సవ్ కార్యక్రమాలు
- గ్రామాలలో, పట్టణాలలో పారిశుద్ధ్య కార్యక్రమాల పై ప్రజలకు అవగాహన కల్పించడం పారిశుద్ధ సమస్య పరిష్కరించడమే స్వచ్ఛత ఉత్సవ్
- స్వచ్ఛత హి సేవ 2025బిస్వచ్ఛత ఉత్సవ్ గోడపత్రికను ఆవిష్కరించిన కలెక్టర్

సంగారెడ్డి,(భారత శక్తి ప్రతినిధి)సెప్టెంబర్ 15: స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమంలోని స్వచ్ఛత హి సేవ 20 25 లో భాగంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ రెండవ తేదీ వరకు స్వచ్ఛత ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న స్వచ్ఛత హి సేవ 2025 కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వచ్ఛత హి సేవ 2025బిస్వచ్ఛత ఉత్సవ్ గోడ పత్రికను ఆవిష్కరించారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమాల విజయవంతం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు జిల్లాలోని అన్ని గ్రామాలు పట్టణాలలో ప్రజలకు పారిశుధ్యం పై విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడం వ్యర్థాల తొలగింపు స్వచ్ఛ శ్రామికుల సంక్షేమం పర్యావరణహితమైన పండుగల ను ప్రోత్సహించడం, పరిశుభ్రమైన గ్రామాలు, పరిశుభ్రమైన భారత్ అనే సంకల్పం నెరవేర్చడం లక్ష్యంగా స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వచ్ఛభారత్ మిషన్ లో భాగంగా రూపొందించిన కార్యక్రమాలు ప్రతి గ్రామపంచాయతీలో తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. స్వచ్ఛ ఉత్సవ కార్యక్రమంలో భాగంగా మొదటగా స్వచ్ఛత లక్ష యూనిట్లు మ్యాపింగ్ కార్యక్రమం చేపట్టాలని ఇందులో జిల్లాలో పెద్ద మొత్తంలో పేర్కొన్న వ్యర్థాల ప్రదేశాలను గుర్తించి ఎస్ హెచ్ ఎస్ 2025 పోర్టల్ లో భౌగోళిక స్థానం గుర్తించడం ఫోటోలు ప్రగతి నివేదికలను అప్లోడ్ చేయడం గుర్తించిన ప్రదేశాలలో శాశ్వతంగా శుభ్రంగా ఉపయోగకరంగా మార్చేలా ఏర్పాటు చేయడం చేపట్టాలన్నారు. ఈ ఏడాది స్వచ్ఛ భారత్ మిషన్లో భాగంగా ప్రత్యేకంగా రూపొందించిన కార్యకలాపాలు జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు.స్వచ్ఛత లక్ష్య యూనిట్ల మ్యాపింగ్ జిల్లాలో పెద్ద మొత్తంలో పేరుకుపోయిన వ్యర్థాల ప్రదేశాలను గుర్తించి, %ూనూ% 2025 పోర్టల్లో భౌగోళిక స్థానం,ముందుమీది తరువాతి ఫోటోలు, ప్రగతి నివేదికలను అప్లోడ్ చేయాలి. ఈ ప్రదేశాలను శాశ్వతంగా శుభ్రంగా, ఉపయోగకరంగా మార్చాలి.పాఠశాలలో ప్రభుత్వ కార్యాలయాలు హెల్త్ సబ్ సెంటర్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పర్యాటక ప్రాంతాలు ప్రార్థన మందిరాలు ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు చేపట్టడం. స్వచ్ఛ శ్రామికుల కోసం ఆరోగ్య శిబిరాలు నిర్వహించడంతోపాటు వారికి పిపిఏ కిట్లను పంపిణీ చేయడం వారికి సంబంధిత ప్రభుత్వ పథకాల లింకేజీలు అందించడం నిర్వహించాలి.ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువులతో పర్యావరణహిత పండుగలు జరిపేలా ప్రజలకు అవగాహన కల్పించడం, నదీ తీర ప్రాంతాల , చెరువు తీర ప్రాంతాలు శుభ్రత, స్వచ్ఛ బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించడం, గ్రామాలలో స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేయడం, ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల ప్రదర్శన నిర్వహించడం లాంటి కార్యక్రమాలు చేపట్టాలి.స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా గ్రామ సభలు నిర్వహించడం, ఇంటింటి ప్రచారం నిర్వహించడం, స్వచ్ఛత ర్యాలీలు నిర్వహించడం, సైకిల్ యాత్రలు, స్వచ్ఛత ప్రమాణస్వీకారం, విద్యార్థుల కోసం చిత్రలేఖనం ,వ్యాసరచన, నాటక పోటీలు నిర్వహించడం లాంటి కార్యక్రమాలు నిర్వహించాలి. స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 17వ తేదీన ప్రచారం ప్రారంభించడంతో గ్రామాలలో పెద్ద ఎత్తున శుభ్రత కార్యక్రమాలు ప్రారంభించడం చేయాలన్నారు. సెప్టెంబర్ 25వ తేదీన ఒకరోజు ఒక గంట శ్రమదానం ప్రత్యేక డ్రైవ్ ను నిర్వహించి ఈ డ్రైవ్ లో స్వచ్ఛ శ్రామికులను సన్మానించే కార్యక్రమం నిర్వహించాలన్నారు. జిల్లాలో ఈ స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం చేస్తే అందుకోసం అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు . జిల్లాలో ఈ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేసేందుకు పలు చర్యలు తీసుకుంటున్నారు. ఇంటింటి ప్రచారం, డిజిటల్ %డ% సోషల్ మీడియా ప్రచారం, స్థానిక భాషల్లో లోగోలు, బ్యానర్లు, క్రియేటివ్స్ వినియోగం వంటి హాష్‌ట్యాగ్‌లు సోషల్ మీడియాలో ఉపయోగిస్తారు. సంస్కృతిక సారథి కళాకారుల ద్వారా గ్రామస్థాయిలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రతి గ్రామపంచాయతీ మండల పరిషత్ అభివృద్ధి అధికారులు మండలాలలో గ్రామాలలో జరుగుతున్న కార్యక్రమాల వివరాలు ఏ రోజుకు ఆ రోజు తప్పనిసరిగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారికి సాయంత్రం 5 గంటల లోపు నివేదికలు అందజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ,చంద్రశేఖర్ ,మాధురి ,నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి , డి ఆర్ ఓ పద్మజారాణి , జిల్లా గ్రామీణభివృద్ధి అధికారులు ,పంచాయత్ రాజ్ అధికారులు ,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు .





# మండల కార్యాలయం ముట్టడించిన వికలాంగులు




ఎల్బీనగర్, సెప్టెంబర్ 15 (భారత శక్తి): మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ విహెచ్పిఎస్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం వందలాది మంది వికలాంగులతో సరూర్ నగర్ మండలం తహసీల్దార్ కార్యాలయం ముట్టడించడం జరిగింది. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ కొత్త జంగయ్యకు వినతిపత్రం అందించారు.ఈ సందర్బంగా బత్తిన సుధాకర్ మాదిగ ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జి విద్యావతి విహెచ్పిఎస్ రాష్ట్ర మహిళా నాయకురాలు ముఖ్యఅతిథిగా పాల్గొని వారు మాట్లాడుతూ, 2023 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో 40 రోజుల్లో పింఛన్లు పెంచుతామని ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చినారు.ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని మందకృష్ణ మాదిగ ఉద్యమ రూపంలో అనేక రూపాల్లో తెలిపినారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇంతవరకు పెన్షన్లు పెంచలేదు.పెన్షన్లు పెంచకుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వంతో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో తాడోపేడు తెలుసుకోవడానికి పింఛన్దారులు సమాజం ఏకం కావాలని వాళ్లు విజ్ఞప్తి చేశారు..ఈ కార్యక్రమంలో ప్రకాష్ మాదిగ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మల్లెపూవు రాజు చంపాపేట్ డివిజన్ ఇంచార్జి శేఖర్ కొత్తపేట డివిజన్ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పెద్ద ఉషను దేవా ఎరుగు రవి సురేష్ చంటి అశోకు మౌలాలి శివ రంగన్న ఏలియా రామన్న గణేషు తదితరులు పాల్గొన్నారు.

# సీ.ఎం.రిలీఫ్ ఫండ్ తో ఎంతో మంది పేదలకు లబ్ది. సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, సెప్టెంబర్ 15 (భారత శక్తి):అనారోగ్య బాధిత కుమారుడు సాయి కిరణ్ కి 1,75,000 రూపాయల ఎల్.ఓ. సీ.అంద జేస్తున్న ఎల్.బి .నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఆర్.టీ.సీ.సూపర్ వైజర్స్ కాలనీ నందు నివాసం ఉండే రవికిరణ్ కిడ్నీలకు సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో అయితే వారి యొక్క ఆర్థికస్థితులు బాగలేక వారు వారి యొక్క కుటుంబసభ్యులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని సంప్రదించారు.వెంటనే స్పందించిన సుధీర్ రెడ్డి అట్టి ఆపరేషన్ కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయడం జరిగింది. దానికి గాను వారికి 1,75,000 (ఒక లక్ష డెబ్బయి అయిదు వేల రూపాయలు) ఎల్.ఓ.సీ.చెక్కు మంజూరు కావడం జరిగింది.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, పేదల ఆరోగ్య పరిరక్షణకు సీ.యం.సహాయనిధి దోహదపడుతుందని అన్నారు.ఈ పథకం పేదలకు ఓ వరం లాంటిదని అన్నారు.పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం.సహాయనిధి అండగా ఉంటుందని అన్నారు.ఇట్టి కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ భారాస పార్టీ అధ్యక్షులు తోట మహేష్ యాదవ్,కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం మాజీ ధర్మకర్త ఛాతిరి మధు సాగర్ పాల్గొన్నారు.



# ఆక్రమణలను తొలగించండి

## హైడ్రా ప్రజావాణికి 26 ఫిర్యాదులు

హైదరాబాద్, సెప్టెంబరు 15: భారత శక్తి

వర్షాలు ముంచెత్తుతున్న వేళ నాలాల ఆక్రమణలపై ఫిర్యాదులు అందుతున్నాయి. ఒక చెరువు నుంచి మరో చెరువుకు ఉన్న నాలాలు కబ్జాకు గురి అవ్వడంతో పాటు.. వరద కాలువలన్నీ ఎక్కడో ఒక దగ్గర ఆక్రమణలకు గురై వరద నీరు తమ నివాసాలను ముంచెత్తుతోందని పలువురు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. క్యాచ్‌మెంట్ ఏరియా ఎంత ఉంది.. నాలా ఎంత వెడల్పులో ఉంటే సరిపోతుంది అనే విషయాన్ని అధ్యయనం చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు.. సర్వే నంబరు ఒకటి చూపించి మరో చోట ఉన్న ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారని, పార్కులు, ప్రజావసరాలకు ఆద్దేశించిన స్థలాలు కబ్జా చేస్తున్నారంటూ పలువురు ఫిర్యాదులందజేశారు. ఇలా హైడ్రా ప్రజావాణికి సోమవారం వచ్చిన 26 ఫిర్యాదుల్లో ఎక్కువ నాలాలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపైనే ఉన్నాయి. ఫిర్యాదులను హైడ్రా అదనపు కమిషనర్ శ్రీ ఎన్ అశోక్ కుమార్ గారు పరిశీలించి సబంధిత అధికారులకు వాటి పరిష్కార బాధ్యతలను అప్పగించారు.

ఫిర్యాదులు ఇలా..

- కూకట్‌పల్లి మున్సిపాలిటీ, హైదర్‌నగర్ డివిజన్ రామ్‌నరేష్ నగర్‌కాలనీ వరద నీటి కాలువ ద్వారా వర్షపు నీరు సాఫీగా అలీతలాబ్ చెరువులోకి చేరుతుండేది. కాని ఈ నాలా ఎక్కడికక్కడ కబ్జాకు గురి అవ్వడంతో చుట్టుపక్కల ఉన్న నివాసాలను ముంచెత్తుతోందని రామ్‌నరేష్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ హైడ్రాకు ఫిర్యాదు చేసింది. కుండపోత వర్షాల వేళ ఉన్న నాలాలు సరిపోని పరిస్థితి ఉంటే.. అవి కూడా కబ్జా అవ్వడం బాధాకరమని.. ప్రభుత్వం సరైన విధానంతో ఆక్రమణలను తొలగించాలని అసోషియేషన్ ప్రతినిధులు కోరారు.
- మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి మండలం రేణుక యెల్లమ్మ కాలనీలో 1600ల గజాల పార్కు స్థలంతో పాటు.. ప్రజావసరాలకు ఉద్దేశించిన 800 గజాల స్థలం కబ్జాకుగురి అవుతోందని.. స్థానికంగా అధికారులకు పిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని.. హైడ్రా అధికారులు జోక్యం చేసుకుని ఆ స్థలాలను కాపాడాలని ఆ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు హైడ్రాకు పిర్యాదు చేశారు.
- మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లి మండలం మూసాపేటలోని అంజయ్యనగర్‌లో ఉన్న పార్కును కాపాడినందుకు హైడ్రాకు అక్కడి నివాసితులు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఈ పార్కు అభివృద్ధికి రూ. 50 లక్షలు జీహెచ్ ఎంసీ కేటాయించడం.. పనులు చేపడితే కొంతమంది అడ్డుకోవడం జరిగింది. దీంతో పనులు ఆపేసి అలాగే వెళ్లిపోయిన జీహెచ్ ఎంసీ అధికారులు. ఇప్పుడు కబ్జాలు తొలగినా పార్కు అభివృద్ధిపై దృష్టి పెట్టకపోవడం బాధాకరమని ప్రజావాణి ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో ప్రకటించిన రూ. 50 లక్షల కోసం మళ్లీ ప్రతిపాదనలు పంపామని జీహెచ్ ఎంసీ స్థానిక అధికారులు కాలయాపన చేస్తున్నారని.. దీంతో పార్కు ఉండి ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు.
- ఉప్పల్ మండలం బండ్లగూడ నాగోల్ సర్వే నంబరు 36/6 లో ఉన్న ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం అవుతోందని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సర్వే నంబరు 35/5 ను చూపించి అనుమతులు తెచ్చుకుని 36/6 లోని 3 ఎకరాల ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. స్థానిక అధికారులకు ఈ విషయం తెలిసినా చర్యలు తీసుకోవడంలేదని వాపోయారు. ప్రభుత్వ భూమిని పరిరక్షించడానికి హైడ్రా చర్యలు తీసుకోవాలని సూచించారు.




# ప్రజా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలి కలెక్టర్ ప్రావీణ్య




సంగారెడ్డి,(భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 15:ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ, అందిన ఫిర్యాదులను సత్వరంగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా మొత్తం 27 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులు తమ అర్జీలను జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, డి.ఆర్.ఓ పద్మజ రాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సమర్పించారు. ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ, ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్దిష్ట కాలపరిమితి లోపల పరిష్కరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించడం ద్వారా ప్రజావాణి కార్యక్రమానికి ఉన్న ప్రాముఖ్యతను నిలబెట్టాలని సూచించారు. అలాగే, జిల్లాసంబంధిత సిఎం ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ధిష్ట గడువులోపల తక్షణమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం - 24 గంటలు అందుబాటులో ఉంటాం

- సైబర్ నేరాలపై అవగాహన
- మహిళల రక్షణకు పెద్ద పీఠ
- డ్రగ్స్ ఫ్రీ తిరుపతిగా మార్చేందుకు కృషి
- తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు

**తిరుపతి జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 15 (భారత శక్తి): శాంతి భద్రతల పరిరక్షణే పోలీసుల ధ్యేయమని తిరుపతి జిల్లా ఎస్పీగా ఎల్. సుబ్బారాయుడు తెలియజేశారు. ఆదివారం మొదట తిరుమల లో శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్ పటిష్టంగా ఉంచడమే పోలీసుల ధ్యేయమని, 24 గంటల పాటు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లా ప్రజలు సమస్యలు ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని, పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేయడంతో పాటు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల అత్యంత కఠినంగా ఉంటామన్నారు. విజిబుల్ పోలీసింగ్ ఉండేలా చర్యలు తీసుకుంటా మన్నారు. దేశంలోని అన్ని ప్రాంతాల నుండే కాకుండా ప్రపంచంలోని అన్ని దేశాల నుండి శ్రీవారిని దర్శించుకునేందుకు ప్రతినిత్యం వేలాది సంఖ్యలో భక్తులు వస్తారని, వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా పోలీస్ శాఖ చర్యలు చేపడుతుందన్నారు. మహిళల రక్షణకు పెద్దపీటజిల్లాలో మహిళల రక్షణ కోసం పటిష్టమైన చర్యలు చేపడతాం. మహిళలు బాలికల పట్ల జరుగుతున్న నేరాల నియంత్రణకు కృషి చేస్తాం. షీ టీం వ్యవస్థను బలోపేతం చేసి మహిళల పట్ల విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారి పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించడంతోపాటు చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. సైబర్ నేరాలపై అవగాహనరోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని వాటి బారిన పడకుండా ఉండేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. ప్రజలు సైబర్ నేరగాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు వివరాలు, ఓటీపీలు అపరిచిత వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లో చెప్పరాదన్నారు.**



# నందిగామలో టాక్సీ ఆటో యజమానుల నిరసన

నందిగామ సెప్టెంబర్ 15, **భారతశక్తి ప్రతినిధి)**

నందిగామ ఆర్టీవో కార్యాలయం వద్ద టాక్సీ నెంబర్ ప్లేట్లో ఉన్న వాహనాలకు బ్రేక్ విధానం కొనసాగించాలని, నందిగామ రెవెన్యూ డివిజనల్ కార్యలయం వద్ద టాక్సీ కారు, ఆటో డ్రైవర్స్ ఓనర్ ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె. గోపాల్ మాట్లాడుతూ ట్యాక్సీ నెంబర్ ప్లేట్లు ఉన్న వాహనాలకు పాత పద్ధతిలోనే నందిగామ ఆర్జీవీ కార్యాలయం వద్దనే బ్రేక్ చేయించుకునేందుకు ఏర్పాటు చేయాలని కోరారు.నందిగామ నియోజకవర్గ పరిధిలో ఉన్న ఆటో, లారీ, కారు, మినీ వాహనాలకు ప్రతి సంవత్సరం బ్రేక్ చేయించాలంటే గతంలో నందిగామ ఆర్టీవో కార్యాలయం వద్ద చేసేవారు. కానీ ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం విజయవాడ రూరల్ మండలంలోని నున్నలో ఒక ప్రైవేట్ ఏజన్సీ వారికి కేటాయించి అక్కడే బ్రేక్ చేయించుకోవాలని నిర్ణయించారు.

# ఫీజు రీయంబర్స్ మెంట్ బ్రాండ్ అంబాసిడర్లని చంకలు గుద్దుకున్నారు కదా?

**మీ నిర్వాకంవల్లే 15 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైన కన్పిస్తలేదా?**
**కేసీఆర్ కు, మీకు తేడా ఏముంది?**
**ఆనాడు చెక్కులిచ్చి, బౌన్స్ చేసి ప్రజలను పిచ్చోళ్లను చేశారు**
**మీరు టోకెన్ల మీద టోకెన్లు ఇస్తూ మోసం చేస్తున్నారే తప్ప పైసలియ్యడం లేదు**
**మూసీ సుందరీకరణ, ఫోర్త్ సిటీ, మిస్ వరల్డ్ పోటీలకు వేల కోట్లు ఖర్చు పెడతారు**
**పేద విద్యార్థుల కోసం 8 వేల కోట్లు ఖర్చు చేయలేరా**
**– తుపాకీ ఆర్మీ, పోలీసుల చేతుల్లోనే ఉండాల్సిందే**
**తుపాకీ చేతపట్టి చర్చలు జరపాలంటే భయపడే పిరికి ప్రభుత్వం మోదీది కాదు**
**వచ్చే మార్చి నాటికి మావోయిస్టులను నిర్మూలించి తీరుతాం**
**యూరియాపై రైతుల గోస ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే**
**ప్రణాళిక లేకుండా చేయడంవల్లే ఈ దుస్థితి**
**బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నా చేష్టలుడిగి చూస్తున్నారు**
**రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**



హైదరాబాద్,సెప్టెంబర్ 15, **భారతశక్తి** ప్రతినిధి)

ఫీజు రీయంబర్స్ మెంట్ బ్రాండ్ అంబాసిడర్లం తామేనని సంకలు గుద్దుకున్న కాంగ్రెస్ నేతల నిర్వాకంవల్లే కాలేజీలు మూతపడి లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమయ్యే పరిస్థితి ఏర్పడిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. మూసీ సుందరీకరణ, ఫోర్త్ సిటీ, మిస్ వరల్డ్ పోటీల పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం 15 లక్షల మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తు కనబడటం లేదా? రాష్ట్ర బడ్జెట్ లో నుండి రూ. 8 వేల కోట్ల రూపాయలు చెల్లించలేరా? అంటూ ప్రశ్నించారు. నక్సలైట్లను ఎన్ కౌంటర్ చేయడంపైనా కేంద్ర మంత్రి తీవ్ర స్థాయిలో స్పందించారు. "దేశాన్ని రక్షించే ఆర్మీ, చట్టాన్ని కాపాడే పోలీసుల చేతుల్లోనే తుపాకీ ఉండాలి. అట్లా కాకుండా పర్మిషన్ లేకుండా ఎవరి చేతిలో తుపాకీ ఉన్నా సంఘ విద్రోహ శక్తిగానే భావిస్తాం. అందుకే తుపాకీ విడిచి లొంగిపోవాలని కోరుతున్నాం. అట్లా కాకుండా తుపాకులతో మేం కాలుస్తూనే ఉంటాం... మీరు మాత్రం చర్చలకు పిలవాల్సిందేనంటే వినే పిరికిపంద ప్రభుత్వం మాది కాదు. నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అమిత్ షా నాయకత్వంలో 2026 మార్చి నాటికి మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించి తీరుతాం"అని స్పష్టం చేశారు. జాతీయ జెండా ఎగరనీయబోమని, ఎన్నికలే జరపనీయబోమని ఏ దేశపోళ్లు అనాలే... మీరే చెప్పాలంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో యూరియా కొరతకు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. సరైన ప్రణాళిక లేకపోవడం, యూరియాను బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నా చర్యల్లేకపోవడంవల్లే ఈ దుస్థితి తలెత్తిందని చెప్పారు. మంచిర్యాల రైల్వే స్టేషన్ వద్ద ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథరావులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఏమన్నారంటే...ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ఇవ్వకపోవడంవల్ల రాష్ట్రంలోని 15 నుండి 20 లక్షల మంది విద్యార్థుల జీవితాలు నాశనమయ్యే పరిస్థితి ఏర్పడింది. గత పదేళ్లపాటు కేసీఆర్ ఫీజు రీయంబర్స్ మెంట్ ఇయ్యక తిప్పలు పెట్టారు. ఫీజు రీయంబర్స్ మెంట్ కు బ్రాండ్ అంబాసిడర్ మేమేనని ఇన్నాళ్లు సంకలు గుద్దుకున్న కాంగ్రెసోళ్లు 20 నెలలుగా ఆ బకాయిలియ్యకుండా మోసం చేస్తున్నరు. ? కేసీఆర్ కు, మీకు తేడా ఏముంది? పంజాబ్ పోయి చెక్కులిచ్చి బౌన్స్ చేసి తెలంగాణ పరువును బజారున పడేస్తే.... ఈ కాంగ్రెసోళ్లు టోకెన్ల మీద టోకెన్లు ఇస్తూ మోసం చేస్తున్నరే తప్ప పైసా ఇయ్యడం లేదు. కాంగ్రెస్ నమ్మిన పాపానికి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లయింది. ఫీజు రీయంబర్స్ మెంట్ పై ఆధారపడి ఈ రాష్ట్రంలో ఏటా 15 లక్షల మందికిపైగా పేద విద్యార్థులు డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, మెడికల్, ఎంబీఏ, ఎంసీఏ వంటి ఉన్నత కోర్సులను చదువుకుంటున్నరు. నాలుగైదు ఏళ్లుగా ఫీజు రీయంబర్స్ మెంట్ పైసలు చెల్లించకపోతే వాళ్ల పరిస్థితి ఏంది? ఫీజు రీయంబర్స్ మెంట్ ఉందనే ఉద్దేశంతోనే ఉన్నత విద్యా కోర్సుల్లో చేరిన విద్యార్థులు ఇయాళ నడిరోడ్డున పడ్డరు. ఫీజుల కట్టకపోవడంవల్ల కాలేజీలు మెడపట్టి బయటకు నెట్టేస్తున్నయి. ఫోర్త్ సిటీ, మూసీ సుందరీకరణ, మిస్ వరల్డ్ పోటీల పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తున్నరు కదా?... పేద విద్యార్థుల కోసం రూ. 8 వేల కట్టలేరా? కాలేజీలు బంద్ అయితే విద్యార్థులు ఎటు పోవాలి? ఏం చదువుకోవాలి? వాళ్ల భవిష్యత్తును రోడ్డున పడేస్తారా? ఇదేనా ఇందిరమ్మ రాజ్యమంటే? కాలేజీ యాజమాన్యాలకు ఆనాడే చెప్పిన. కాంగ్రెస్ టోకెన్ల పేరుతో మోసం చేస్తదే తప్ప మీ గోడు పట్టించుకోదని. ఆనాడు చర్చలకు వెళ్లి వాళ్ల మాటలు నమ్మి కాలేజీ యాజమాన్యాలు మోసపోయాయి. కాలేజీ యాజమన్యాల్లో కొందరు కాంగ్రెస్ తొత్తులు ఉన్నందునే వాళ్లకు ఈ దుస్థితి ఏర్పడింది. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి. తక్షణమే ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నా. పేదోడు తెలంగాణలో బతకాలంటే భయమైతుంది. రోగమొస్తే కూడా పట్టించుకునే నాథుడే లేకపాయే... ఆరోగ్యశ్రీ పథకం కూడా మాదేనని జబ్బలు చర్సుకున్న కాంగ్రెసోళ్లు ఆరోగ్యశ్రీ బకాయిలు ఇవ్వకపోవడంతో రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు రానీయ్యడం లేదు. ఆరోగ్యశ్రీ పైసలియ్యనిదే ఆసుపత్రుల్లోకి అడుగు పెట్టనిచ్చేదే లేదని ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులోళ్లు తెగేసి చెబుతున్నరు. పోనీ సర్కారు దవాఖానాకైనా పోదామంటే సూది లేకపాయే, మందు బిళ్లలు కూడా లేకపాయే. మరి ఏం చేయాలే.... పేదోడికి రోగమొస్తే చావాల్సిందేనా? ఇందుకోసమేనా? కాంగ్రెస్ కు ఓటేసి గెలిపించింది? ప్రజా సమస్యలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ స్పందించవు. ఏమైనా అంటే కాళేశ్వరం, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్, గొర్రెల స్కాం అంటూ రచ్చ చేస్తూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నయ్. రైల్వే స్టేషన్ల అభివృద్ధి పేరుతో అదానీ, అంబానీలకు కట్టబెట్టాలని చూస్తున్నారంటూ కమ్యూనిస్టులు చేసిన వ్యాఖ్యలను మీడియా ప్రస్తావించగా....అభివృద్ధిపై కాకుండా అడ్డగోలుగా మాట్లాడుతున్నారు కాబట్టే కమ్యూనిస్టులు కాలగర్భంలో కలిసిపోయారు. అభివృద్ధి కోసం పనిచేస్తున్నాం కాబట్టే 2 సీట్ల నుండి కేంద్రంలో వరుసగా 3 సార్లు అధికారంలోకి వచ్చినం. నక్సల్స్ ఎన్ కౌంటర్ పై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ...నక్సల్స్ చంపింది ఎవరిని? పేదలు, ఆదివాసీ బిడ్డలనే కదా? మావోయిస్టులను సమర్థించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చిట్టెం నర్సిరెడ్డి, శ్రీపాదరావు, రాగ్యానాయక్ సహా ఎంతో మందిని నక్సల్స్ చంపారు. డ్యూటీ చేస్తున్న పోలీసులను కూడా నక్సల్స్ పొట్టనపెట్టుకుంటున్నారు కదా? పొట్ట కూటి కోసం డ్యూటీ చేస్తున్న వాళ్లను చంపితే మాట్లాడరా? చనిపోయినోళ్లంతా ప్రజలే కదా? తెలుగు వాళ్లే కదా?దేశాన్ని రక్షించే ఆర్మీ, చట్టాన్ని కాపాడే పోలీసుల చేతుల్లోనే తుపాకీ ఉండాలి.

అట్లా కాకుండా పర్మిషన్ లేకుండా ఎవరి చేతిలో తుపాకీ ఉన్నా సంఘ విద్రోహ శక్తిగానే భావిస్తాం. అందుకే తుపాకీ విడిచి లొంగిపోవాలని కోరుతున్నాం. అట్లా కాకుండా తుపాకులతో మేం కాలుస్తూనే ఉంటాం... మీరు మాత్రం చర్చలకు పిలవాల్సిందేనంటే వినే పిరికిపంద ప్రభుత్వం మాది కాదు. నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అమిత్ షా నాయకత్వంలో 2026 మార్చి నాటికి మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించి తీరుతాం. జాతీయ జెండా ఎగరనీయని, ఎన్నికలే జరపనీయని, ఆదివాసీ అమాయకబిడ్డలను చంపేటోళ్లను ఏమనాలి? ఏ దేశపోళ్లు అనాలే... మీరే చెప్పండి.పంచాయతీ ఎన్నికల జాప్యంపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ...గ్రామ పంచాయతీలకు ఒక్క పైసా ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించే దమ్ములేక రకరకాల సాకులు చెబుతోంది. గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులిస్తోంది కేంద్రమే.అయినా కేంద్రం ఏమీ ఇవ్వడం లేదని తిట్టడం సిగ్గు చేటు.రాష్ట్రంలో యూరియా కొరత, రైతుల కష్టాలపై స్పందిస్తూ...రబీ సీజన్ లో 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను పంపితే... 2.05 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మిగిలింది. ఆ యూరియాను ఏం చేశారో చెప్పడం లేదు. పంపిణీ చేసిన యూరియాను ప్లాన్ ప్రకారం సరఫరా చేయడం లేదు. పైగా యూరియాను బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నా పట్టించుకోరు. నిన్ననే మిర్యాలగూడలో ఎమ్మెల్యే గన్ మెన్ లారీ యూరియాను బ్లాక్ మార్కెట్ కు తరలించబోవడమే ఇందుకు నిదర్శనం.

అసలు కాంగ్రెస్ కు ప్లానే లేదు. రబీ యూరియా వినియోగంపై లెక్కా పత్రం లేదు. ఇదేమని అడిగితే... కేంద్రాన్ని బదనాం చేయడమే పెట్టుకున్నరు. ఇకనైనా కేంద్రాన్ని బదనాం చేయడం పక్కనపెట్టి యూరియా విషయంలో రైతులు పడుతున్న బాధను అర్థం చేసుకుని ప్రణాళిక ప్రకారం పంపిణీ చేయాలని కోరుతున్నా.

## విజయవాడలో హిజ్రాలపై చర్యలు తీసుకోవాలని ఆందోళన

విజయవాడ సెప్టెంబర్ 15, **భారతశక్తి** ప్రతినిధి)

విజయవాడలో ఈ నెల 13వ తారీకు హిజ్రాల దాటికి ఓ మహిళ ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన విషయం తెలిసినదే. ఈ ఘటనలో మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు సోమవారం అప్పగించారు. మృతదేహంతో బంధువులు గిరిపురం సెంటర్ వద్ద ఆందోళన చేపట్టారు. హిజ్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తీసుకోవాలని మృత దేహంతో రోడ్డుపై బైఠాయించారు. సమాచారం తెలుసుకున్న మాచవరం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వారితో చర్చలు జరిపారు.

## బస్సులో మంటలు.. తప్పిన పెను ప్రమాదం

ఆదిలాబాద్ సెప్టెంబర్ 15, **భారతశక్తి** ప్రతినిధి)

ఇచ్చోడ సమీపంలో సోమవారం ఆదిలాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నిజామాబాద్ వెళ్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులందరినీ సురక్షితంగా బయటకు దించడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపులోకి తెచ్చారు.

## రెండోవ రోజు తిరుపతిలో కోనసాగుతున్న మహిళ సాధికారిక సదస్సు

తిరుపతి సెప్టెంబర్ 15, **భారతశక్తి** ప్రతినిధి)

తిరుపతిలో మహిళ సాధికారిక సదస్సు రెండవ రోజు కొనసాగింది. సదస్సులో లోకసభ స్పీకర్ ఓం బిర్లా,ఏపి గవర్నర్ అబ్దుల్ నజీర్, రాజ్యసభ డ్యీపూటీ చైర్మన్ హరివంష్,ఏపి అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు,డ్యీపూటి స్పీకర్ రాఘురామకృష్ణం రాజు, జాతీయ మహిళా సాధికారిక చైర్పర్సన్ పురందరేశ్వరి,ఏపి మహిళ సాధికారిక చైర్మన్ గౌరు సుచరిత రెడ్డి తదితరులు పాల్గోన్నారు.

## వివిధ శాఖాధిపతులతో మంత్రి వివేక్ సమీక్ష

మంచిర్యాల సెప్టెంబర్ 15, **భారతశక్తి** ప్రతినిధి)



మంచిర్యాల కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తో కలిసి వివిధ శాఖల అధికారులతో కార్మిక,మైనింగ్ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి,పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. జిల్లా లో యూరియా కొరత,అభివృద్ధి పనుల పై సమీక్ష జరిపారు. యూరియా కొరత సృష్టించే వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. మం?త్రి మాట్లాడుతూ ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నాలు చేస్తున్న వారి పై చర్యలు తీసుకోండని అన్నారు. . ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అనే వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం ఎలా కొనసాగుతుంది క్వాలిటీ తో కడుతున్నారా లేదా అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## మహిళ సాధించలేనిది ఏదీ లేదు

**తనపై తాను ఆత్మవిశ్వాసంతో అడుగులు వేయాలి**
**పార్లమెంటరీ మహిళా సాధికారత కమిటీ అధ్యక్షురాలు పురందేశ్వరి పాయింట్స్**



తిరుపతి సెప్టెంబర్ 15, **భారతశక్తి** ప్రతినిధి)

వికసిత భారత్ సాధన అనే లక్ష్యం దేశంలో మహిళల ప్రగతిపై ఆలోచనను మార్చిందని ఎంపి పురందేశ్వరి అన్నారు. సోమవారం నాడు ఆమె తిరుపతిలో జరుగుతున్నపార్లమెంటరీ మహిళా సాధికారత సదస్సులో మాట్లాడారు. పురందేశ్వరి మాట్లాడుతూ వికసిత భారత్ కోసం మహిళా అభివృద్ధి" 'జెండర్ రెస్పాన్సివ్ బడ్జెటింగ్' ఈ రెండు అంశాల పై డిబేట్ జరిగింది. . మహిళా ప్రజాప్రతినిధుల పాత్ర ఈ రోజుల్లో కీలకం అయ్యింది. నారీశక్తి వెనుక ఉండి నడపటం కాదు. ముందు ,మధ్యలో ఉండి నడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. చంద్రయాన్ లో మహిళల పాత్ర భారతీయుల విలువను పెంచిందని అన్నారు.

రాష్ట్ర, కేంద్ర, కేంద్రపాలిత ప్రాంతాల మహిళా ప్రజాప్రతినిధుల అర్థవంతమైన ఆలోచనలు పంచుకోవటానికి సదస్సు వేదిక అయ్యింది. మహిళలు, ప్రజాప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చకు వచ్చాయి. ఆశా వర్కర్ నుంచి ఐ.ఎ.ఎస్ వరకు, గ్రామపంచాయితీ నుంచి పార్లమెంటరీ సభ్యురాలి వరకు మహిళల ఉనికి పెరుగుతోంది. స్వయం ఉపాధి 30 శాతం ఇటీవల పెరిగింది. 70 కేంద్ర ప్రభుత్వ పథకాలు ద్వారా, 400 పథకాలు రాష్ట్రాల్లో పథకాలు మహిళల ఉపాధికి అవకాశాలు ఉన్నాయి. ఇది ప్రారంభం మాత్రమే. ప్రతి రాష్ట్రంలోనూ మహిళా సాధికారత కమిటీలు ఏర్పడాలి. మహిళా సంక్షేమం కోసం ఇలాంటి సదస్సులు జిల్లా స్థాయి నుంచి మండలస్థాయి వరకు జరగాలి. పార్లమెంటు స్పీకర్ ఓం బిర్లా వల్లే ఈ సదస్సులు దేశంలో మొదటి సారి ప్రారంభమైంది. మహిళ సాధించలేనిది ఏదీ లేదు. తనపై తాను ఆత్మవిశ్వాసంతో అడుగులు వేయాలని అన్నారు.

## భాగ్యనగరంలో భారీ వర్షం

**రోడ్లన్నీ జలమయం.. గంట వ్యవధిలోనే దాదాపు 12 సెం.మీ వర్షపాతం**
**వీధుల్లో పోటెత్తిన వరదలు..**
**ముగ్గురు యువకులు గల్లంతు**

హైదరాబాద్ సెప్టెంబర్ 15, **భారతశక్తి** ప్రతినిధి)

: భాగ్యనగరంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయంగా మారాయి. గంట వ్యవధిలోనే దాదాపు 12



సెం.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాలలో లోతట్టు ప్రాం తాలు, రహదారులు జలమయమయ్యాయి. వీధుల్లో వరదలు పోటెత్తాయి. ముగ్గురు యువకులు వరదల్లో గల్లంతయ్యారు. ఆసిఫ్ నగర్ ప్రాంతం హబీబ్ నగర్‌లో మామ, అల్లుడ్లు వరదలో కొట్టుకుపోయారు. ముషీరాబాద్ ప్రాంతం వినోద నగర్‌లో పిట్టగోడపై సన్నీ అనే యువకుడు కూర్చొని స్నేహితులతో మాట్లాడతున్నాడు. గోడ కూలిపోవడంతో సన్నీ నాలాలో పడి కొట్టుకుపోయాడు. స్థానికులు కాపాడడానికి ప్రయత్నించాడు. అప్పటికే వరద ఎక్కువగా ఉండడంతో గల్లంతయ్యాడు. వెంటనే పోలీసులు సిబ్బందికి సమాచారం ఇచ్చారు. జిహెచ్ఎంసి, హైడ్రా, పోలీసులు గల్లంతైన వారి గాలింపు చర్యలు చేపట్టారు. హైటెక్ సిటీలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏ ర్పడింది. గచ్చిబౌలి పరిధి వట్టినాగులపల్లిలో తీవ్ర విషాదకర ఘటన చో టు చేసుకుంది. భారీ వర్షానికి వ ట్టినాగులపల్లిలో ఓ ఇంటి గోడ కూలిం ది. ఇద్ద రు మృతిచెందగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మియాపూర్, కూకట్‌పల్లి, షేక్‌పేట, రాయదుర్గం, జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్, ఖైరతాబాద్, అమీర్‌పేట, హి మాయత్‌నగర్, రామ్‌నగర్, ముషీరాబాద్, ఎల్బీనగర్, తార్నాక, కాచిగూడ, అల్వాల్, మల్కాజ్‌గిరి, కుషాయిగూడ, కాప్రా, ఉప్పల్, టోలీచౌకి, శేరిలింగంపల్లి, కీసర తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. వర్షం నీటితో వాహ న చోదకుల రాకపోకలకు తీవ్ర అంతరాయమేర్పడింది. ర్ఆర్‌జిల్లా గడ్డి అన్నారంలో గరిష్టంగా 12 సెం.మీ వర్షపాతం నమోదైంది.

హైదరాబాద్ ముషీరాబాద్ ప్రాం తంలో 12 సెం.మీ, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో 10 సెం.మీ, అడిక్‌మెట్‌లో 9 సెం.మీ, హిమాయత్‌నగర్‌లో 7 సెం.మీ, మల్కాజ్‌గిరిలో 6 సెం.మీ, ఉప్పల్‌లో 7 సెం.మీ, అల్వాల్‌లో 7 సెం.మీ, గండిపేట 7 సెం.మీ, బండ్లగూడలో 5 సెం.మీ, నాంపల్లిలో 5 సెం.మీ వర్షపాతం నమోదైంది.

## రేణిగుంట విమానాశ్రయంలో మారిషన్ ప్రధాన మంత్రి నవీన్ చంద్ర రామ్గోళంకు కి ఘన స్వాగతం

తిరుపతి సెప్టెంబర్ 15, **భారతశక్తి** ప్రతినిధి)

తిరుమల తిరుపతి ఒక్కరోజు పర్యటన లో భాగంగా బ్రహ్మర్షి ఆశ్రమం, తిరుమల శ్రీవారి దర్శనం కొరకు రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న మారిషెస్ దేశ ప్రధాని నవీన్ చంద్ర రామ్గోళం కు రేణిగుంట విమానాశ్రయంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎండోమెంట్ కమిషనర్ జవహర్ లాల్, అనంతపురం డి ఐ జి షిమోసి బాజ్పేయి, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.

## ఫీజుల కోపం ఏబీవీపీ అందోళన

హైదరాబాద్ సెప్టెంబర్ 15, **భారతశక్తి** ప్రతినిధి)

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ గోల్కొండ జిల్లా కన్వీనర్ విక్రమాదిత్య ఆధ్వర్యంలో ఫీజు రీయంబర్స్మెంట్ విడుదల చెయ్యాలని, నిజాం కళాశాల విద్యార్థులు, నిజాం కళాశాల నుండి బషీర్బాగ్ చౌరస్తా లోని బాబు జగ్జీవన్ రావు విగ్రహం వరకు ప్లకార్డుల ప్రదర్శన చేస్తూ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ 8వేల 500 కోట్ల స్కాలర్షిప్ ఫీజు రిమెంబర్స్ మెంట్ లు వెంటనే విడుదల చేయాలన్నారు. పేద విద్యార్థులు ఎంతోమంది స్కాలర్షిప్లపై ఆధారపడి చదువుకుంటున్నారు వారికి అన్యాయం జరుగుతుంది. విద్యాశాఖ మంత్రిని నియమించాలన్నారు.

======================

## రాజీవ్ రహదారిపై వర్షపు నీరు

మేడ్చల్ సెప్టెంబర్ 15, **భారతశక్తి** ప్రతినిధి)

శామీర్పేట మండలం తూంకుంట పురపాలక పరిధి లో రాజీవ్ రహదారి ని అనుకోని ఉన్న పల్లవి స్కూల్ వద్ద వర్షం నీరు చేరకుంది. దాంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. స్కూలు సిబ్బంది జేసీబీ సహాయంతో వర్షపు నీటిని బైటికి పంపించేందుకు ప్రయత్నించారు. వర్షపు నీటి కారణంగా రాజీవ్ రహదారిపై భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది..

=================================

## ఇన్నోవా బోల్తా? యువతి మృతి

రంగారెడ్డి సెప్టెంబర్ 15, **భారతశక్తి** ప్రతినిధి)

పెద్దఅంబర్ పేట్ వద్ద ఔటర్ రింగ్ రోడ్డు పై ఇన్నోవా కారు పల్టీ కొట్టడం తో ఇన్ఫోసిస్ ఎంప్లాయ్ సౌమ్య రెడ్డి మృతి చెందగా మరో ఆరు మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని హాస్పిటల్ కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇన్ఫోసిస్ ఉద్యోగం చేస్తున్న అందరు సరళమైసమ్మ టెంపుల్ వెళ్ళి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది,

## ప్రభుత్వ పాఠశాలకు ఆర్వో ప్లాంటును విరాళంగా అందజేసిన పూర్వ విద్యార్థి రెడ్డిశెట్టి ఆనంద్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 15: నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.30 వేల విలువచేసే శుద్ధ జల ప్లాంటును ఏర్పాటు చేసిన స్థానిక వ్యాపారి రెడ్డిశెట్టి ఆనంద్ తన ఉదారతను చాటుకున్నాడు. తన పుట్టినరోజును పాఠశాలలో విద్యార్థుల మధ్య జరుపుకోవాలన్న సంకల్పంతో సోమవారం ఆయన పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ ను ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వ బడులు బలోపేతం అవుతున్నాయని అన్నారు.

విద్యార్థులకు శుద్ధ జలం అందించాలనే సదుద్దేశంతో దాత రెడ్డిశెట్టి ఆనంద్, రెడ్డిశెట్టి నాగేశ్వర్ లను ఉపాధ్యాయులు విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సట్ల గంగాధర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చెర్మన్ వైశాలి, విద్యా అభివృద్ధి కమిటీ సభ్యులు బోయిడీ అభిషేక్, గంగశేఖర్, నారా పరశు రాం, వెంక టస్వామి, ఆర్. నిఖిల్, కందూరి కనకయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ నిర్వహణకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి




ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, (భారత శక్తి)నిర్మల్ సెప్టెంబర్ 15 : స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ 2002 పై రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈఓ సుదర్శన్ రెడ్డి హైదరాబాదు నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ, ఓటర్ జాబితాలో డూప్లికేట్ ఓట్లు, నకిలీ ఓట్ల తొలగింపు కు 20 నుంచి 25 సంవత్సరాలకు ఒకసారి స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) చేయడం జరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో చివరగా 2002 లో ఎస్ఐఆర్ చేయడం జరిగిందని తెలిపారు. ఎస్ఐఆర్ నిర్వహణ పై మాస్టర్ ట్రైయినర్ల ద్వారా బూత్ స్థాయి సిబ్బందికి సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు.

అనంతరం ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో రిటర్నింగ్ అధికారి, ఏఈఆర్ఓ, డిప్యూటీ తహసిల్దారులు, బిఎల్ఓ, పర్యవేక్షకులు తగినంత మంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ, ఎస్ఐఆర్ నిర్వహణపై మాస్టర్ ట్రైయినర్ల ద్వారా బూత్ స్థాయి సిబ్బందికి అవగాహన కలిగేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ నిర్వహణకు ముందుగానే ప్రతి పోలింగ్ బూత్ స్థాయిలో 2002 ఎస్ఐఆర్ వివరాలను 2025 ఎస్ఎస్ఆర్ డేటా తో సరిపోల్చాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, (భారత శక్తి) సెప్టెంబర్ 15: కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును పూర్తిగా పరిశీలించి వెంటనే స్పందించాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి అనంతరం అధికారులతో మాట్లాడిన కలెక్టర్, కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'స్వస్త్ నారి %-% స్వశక్తి పరివార్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. మహిళలకు రక్తహీనత, బిపి, థైరాయిడ్, టిబి, గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి నిపుణ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందించడమే ప్రధాన లక్ష్యమని వివరించారు. అలాగే, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16 వరకు జరగనున్న పోషణ్ మా కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రత్యేక పోషకాహార కార్యక్రమాలు నిర్వహించి ఎనీమియా ముక్త నిర్మల్ సాధించాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఫేషియల్ రికగ్నైజేషన్ హాజరు విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని, ఉపాధ్యాయులు, విద్యార్థులందరూ వందశాతం హాజరు కావాలన్నదే తమ లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి, జెడ్పీ సీఈవో గోవింద్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వెంటనే పెన్షన్ పెంచాలని జనసేన పార్టీ నిర్మల్ జిల్లా నాయకుల డిమాండ్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, (భారత శక్తి)సెప్టెంబర్ 15:

- వికలాంగుల పింఛను రూ 6000 పెంచాలి.
- వృద్ధులు,వితంతువులు, ఒంటరి మహిళలు, నేత,గీత, బీడీ కార్మికులతో పాటు ఇతర పెన్షన్ దారులకు రూ 4000 పెన్షన్ పెంచాలి
- ఇప్పటికే నూతన పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పెన్షన్ మంజూరు చేయాలి.

పై విషయమై తమతో మనవి చేయునది ఏమనగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వికలాంగుల పెన్షన్ రూ 4000 నుండి రూ 6000/- పెంచుతామని, అలాగే వృద్ధులు,వితంతువులు, బీడీ కార్మికులతో పాటు ఇతర పెన్షన్ దారుల పెన్షన్లు రూ 2000/-నుండి రూ 4000/- పెంచుతామని హామీ ఇచ్చారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా వాగ్దానం చేశారు. కానీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవీ చేపట్టి 22 నెలలు గడిచినా ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్లు పెంచలేదు.ఇది ఘోరమైన మోసం.అంగవైకల్యం, నిస్సహాయ స్థితి, నిరాదరణ వల్ల ఇప్పటికే ఎన్నో అవమానాలు, అవహేళనలు ఎదుర్కొంటున్న వికలాంగులు, వృద్ధులు, వితంతువులతో పాటు ఇతర పెన్షన్ దారుల యొక్క దీన పరిస్థితిని ప్రభుత్వం అర్థం చేసుకోవాలని కోరుతున్నాం.

పక్క రాష్ట్ర మైన ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ పెంచి, సరైన సమయానికి పెన్షన్ ఇస్తున్నారు.తెలంగాణ లో పెన్షన్ పెరగక పోవడం వల్ల



పెన్షన్ దారులు అన్యాయానికి గురవుతున్నారు.కాబట్టి వెంటనే పెన్షన్ పెంచాలని డిమాండ్ చేస్తున్నాం.ఈ కార్యక్రమం లో జనసేన పార్టీ నిర్మల్ జిల్లా నాయకులు సుంకేట మహేష్ బాబు, వికలాంగుల సంఘం జిల్లా నాయకులు బురుగుల రాజు, భోజరెడ్డి, నర్సారెడ్డి, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ నాయకులు నందు, సంజు తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయనికి వచ్చే భక్తుల రక్షణకు పోలీసు శాఖ పటిష్ట చర్యలు

- ఆలయ ప్రాంగణంలో సీసీ కెమెరాలు.
- భక్తుల సౌకర్యార్థం ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు
- జిల్లా ఎస్పీ మహేష్ బిగితే





వేములవాడ, సెప్టెంబర్ 15 (భారతశక్తి) : వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో ఆలయ భద్రత, భక్తుల ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాలసిన భద్రత ఏర్పాట్లపై వివిధ శాఖల సమన్వయంతో జిల్లా ఎస్పీ మహేష్ బిగితే సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వేములవాడ ఆలయానికి వచ్చే భక్తుల భద్రతకు పోలీసు శాఖకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనాన్ని పూర్తి చేసుకునుల ఏర్పాట్లు చేయాలని ఆలయాల అధికారులను ఆదేశించారు. ఆలయ ప్రాంగణం,గోపుర ద్వారాలు, క్యూలైన్‌లు, పార్కింగ్ ప్రదేశాలు, ప్రధాన వీధులలో సీసీ కెమెరాలను విస్తృతంగా అమర్చాలన్నారు.భక్తులు క్యూలైన్‌లలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తూ నిత్యం పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని,

ప్రధాన రహదారుల్లో డైవర్షన్ ప్లాన్ సిద్ధం చేసి అమలు చేయాలని సూచించారు.పార్కింగ్ ప్రాంతాల్లో ప్రత్యేక సిబ్బంది నియమించి, వాహనాలను క్రమబద్ధంగా నిలిపేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.ఈ సమావేశంలో వేములవాడ ఏఎస్పి.శేషాద్రి రెడ్డి, రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆలయ ఈవో ఎల్ రమాదేవి,ఆలయ ఉద్యోగులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## పదవుల కోసం ప్రజలను మోసం చేస్తున్నారు : శేషగిరి

ములుగు జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 15 (భారత శక్తి) : పదవి వ్యామోహంతో తనదైన నటన రాజకీయాలతోఎవరు ప్రజలను నమ్మించి మోసం చేస్తున్నారో ములుగు నియోజకవర్గ ప్రజలకు తెలుసునని బిఆర్ఎస్ పార్టీ తాడువాయి గ్రామ అధ్యక్షుడు కొర్నిబెల్లి శేషగిరి సోమవారం ఒక ప్రకటనలో దుయ్యబట్టారు.

మీ నాయకురాలి మెప్పు కోసం, పదవులు పొంది,పబ్బం గడుపుకోవడం కోసమే నీవు నాగజ్యోతిని విమర్శిస్తున్నావని అందరికి తెలుసు. విమర్శలో నిజం లేనప్పుడు మీ నాయకురాలు ఎందుకు భయపడుతుందని పేర్కొన్నారు.

సాటి ఆదివాసీ బిడ్డ నాగజ్యోతి ఎదుగుదలను ఓర్వలేక మిమ్మల్ని ఎందుకు ఉసిగొల్పుతుందని,మీ నాయకురాలి సొంత గ్రామానికే దిక్కులేదు కాని ములుగు నియోజకవర్గ ప్రజలందరూ మీ నాయకురాలికి ఆప్తులు అనడం హాస్యాస్పదంగా ఉంది.మీ నాయకురాలికి మాటలతో ప్రచారం తప్ప పని చేతకాదని ప్రజలందరికీ తెలుసు.

రెండు మూడు రోజుల పాటు సహకార సంఘాల చుట్టూ తిరిగితే రైతులకి ఒక్క యూరియా బస్తా ఇస్తుంది. వాస్తవం కాదా అని మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణిని ఆరోపించారు. తాడ్వాయి సహకార సంఘం అధికారులను బెదిరించి తను 40 యూరియా బస్తాలు తీసుకోవడం ప్రజలను మోసం చేయడం కాదా అని అన్నారు.

రైతులు యూరియా బస్తా కోసం క్యూ లైన్ లో నిలబడి ఒక బస్తా తీసుకుంటే మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణీ ఏకంగా 40 బస్తాలు దండుకోవడం బాధ్యత పదవులు ఉండి ప్రజలను మోసం చేసినట్లు కాదా? అని శేషగిరి ప్రశ్నించారు. నాశనం అయ్యేది నాగజ్యోతికాదు ప్రజల కి అందమైన అబద్ధాలు చెప్పి ఓట్లు వేయించుకొని గెలిచి రైతులకి సరిపడ యూరియా అందించలేని మీ నాయకురాలు అదే వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ చైర్మెన్ గా ఉన్న రేగా కళ్యాణిలకు రైతుల ఉసురు తగిలి సర్వనాశనం అయిపోతారని వారిపై విరుచుకుపడ్డారు.

పచ్చ కళ్ళ వాళ్లకి లోకం అంత పచ్చగానే కనిపిస్తుంది అన్నట్టుగా మీరు ప్రతిపక్షం లో ఉన్నప్పుడు చేసిన నటన రాజకీయాలే అందరూ చేస్తారు అని అనుకోవడం మీ మూరత్వం

రైతు దేశానికే వెన్నముక్క అని అందరికి తెలుసు మరి అలాంటి రైతులకి సరిపడ యూరియా ఇవ్వలేని దద్దమ్మలు ఎవరు రేగ కళ్యాణి

ప్రజలను ఆదుకోవాల్సిన ఒక బాధ్యత గల పదవిలో ఉండి ఇలా ప్రతిపక్ష నాయకులు పైన విమర్శలు చెయ్యడం మీ మూర?త్వం మీకు ఉన్న మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవి కాంగ్రెస్ పార్టీ కమిషన్ల కోసం కాకుండా ములుగు జిల్లా ప్రజల కోసం వాడితే మంచిద న్నారు.

అదునుదాటాక,పంట ఆగమయ్యాక యూరియా బస్తానో ఏం చేయాలని రైతులువాపోతున్నారు.



ప్రగల్భాలు మాని మీకు దమ్ముంటే క్యూలైన్ లో నిలబడుతున్న రైతుల దగ్గరికి వెళ్లి మాట్లాడండి అప్పుడు వాళ్లే మీకు సరైనా బుద్ధి చెబుతారు. ములుగు నియోజకవర్గ ప్రజలు వాస్తవాలను గ్రహిస్తున్నారు,వాళ్లే మీకు భవిష్యత్తులో తగిన గుణపాఠం తప్పదు.

## జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి

-ఖమ్మం జిల్లాలో జర్నలిస్టులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి.
-టియుడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా.
-కలెక్టరేట్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపిన జర్నలిస్టులు.




రాజన్న సిరిసిల్ల,సెప్టెంబర్ 15 (భారతశక్తి) : తెలంగాణ రాష్ట్రంలోని జర్నలిస్టుల రక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కఠినమైన చట్టం తీసుకురావాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా జర్నలిస్టులపై కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు సోమవారం నల్ల బ్యాడ్జీలతో జర్నలిస్టులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లాయక్ పాషా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు, అక్రమ కేసులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పులు చేసిన వారినీ శిక్షించే హక్కు చట్టానికి ఉందనీ, అనవసరమైన, అసత్య ఆరోపణలపై జర్నలిస్టులపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేయొద్దని విజ్ఞప్తి చేశారు. చట్టానికి ఎవరు అతీతులు కారని నిజంగానే తప్పులు చేసిన వారిని చట్ట పరిధిలో శిక్షించాలని కోరారు. వృత్తిలో భాగంగా జర్నలిస్టులు కవరేజ్ కు వెళ్లిన వారిపై కేసులు నమోదు చేయడం ప్రజాస్వామిక మన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తున్న ఫోర్త్ ఎస్టేట్ గా భావిస్తున్న మీడియా జర్నలిస్టులు ఇలాంటి సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో ఆందోళనకు గురవుతున్నా రన్నారు. ఈమధ్య జర్నలిస్టులపై దాడులు విపరీతంగా పెరిగాయని ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ఉండాలంటే జర్నలిస్టులకు రక్షణ చట్టం తేవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని కఠినమైన చట్టాలను తయారు చేసి వాటిని అమలు చేసే విధంగా పోలీస్, రెవెన్యూ శాఖలను ఆదేశించి జర్నలిస్టులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సామల గట్టు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఇరుకుల్ల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజీమ్, జిల్లా ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారి, కార్యవర్గ సభ్యులు, వివిధ ప్రెస్ క్లబ్ ల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సంస్కృత భాష భారత జాతి ఆత్మ భాష

హైదరాబాద్, (భారత శక్తి) సెప్టెంబర్ 15:
యావత్ భారతదేశానికి ఆత్మీయ భాష ఏదైనా ఉంది అంటే అది సంస్కృత భాష మాత్రమే. ఒకరి భాషను ఒకరు నేర్చుకోవడం అనేది దేశ సమైక్యతను చాటడం, పరస్పర గౌరవాలను ప్రకటించడం, పరస్పరం విజ్ఞానాన్ని పంచుకోవడం కోసం చాలా అవసరమే. అయితే అన్ని భాషలు సంస్కృతాన్ని మాతృ స్థానంలో ఉంచి గౌరవించినవి. కొందరు ప్రాంతీయ భాషాభిమానులు సంకుచిత ధోరణిలో ఇతర భాషల ప్రభావాన్ని భరించలేక తమ భాష ఔన్నత్యం పెంచుకోవడం కోసం సంస్కృతం మీద బురద జల్లడం సంస్కృతాన్ని నిరసించడం కనిపిస్తుంది. సంస్కృతం అనగానే అదేదో ఆస్తిక భాష, మత భాష అనే అభిప్రాయం ఉన్నవారు తమ నాస్తిక భావాల అభివృద్ధికి సంస్కృతం అడ్డంకి అని భావించడమూ కనిపిస్తుంది. ఈ రెండు రకాల భావజాలం కలిగిన వారు సంస్కృతాన్ని నిర్మూలించాలని నినాదాలు చేయడం ఆశ్చర్యం కలగక మానదు. దీనికి తోడు భారతదేశం మీద సాంస్కృతికంగా విజయం సాధించే ఉద్దేశంతో పాశ్చాత్య దేశాలు పాశ్చాత్య భావ ప్రేరితులు చేసిన ప్రయత్నాల్లో ఒకటి సంస్కృతాన్ని మృత భాష అని ముద్రలు వేయడం. చివరికి ప్రభుత్వాలు కూడా తమ తమ రాజకీయ లబ్ధుల కోసం భారతీయేతర భాషలకు అగ్ర పీఠాలు, ప్రత్యేక ప్రతిపత్తులు కేటాయిస్తున్నాయి. ఓ ఐదు నిమిషాలు రేడియో,టీవీల్లో వార్తలు వినిపించడంతో సంస్కృత భాష సేవ చేశామని చేతులు దులుపుకుంటున్నారు. అయితే మన నిర్లక్ష్యం వల్ల మనం ఎలాంటి గొప్ప నిధిని పోగొట్టుకుంటున్నామో తెలుసుకోలేకపోతున్నాం. ఈ దేశాన్ని అంతటినీ ఏక సూత్రంగా కూర్చిన సంస్కృతికి మూలాధారం సంస్కృత భాషేనని కాస్త ఆలోచిస్తే అర్థమవుతుంది. ఎంతగా ప్రాంతీయ భాషల్లోకి తర్జుమాలు చేసుకున్నా ఇంకా అందజేయవలసిన సంస్కృత సాహిత్యం అనంతంగా ఉంది.



విశ్వ సాహిత్యం లోని విశిష్ట గౌరవాన్ని అందుకున్న భాష
వేదాలు, ఉపనిషత్తులు, పురాణీతిహాసాలు అలా ఉంచి కాళిదాస, మాఘ, భవభూతి, భారవి, దండి మొదలైన మహాకవుల కావ్యాలు విశ్వసాహిత్యంలోనే విశిష్ట గౌరవాన్ని అందుకున్న విషయం మనం మరిచిపోరాదు. అనేక కావ్యాలు వివిధ ఛందస్సులలో చూపించిన వినూత్నమైన సంగీత గమనాలు ఇప్పటికే నిత్య నిదర్శనాలు. ఇక తత్వశాస్త్ర గ్రంధాలు, సంగీత శాస్త్రం, నాట్య శాస్త్రం, అలంకార శాస్త్రం, వైద్యశాస్త్రం, జ్యోతిష్యం, నీతి శాస్త్రం, ధర్మశాస్త్రాలు, గణిత శాస్త్రం, తంత్ర శాస్త్రాలు, యోగశాస్త్రం, ఆగమాలు, అనేక సూత్ర రచనలు ఇలా అసంఖ్యాకంగా ఎన్నో శాస్త్రాలు శాస్త్రాలే సంస్కృతంలో ఉన్నాయంటే ఆశ్చర్యం కలగక మానదు కదా! భారతదేశమంతటా ఈ శాస్త్రాలు ప్రచలితం కావడానికి దోహదపడింది సంస్కృత భాష మాత్రమే. అంతేకాదు పాశ్చాత్య మేధావులు సైతం ముగ్ధులై మోకరిల్లుతున్నదీ ఈ భాషా మా తల్లి ముందే అని మరువకూడదు. “జనని సంస్కృతంబు సకల భాషలకును” అని ప్రాంతీయ భాషలన్నీ సంస్కృతాన్ని అమ్మగా భావించి తాము సోదర స్థాయిలో ఆ అమ్మకు వారసత్వాన్ని సంపాదించుకుంటూ మన కలుగుతున్నాయి. సంస్కృత భాషను అంగీకరించిన అత్యల్ప సంఖ్యాక ప్రాంతీయ భాషలు పోటీగా సంస్కృత భాషలో ఉన్న శాస్త్రాలను తమ భాషల్లోకి అనువదించుకొని తమ విజ్ఞాన సంపదను పెంచుకున్నాయి. ఆ తర్వాత మూలాన్ని కాదని మూలగా ముడుచుకు కూర్చుంటున్నాయి.

వైజ్ఞానిక శాస్త్రీయ లక్షణం కలిగి ఉన్న ఏకైక భాష
సంస్కృత భాష జర్మనీ, ఫ్రాన్స్ లాంటి దేశాల్లో ఉన్నత స్థాయిలో ఆదరింపబడుతుంది. సంస్కృత ప్రాధాన్యం ఉన్న దేశాల్లో మన దేశం మూడో స్థానంలో ఉంది. మన దైవభాష జర్మనీ లాంటి దేశాల్లో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నేర్చుకోవలసిన “నిర్బంధ విద్య”గా బోధింపబడుతోందన్న విషయం మనం గమనించాలి. ఇక ఆధ్యాత్మికంగా సంస్కృతం మంత్ర భాష. నాద శక్తి రహస్యాలను తనలో దాచుకున్న భాష. వర్ణ క్రమం మొదలుకొని వ్యాకరణ నిర్మాణం వరకు నాగరిక భారతీయ భాషలన్నీ సంస్కృతాన్ని అనుసరించాయి. వైజ్ఞానిక శాస్త్రీయ లక్షణం ఉన్న ఏకైక భాష సంస్కృత భాష మాత్రమే. ఏ పదం ఎందుకు పుట్టిందో ఎలా పుట్టిందో చెప్పగలిగిన భాష సంస్కృత భాష మాత్రమే. ‘వ్యుత్పత్తి’ అనేది ఈ భాషకు ఉన్న ప్రత్యేక లక్షణం. అతి సులభంగా నేర్చుకోగలిగే భాష కనుక ఒకప్పుడు రాజభాష అయ్యింది. ఇప్పటికీ మన భాషలన్నింటిలో కలిసిపోయి ‘ఒళ్ళో చేర్చుకొని లాలించే అమ్మలా..’ ఉండిపోయింది. సంస్కృతం అవైదిక అనార్ష భావ ప్రచారం నిరాటంకంగా సాగేందుకు భౌతిక నాస్తిక వాద ప్రభావితులైన అధినేతలు సంస్కృతాన్ని దూరం చేయడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. కానీ ఈ జీవ, దైవ భాషను ఎవరూ నిర్మూలించలేరు. రామా, కృష్ణా, శివా.. అని గళం ఎత్తే ఆస్తికుడి మంత్రపాసనలో ప్రార్థనలో సంస్కృతం జీవిస్తుంది. పదమెత్తి లయవేసే నర్తకుడి భంగిమల్లో.. గళమెత్తి పాడే సామగానంలో సంస్కృత శక్తి ధ్వనిస్తూనే ఉంటుంది. పూలదండలో దారంలా మనందరిలో జీవించే ఉంది సంస్కృతం. దానిని గుర్తించి అధ్యయనం చేస్తే అపారమైన భారతీయ వ్మాయమంతా అవగాహన చేసుకోవచ్చు. ఆ నిధిలో నిక్షిప్తమైన విలువైన రత్నాలను వెలికి తీసుకోవచ్చు. ఇంత అపారమైన వ్మాయం ఏ భాషలోనూ లేదనే విషయాన్ని ఘంటాపథంగా చెప్పవచ్చు.

పునాదిలేని భవన నిర్మాణం ప్రమాదం
సంస్కృత భాషను వదులుకుంటే మన ఆత్మ ని మనం పోగొట్టుకున్నట్లే. మనలో భారతీయత సంపూర్ణంగా ప్రకటితం కావాలంటే మన అమ్మ భాషతో కలిసి సంస్కృతం మన నోట పలకాలి. అది లేకుండా ప్రపంచాన్నంతా అధ్యయనం చేసినా అది పునాదిలేని భవన నిర్మాణం లాంటిదే అవుతుంది. సాధారణంగా ఇలాంటి ప్రబోధ వాక్యాలు విన్నాక ‘ఛాదస్తం’ అని దులిపేసుకునేటంత మొద్దు బారుడుతనం మనకి ఏనాడో సంక్రమించింది. ముఖ్యంగా తెలుగు వారికి. తెలుగు మాట పలకడానికే సిగ్గుపడే ఆత్మహీనులు, వెన్నుముక లేని ప్రబుద్ధులు ఉన్న కాలంలో ఏకంగా సంస్కృత భాష గురించి చెప్పడం సాహసోపేతమే అవుతుంది. కానీ ఎక్కడో అణగారి ఉన్న వివేకం ఎప్పుడైనా మేలుకొనదా? అనే ఆశ. మనదై ఉండి మనం గుర్తించని ఒక మహా నిధి గురించి మళ్లీ మళ్లీ మననం చేసుకొని, ఆ దిశగా మన సంస్కారాలను మలుచుకోవాలనే ఆర్తితో నా ఈ ఆత్మీయ విన్నపం. నిజానికి తెలుగు భాష సంస్కృతాన్ని భావమయం చేసుకుంది. వేద పఠనం యథాతథంగా, సుస్వరంగా చదవగలిగేది తెలుగువాడు ఒక్కడే! అలాంటిది విద్యా విధానాల్లో పెరిగిన సంస్కృతి పట్ల అనాదరణ, రాజకీయాల జోక్యం, ఆధునిక యాంత్రిక జీవన గమనం ఈ రెండు భాషల విలువలను నేటి తరానికి తెలియనీయకుండా చేస్తున్నాయి. భాషావేత్తల కొలబద్దలలో ఒదగడానికి సంస్కృతం ఒక భాష కాదు. ఒక మహా శక్తి. ఆ మహా శక్తిని ఇకనుండి అయినా మనం సముపార్జించుకుందాం! భారత్ ను మరల గురు స్థానంలో నిలబెడదాం!



చౌదూరి నరసింహారావు
పత్రికా రచయిత, విశ్లేషకులు

# వికసిత్ భారత్‌కు మహిళల నేతృత్వంలోని అభివృద్ధి ప్రధానం: లోక్‌సభ స్పీకర్

తిరుపతి,15 సెప్టెంబర్(భారత శక్తి): ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో ‘తిరుపతి తీర్మానం’ అవలంబనతో ముగిసిన మహిళా సాధికారతపై పార్లమెంటరీ మరియు శాసనసభ కమిటీల మొదటి జాతీయ సమావేశంలో మహిళలకు స్థిరమైన ఆర్థిక సాధికారత నమూనాల అవసరాన్ని లోక్‌సభ స్పీకర్
ఓం బిర్లా ఈరోజు నొక్కిచెప్పారు.



మహిళా సాధికారతకు అంకితమైన చారిత్రాత్మక పార్లమెంటరీ సమావేశ వేడుకలో లోక్‌సభ స్పీకర్ తన వ్యాఖ్యలను చేస్తూ, మహిళా సాధికారత సామాజిక ఆవశ్యకత మాత్రమే కాకుండా ఆర్థిక అవసరం కూడా అని నొక్కి చెప్పారు. మహిళల ఆరోగ్యం, విద్య, నైపుణ్యాలు మరియు వ్యవస్థాపకతలో పెట్టుబడి పెట్టడం ద్వారా, భారతదేశం మానవ మూలధనం యొక్క విస్తారమైన రిజర్వాయర్‌ను అన్‌లాక్ చేయగలదని, అలాగే అభివృద్ధి యొక్క స్థిరమైన సామాజిక-ఆర్థిక నమూనాను నిర్మించగలదని ఆయన అన్నారు.
2047 నాటికి వికసిత్ భారత్ దిశగా భారతదేశం సాగించే ప్రయాణంలో మహిళల నాయకత్వం మరియు సహకారం చాలా కీలకమైనదని బిర్లా ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. కేంద్రం మరియు రాష్ట్రాలలో తమ అనుభవాల ద్వారా శాసనసభ్యులు సమావేశమై తమ ఆలోచనలను పంచుకోవడానికి ఇటువంటి సమావేశాలు ఒక చక్కని వేదికను అందిస్తాయని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ముగింపు ప్రసంగం చేశారు.
అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవం సందర్భంగా, లోక్‌సభ స్పీకర్ భారతదేశంలో ప్రజాస్వామ్యం కేవలం ఒక రాజకీయ ఏర్పాటు మాత్రమే కాదని, అది ఒక నాగరిక విలువ మరియు జీవన విధానం అని నొక్కి చెప్పారు. ప్రజాస్వామ్యానికి తల్లిగా పిలువబడే భారతదేశం శతాబ్దాలుగా సమానత్వం, సంభాషణ మరియు భాగస్వామ్యం అనే సూత్రాలను సమర్థిస్తోందని, ప్రజాస్వామ్యం దేశ సాంస్కృతిక మరియు సామాజిక నిర్మాణంలో లోతుగా వేళ్లూనుకుందని ఆయన పేర్కొన్నారు.
మహిళా సాధికారతను కేవలం సంక్షేమానికి సంబంధించిన అంశంగా మాత్రమే చూడకూడదని, జాతీయ అభివృద్ధికి పునాదిగా చూడాలని శ్రీ బిర్లా నొక్కి మరీ చెప్పారు. విద్య ద్వారా మహిళా విముక్తి కోసం పాటుపడిన సావిత్రిబాయి పూలే వంటి సంస్కర్తల మార్గదర్శక పాత్రను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.అలాగే 100 శాతం అక్షరాస్యత సాధించడంలో గ్రామాల్లోని వృద్ధ మహిళలకు విద్యను అందించిన మహారాష్ట్రలోని పాఠశాలల ఉదాహరణను ఉదహరించారు. ఇటువంటి చొరవలు సమకాలీన విధానాలకు ప్రేరణగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు.
గ్రామీణ మరియు వెనుకబడిన నేపథ్యాల నుండి వచ్చిన మహిళల విజయాలను ప్రస్తావించిన స్పీకర్, విద్య, వ్యవస్థాపకత మరియు సమాజ నాయకత్వంలో వారి నైపుణ్యతకు అవకాశాలు కల్పించినప్పుడు, పరివర్తన ఫలితాలను ఇస్తుందని చూపిస్తుందని అన్నారు. ఈ అవకాశాలను సమాజంలోని ప్రతి భాగానికి విస్తరించేందుకు పునరుద్ధరణకు కృషి చేయాలని, తద్వారా భారతదేశ పురోగతిలో మహిళలు సమాన వాటాదారులుగా పూర్తిగా పాలుపంచుకోవచ్చని ఆయన పిలుపునిచ్చారు.
లింగ ప్రతిస్పందన బడ్జెటింగ్ కేవలం ఆర్థిక యంత్రాంగం మాత్రమే కాదు, జాతీయ అభివృద్ధి అజెండాలో మహిళల అవసరాలను ఏకీకృతం చేసే సామాజిక-ఆర్థిక నమూనా సైతం అని స్పీకర్ ఈ సందర్భంగా హైలైట్ చేశారు. మహిళలకు ఆరోగ్య సంరక్షణ, విద్య, నైపుణ్యాలు మరియు జీవనోపాధికి సమాన ప్రాప్తిని నిర్ధారించడం ద్వారా, వారు దేశ వృద్ధి ప్రయాణంలో పూర్తిగా పాల్గొనడానికి మరియు నాయకత్వం వహించడానికి వీలు కల్పించడం ద్వారా బడ్జెట్‌లు సామాజిక న్యాయానికి సాధనంగా పనిచేయాలని నొక్కి చెప్పడం జరిగింది. వనరుల కేటాయింపులో లింగ దృష్టిని వర్తింపజేయడం వల్ల మహిళల ఆందోళనలు పరిధీయమైనవిగా పరిగణించబడకుండా ప్రధాన స్రవంతి ప్రణాళికలో కలిసిపోతాయని ఆయన అన్నారు.
మంత్రిత్వ శాఖలు, అలాగే రాష్ట్ర విభాగాలలో లింగ బడ్జెట్ సెల్స్‌ని సంస్థాగతీకరించాలని, మహిళల ఆరోగ్య సంరక్షణ, విద్య, నైపుణ్యాలు, వ్యవస్థాపకత మరియు రుణ ప్రాప్యత కోసం కేటాయింపులను పెంచాలని మరియు లింగ-విభజిత డేటా ద్వారా ఫలితాలను పర్యవేక్షించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇటువంటి చర్యలు, బడ్జెట్‌ను సామాజిక న్యాయం మరియు సమ్మిళిత వృద్ధికి సాధనంగా మారుస్తాయని ఆయన పేర్కొన్నారు.
అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాల అవకాశాలు మరియు సవాళ్లను ప్రస్తావించిన శ్రీ బిర్లా, డిజిటల్ యుగంలో మహిళలు వెనుకబడిపోకూడదని అన్నారు. డిజిటల్ అంతరాన్ని తగ్గించడం, సైబర్ భద్రతను నిర్ధారించడం, అలాగే డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాలను విస్తరించడం వంటివి మహిళలను సాంకేతికత యొక్క చురుకైన సృష్టికర్తలుగా శక్తివంతం చేయడానికి చాలా అవసరం.
మహిళా సాధికారతను ముందుకు తీసుకెళ్లడానికి స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను నిర్దేశించిన ‘తిరుపతి తీర్మానం’ను సమావేశం ఏకగ్రీవంగా అవలంబించింది. అన్ని మంత్రిత్వ శాఖలు మరియు విభాగాలలో లింగ దృష్టిని వర్తింపజేయడం, ఆరోగ్యం, విద్య, నైపుణ్యాలు మరియు వ్యవస్థాపకతకు కేటాయింపులను పెంచడం, లింగ ప్రతిస్పందనాత్మక బడ్జెటింగ్‌ను సంస్థాగతీకరించడం, అలాగే జాతీయ మరియు రాష్ట్ర స్థాయిలో సాంకేతిక సామర్థ్యాన్ని బలోపేతం చేయడం గురించి తీర్మానం నొక్కి చెప్పింది. డిజిటల్ అంతరాన్ని తగ్గించడం, %ాజువీ% రంగాలలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, సైబర్ భద్రతను నిర్ధారించడం, డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాలను విస్తరించడం, అలాగే మహిళలను సాంకేతికత యొక్క చురుకైన సృష్టికర్తలుగా మార్చడం వంటి వాటికి కూడా ఇది కట్టుబడి ఉంది. మహిళల నేతృత్వంలోని అభివృద్ధి కేంద్రీకృత స్థానాన్ని పునరుద్ఘాటిస్తూ, 2047 నాటికి వికసిత్ భారత్ సాకారం కావడానికి మరియు జాతీయ పురోగతికి మూలస్తంభంగా మహిళల విద్య, ఆరోగ్యం, భద్రత, గౌరవం మరియు స్వావలంబనను ముందుకు తీసుకెళ్లాలని తీర్మానం ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేసింది.

## పూజారుల అనుమతి తోనే గద్దెలు మార్పిడి
# దేవుని పేరు చెప్పి రాజకీయాలు చేయొద్దు.: మంత్రి సీతక్క.

ములుగు జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 15(భారతశక్తి): గిరిజన గోత్రాలు, పూజ ఆచారాల ప్రకారం అమ్మవార్ల పూజారుల అంగీకారం పూర్తి అయిన అనంతరమే గద్దెల ప్రాంతంలో నూతన టెక్నాలజీతో పనులన ప్రారంభించడం జరుగుతుందని రాష్ట్ర పంచాయతీ రాష్ట్రరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ములుగు మండలం ఇంచర్ల గ్రామంలో ఆయిల్ పామ్ పరిశ్రమ నిర్మాణం కోసం భూములుఅప్పగించిన 41 మంది కి ఇంచర్లలోని ఏకో పార్క్ వద్ద ప్రభుత్వ భూమి కేటాయిస్తూ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తో కలిసి పట్టాలను అందచేశారు.రైతులకు నష్టపరిహారం అందజేత:ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం మండలంలోని ఇంచర్ల గ్రామ శివారులో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందజేశారు.అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. మహా మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా పలు గ్రామాల గుండా రోడ్డు విస్తరణ పనులు చేయడమే కాకుండాడైవర్షన్ రోడ్లను ఏర్పాటు చేయబోతున్నామని, దీనికి సంబంధించిన నివేదికలను సంబంధిత అధికారులు తయారు చేస్తున్నారని తెలిపారు. జాతర సందర్భంగా రైతులకు ఎలాంటి అన్యాయం



జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని, గత జాతర సందర్భంగా రైతులకు నష్టపరిహారం అందించడం జరిగిందని అన్నారు. గత కొద్ది రోజులుగా గిరిజన పూజారులు, దేవాదాయశాఖ అధికారులత, ఆర్కేటిలాజి అధికారుల తో పలు దాఫాలుగా సమావేశం నిర్వహించడం జరిగిందని, ఈ సందర్భంలో పలు రకాల నిర్ణయాలు తీసుకున్నామని అన్నారు. పూర్తిస్థాయిలో డిపిఆర్ తయారు అయిన అనంతరమే పనులను వేగవంతం చేసి జాతరకు పక్షం రోజుల ముందే పనుల్లో ముగిస్తామని తెలిపారు. గిరిజన పూజారులు, భక్తుల విశ్వాసం దెబ్బ తినకుండా ఆలోచనలు చేస్తున్నామని, వెయ్యి సంవత్సరాలు నిలిచిపోయేలా మంచి నిర్మాణ పనులను పూర్తి చేస్తామని, పనులు ప్రారంభం ప్రారంభించక ముందే పలువులు పలు రకాల ఆరోపణ చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. ములుగు జిల్లా ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా పర్యాటక ప్రాంతంగా తెరకెక్కిందని, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర సమ్మక్క సారలమ్మ, దట్టమైన అడవి ప్రాంతం తో పాటు పలు రకాల పర్యాటక ప్రాంతాలు పర్యాటకులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని అన్నారు. గద్దెల ప్రాంతంలో చిన్న గద్దెలను మాత్రమే కొంత మార్పిడి చేసే అవకాశం ఉందని, గద్దెలపై రాజకీయం చేయడం మానుకోవాలని హితవు పలికారు. దేవుని దగ్గర రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన సమ్మక్క సారలమ్మ జాతర ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నారని , ప్రపంచవ్యాప్తంగా అమ్మవార్ల ప్రాముఖ్యత సంతరించుకున్నదని అన్నారు. ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసుకునే పనులను ప్రారంభించడం జరుగుతుందని, మేడారం ప్రాంతంలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క ను కోరారు. ములుగు జిల్లా అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.కలెక్టర్ మాట్లాడుతూ : ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ కోసం భూములు ఇచ్చిన రైతులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని, ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాటు ఇంటిగ్రేటెడ్ పాఠశాల, అటవీ శాఖ వారు ఏకో పార్కును ఏర్పాటు చేయడంతో ఇక్కడి ప్రాంతం రానున్న రోజులలో అందనంత అభివృద్ధి చెందుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, ఆర్డీఓ వెంకటేష్, ఇంచర్ల గ్రామంలో ఆయిల్ పామ్ పరిశ్రమ నిర్మాణం కోసం భూములు అప్పగించిన 41 మంది రైతులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత మగ్గం వర్క్ శిక్షణ

– సంగారెడ్డిలో 18 నుండి ప్రారంభం

సంగారెడ్డి, (భారత శక్తి ప్రతినిధి )సెప్టెంబర్ 15:



మెదక్, సంగారెడ్డి జిల్లాల మహిళలకు (18–45 సంవత్సరాలు) మగ్గం వర్క్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుండి సంగారెడ్డి పట్టణంలోని పాత డీఆర్డీఏ కార్యాలయం ఆవరణలో ఉన్న శిక్షణ కేంద్రంలో శిక్షణ ప్రారంభమవుతుందని తెలిపారు. శిక్షణతో పాటు భోజనం, వసతి కూడా ఉచితంగా అందించబడుతుంది. మరిన్ని వివరాలకు 9704446956, 9490129839 నందు సంప్రదించవచ్చని తెలిపారు.

## దసరా ఉత్సవ కమిటీ నియామకం



ములుగు జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 15 (భారతశక్తి) :
దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించు కొని ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో ములుగులో నిర్వహించనున్న రావ ణాసుర వధ ఉత్సవాలకు కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం ములుగు బొడ్రాయి వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా గండ్రకోట కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రాసమల్ల శివాజీ, ఓడ రాజు, గాదం దేవేందర్, అబ్బు నరేందర్రెడ్డి, మారబోయిన సంపత్, అను ముల సురేష్, గుండెబోయిన రమేష్, ఎల్కతుర్తి శ్రీహరితో పాటు ప్రధాన కార్యదర్శి, కార్యదర్శులు, సహాయ కార్యదర్శి, కన్వీనర్, కోశాధికారి, సహయ కోశాధికారి, తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకొన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కుమార్ మాట్లాడారు.
ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని, దీని కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు.మీడియా ఇన్చార్జిగా గుగ్గిళ్ళ సృజన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సంవత్సరం ఈ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా హిందూ సంస్కృతి, సాంప్రదాయాల మేల వింపుతో ఘనంగా నిర్వహిస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.


## అర్జీలు సకాలంలో పరిష్కరించాలి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.



రాజన్న సిరిసిల్ల,సెప్టెంబర్15(భారత శక్తి): ప్రజావాణి కు వచ్చే అర్జీలు సకాలంలో పరిష్కరించాలనికలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో ప్రజల నుంచి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 185 దరఖాస్తులు వచ్చాయయని రెవెన్యూ 61, డీఆర్డీఏ కు 44, హౌసింగ్ శాఖకు 25, ఉపాధి కల్పన కార్యాలయం,ఎస్డీసీ కార్యాలయానికి 8 చొప్పున, విద్యా శాఖ, జిల్లా పంచాయతీ కార్యాలయానికి 6 చొప్పున, జిల్లా పౌర సరఫరాల అధికారికి 5, ఎస్పీ, జిల్లా లైబ్రరీ సెక్రటరీ, జిల్లా వైద్యాధి కారికి మూడు చొప్పున, మున్సిపల్ కమిషనర్ వేములవాడ,ఈడీఎంకు రెండు చొప్పున, జిల్లా సంక్షేమ అధికారి, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల, ఏడీ ఎస్ ఎల్ ఆర్, డీఐఈఓ, సీపీఓ, సెస్, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి, ఈఈ ఆర్ అండ్ బీ, ఎస్ఆర్ఆర్ టెంపుల్ ఈఓ వేములవాడకు ఒకటి చొప్పున వచ్చాయని అధికారులు తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, జెడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదులపై దాడులు.. దీక్షకు బార్ అసోసియేషన్ సిద్ధం

సంగారెడ్డి, (భారత శక్తి ప్రతినిధి)సెప్టెంబర్ 15:



న్యాయవాదులపై దాడులు జరగకుండా నిరోధక చట్టం తీసుకురావాలని సంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ విష్ణువర్ధన్ రెడ్డి 48 గంటలపాటు దీక్ష చేపట్టనున్నట్లు ప్రకటించారు. ఈనెల 17 నుండి 19 వరకు జరిగే ఈ దీక్షకు అందరూ మద్దతు తెలపాలని ఆయన కోరారు. సంగారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ హాలులో సోమవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఈ ప్రకటన వెలువడింది. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

# అమెరికా వార్నింగ్‌లు బేఖాతరు!.. భారత్‌పై రష్యా కీలక వ్యాఖ్యలు

* భారత వస్తువులపై అమెరికా భారీ సుంకాలు
* రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై ఆగ్రహం
* భారత్‌కు అండగా నిలిచిన రష్యా
* తమ మైత్రిని ఎవరూ విడదీయలేరన్న మాస్కో
* అమెరికా ఒత్తిళ్లను పట్టించుకోని భారత్

ఢిల్లీ, సెప్టెంబర్ 15 (భారత శక్తి) : భారత వస్తువులపై అమెరికా భారీగా సుంకాలు విధిస్తూ ఒత్తిడి పెంచుతున్న కీలక తరుణంలో, రష్యా తన మిత్రదేశమైన భారత్‌కు అండగా నిలిచింది. ఇరు దేశాల మధ్య ఉన్న బంధం అత్యంత దృఢమైనదని, దానిని బలహీనపరిచే ఏ ప్రయత్నమైనా విఫలమవుతుందని మాస్కో స్పష్టం చేసింది. బయటి శక్తుల ఒత్తిళ్లకు, హెచ్చరికలకు భారత్ తలొగ్గకుండా సహకారాన్ని కొనసాగించడంపై రష్యా విదేశాంగ శాఖ ప్రశంసలు కురిపించింది. ఓ రష్యన్ అధికారి 'ఆర్టీ' వార్తా సంస్థతో మాట్లాడుతూ, మాస్కోతో సంబంధాల విషయంలో భారత్ ఎటువంటి సంకోచం లేకుండా నిబద్ధతతో ముందుకు సాగుతోందని కొనియాడారు. ఇరు దేశాల భాగస్వామ్యం స్థిరత్వం, విశ్వాసం పునాదులపై నిర్మితమైందని, స్పష్టమైన లక్ష్యంతో ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. భారత ఉత్పత్తులపై అమెరికాలోని డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం 25 శాతం సుంకాలు విధించింది. దీనికి అదనంగా, రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లకు సంబంధించిన దిగుమతులపై మరో 25 శాతం పన్ను వేసింది. దీంతో అమెరికా మార్కెట్లోకి ప్రవేశించే భారత ఎగుమతులపై మొత్తం 50 శాతం సుంకం పడుతోంది. ఇది ప్రపంచంలోనే అత్యధికం కావడం గమనార్హం. రష్యా నుంచి చమురు కొనడం ద్వారా ఉక్రెయిన్ విషయంలో మాస్కో చర్యలకు భారత్ సహకరిస్తోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆరోపిస్తున్నారు. అమెరికా చర్యలను భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇవి అన్యాయమైనవని పేర్కొంది. అమెరికా, యూరప్ దేశాలు కూడా రష్యా నుంచి పెద్ద మొత్తంలో ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నాయని న్యూఢిల్లీ గుర్తు చేసింది. ఈ ఒత్తిళ్లు పెరుగుతున్నప్పటికీ, ప్రధాని నరేంద్ర మోదీ చైనాలోని టియాంజిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సుకు హాజరయ్యారు. చైనా, రష్యా నేతలతో కలిసి ఆయన ఈ వేదికపై కనిపించడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. రక్షణ ఉత్పత్తులు, అంతరిక్ష పరిశోధన, అణు ఇంధనం, సంయుక్త ఆయిల్ ప్రాజెక్టులు వంటి కీలక రంగాల్లో ఇరు దేశాల మధ్య బలమైన సహకారం ఉందని రష్యా నొక్కి చెప్పింది. ఈ బంధం జాతీయ ప్రయోజనాల ఆధారంగా రూపుదిద్దుకుందని, బయటి శక్తుల ఆదేశాలతో కాదని స్పష్టం చేసింది. మరోవైపు, భారత్‌తో వాణిజ్య చర్చల్లో పురోగతిని ఆశిస్తున్నట్లు ట్రంప్ పేర్కొనడం గమనార్హం.

## రాష్ట్ర పోలీసింగ్‌లో సంస్కరణలు..
### ఐపీఎఫ్‌తో కీలక ఒప్పందం




హైదరాబాద్, సెప్టెంబర్ 15 (భారత శక్తి) : తెలంగాణ పోలీస్, ఇండియన్ పోలీస్ ఫౌండేషన్ (ఐపీఎఫ్), మధ్య రాష్ట్రంలో పోలీస్ సంస్కరణల ప్రాజెక్ట్ కోసం అవగాహన ఒప్పందం జరిగింది. ఈ ప్రాజెక్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వం (హోం శాఖ) ఆగస్టు 18వ తేదీన జారీ చేసిన జి.ఓ.ఆర్.టి. నం.765 ద్వారా ఆమోదించిందని డీజీపీ జితేందర్ తెలిపారు. డీజీపీ కార్యాలయంలో పోలీస్ ఉన్నతాధికారులతో ఐపీఎఫ్ అధికారులు సోమవారం సమావేశమయ్యారు. ఇండియన్ పోలీస్ ఫౌండేషన్ ఎంపిక చేసిన సైబరాబాద్, సంగారెడ్డి ఏరియాలో పోలీస్ రిఫార్మ్స్ ఏర్పాటు చేయనున్నట్లు డీజీపీ వెల్లడించారు. న్యూఢిల్లీలో మాజీ డీజీపీ ఎన్. రామచంద్రన్ స్థాపించిన ఇండియన్ పోలీస్ ఫౌండేషన్ సంస్థ ద్వారా పోలీసింగ్‌లో సంస్కరణలు జరిగినట్లు తెలిపారు. సివిల్ సర్వెంట్స్ బోర్డుతో కూడా ఐపీఎఫ్ పని చేస్తుందన్నారు. రాష్ట్ర పోలీస్ శాఖ చేపట్టిన మీ సేవ, పోలీస్ స్టేషన్లలో క్యూర్ కోడ్ వ్యవస్థ, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, మహిళల కోసం 'టిసేఫ్' యాప్" వంటి కార్యక్రమాలకు ఈ ప్రాజెక్ట్ మరింత విలువ చేకూరుస్తుందని డీజీపీ తెలిపారు. ఈ ప్రాజెక్ట్ సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 15 పోలీస్ స్టేషన్లు, సంగారెడ్డి జిల్లా పరిధిలో 15 పోలీస్ స్టేషన్లలో అమలు అవుతుందన్నారు. ఇతర రాష్ట్రాల్లోని ఈ-ఎఫ్ఐఆర్, కమ్యూనిటీ పోలీసింగ్, ఎస్ఓపి మార్పులు, పోలీస్ కమిషన్ సిఫార్సులు వంటి ఉత్తమ పద్ధతులను అనుసరించి సమగ్ర రిపోర్ట్ సిద్ధం చేస్తారని తెలిపారు. ఎంపికైన 30 పోలీస్ స్టేషన్లలో సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్ట్‌కు నోడల్ ఆఫీసర్‌గా పోలీస్ అకాడమీ డైరెక్టర్, అభిలాషా బిష్త్ వ్యవహరించనున్నారని పేర్కొన్నారు. ఐపీఎఫ్ అధ్యక్షుడు సీఈవో యూపి మాజీ డిజిపి ఓం ప్రకాశ్ సింగ్ మాట్లాడుతూ హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, కేరళ, ఉత్తరప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలలో ఐపిఎఫ్ రాష్ట్ర విభాగాలు ఏర్పాటయ్యాయని, త్వరలో తెలంగాణలోనూ విస్తరించనున్నట్లు తెలిపారు.

## రైలు ప్రయాణికులకు అలర్ట్...
# అక్టోబరు 1 నుంచి కొత్త నిబంధన

* అక్టోబర్ 1 నుంచి రైల్వే టికెట్ బుకింగ్‌లో కొత్త నిబంధన అమలు
* జనరల్ రిజర్వేషన్ టికెట్లకు ఆధార్ వెరిఫికేషన్ తప్పనిసరి
* బుకింగ్ ఓపెన్ అయిన మొదటి 15 నిమిషాల పాటు ఈ రూల్ వర్తింపు
* మోసపూరిత బుకింగ్‌లకు అడ్డుకట్ట వేసేందుకే ఈ నిర్ణయం
* ఇప్పటికే తత్కాల్ టికెట్లకు ఈ విధానం అమలులో ఉంది
* ప్రయాణికులు తమ ఐఆర్‌సీటీసీ ఖాతాలకు ఆధార్‌ను లింక్ చేసుకోవాలని సూచన



ఢిల్లీ, సెప్టెంబర్ 15 (భారత శక్తి): దేశవ్యాప్తంగా రైలు ప్రయాణికులకు ఇది ఒక ముఖ్యమైన అప్‌డేట్. రైల్వే టికెట్ల బుకింగ్ వ్యవస్థలో పారదర్శకత పెంచేందుకు, మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు రైల్వే బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. 2025 అక్టోబర్ 1 నుంచి జనరల్ రిజర్వేషన్ టికెట్ల బుకింగ్‌కు కూడా ఆధార్‌ను తప్పనిసరి చేయనుంది. అయితే, ఈ నిబంధన బుకింగ్ ప్రక్రియ మొత్తానికి కాకుండా, టికెట్లు అందుబాటులోకి వచ్చిన మొదటి 15 నిమిషాల వరకు మాత్రమే వర్తిస్తుంది.

**ఏమిటీ కొత్త నిబంధన?**

ప్రస్తుతం తత్కాల్ టికెట్లు బుక్ చేసుకోవాలంటే ఐఆర్‌సీటీసీ ఖాతాకు ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా ఉంది. ఇప్పుడు ఈ విధానాన్ని జనరల్ కోటా టికెట్లకు కూడా విస్తరించారు. ఉదాహరణకు, ఒక ప్రయాణికుడు నవంబర్ 15న ప్రయాణించేందుకు శివ గంగ ఎక్స్‌ప్రెస్‌లో టికెట్ బుక్ చేసుకోవాలనుకుంటే, నిబంధనల ప్రకారం 60 రోజుల ముందుగా, అంటే సెప్టెంబర్ 16న అర్ధరాత్రి 12:20 గంటలకు బుకింగ్స్ ఓపెన్ అవుతాయి. కొత్త నిబంధన ప్రకారం, 12:20 నుంచి 12:35 గంటల మధ్య, అంటే మొదటి 15 నిమిషాల పాటు కేవలం ఆధార్ వెరిఫికేషన్ పూర్తి చేసుకున్న ఐఆర్‌సీటీసీ యూజర్లు మాత్రమే టికెట్లు బుక్ చేసుకోగలరు. ఆధార్ లింక్ లేని ఖాతాదారులకు ఆ సమయంలో బుకింగ్ చేసుకునే అవకాశం ఉండదు. ఈ కీలకమైన సమయంలోనే టికెట్లకు అత్యధిక డిమాండ్ ఉంటుంది కాబట్టి, నిజమైన ప్రయాణికులకు న్యాయం చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

**పండగల సీజన్‌లో ప్రయోజనం**

దీపావళి, హోలీ, ఛాత్ పూజ వంటి ప్రధాన పండగల సమయంలో, అలాగే పెళ్లిళ్ల సీజన్‌లో రైలు టికెట్లకు తీవ్రమైన పోటీ ఉంటుంది. బుకింగ్స్ ప్రారంభమైన కొద్ది క్షణాల్లోనే టికెట్లు అయిపోతాయి. ఈ డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని కొందరు అక్రమార్కులు, ఏజెంట్లు మోసపూరిత పద్ధతుల్లో టికెట్లను బ్లాక్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కొత్త ఆధార్ ఆధారిత నిబంధనతో ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని రైల్వే బోర్డు భావిస్తోంది. దీనివల్ల సాధారణ, నిజమైన ప్రయాణికులకు టికెట్లు దొరికే అవకాశాలు మెరుగుపడతాయి. ఇప్పటికే 2025 జూలై నుంచి తత్కాల్ బుకింగ్‌కు ఈ విధానం విజయవంతంగా అమలవుతున్న నేపథ్యంలో, ఇప్పుడు జనరల్ కోటాకు కూడా దీనిని విస్తరించారు.

**ప్రయాణికులు ఏం చేయాలి?**

ఈ మార్పుల నేపథ్యంలో ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండాలంటే, అక్టోబర్ 1లోగా తమ ఐఆర్‌సీటీసీ యూజర్ ఐడీకి ఆధార్ నంబర్‌ను అనుసంధానం చేసుకోవాలని రైల్వే శాఖ సూచిస్తోంది. సాధారణంగా రైలు టికెట్ల జనరల్ రిజర్వేషన్ విండో ప్రతిరోజూ అర్ధరాత్రి 12:20 గంటల నుంచి రాత్రి 11:45 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. కొత్త రూల్ కేవలం మొదటి 15 నిమిషాలకు మాత్రమే వర్తిస్తుంది. ఈ మార్పు ద్వారా దేశంలోని కోట్లాది మంది ప్రయాణికులకు మరింత సురక్షితమైన, న్యాయమైన టికెటింగ్ ప్రక్రియను అందించడమే తమ లక్ష్యమని రైల్వే అధికారులు స్పష్టం చేశారు.

## 'డీజిల్‌కు కూడా డబ్బులు లేవు'..
### హరీష్ రావు ఆసక్తికర ట్వీట్



హైదరాబాద్, సెప్టెంబర్ 15 (భారత శక్తి): రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి పై బీఆర్ఎస్ నేత హరీష్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్టు పెట్టారు. 'బిల్లులు ఇవ్వట్లేదని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ బంద్.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులు ఆపేయడంతో కాలేజీలు బంద్.. విద్యార్థులకు నిరుద్యోగ భృతి బంద్, జాబ్ క్యాలెండర్ బంద్, ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు బంద్.. నిధుల లేక గ్రామాల్లో పారిశుధ్యం బంద్.. డీజిల్ పోయించేందుకు కూడా డబ్బులు లేక చెత్త ఎత్తే ట్రాక్టర్లు బంద్. రైతులకు రుణ మాఫీ బంద్, పంట బోనస్ బంద్, వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా బంద్.. పంట పండిద్దామంటే చివరకు అన్నదాతకు యూరియా బంద్.. 22 నెలల కాంగ్రెస్ పాలనలో సంక్షేమం బంద్, అభివృద్ధి బంద్.. ఎక్కడ చూసినా బందు, బందు, బందు' అని హరీష్ రావు మండిపడ్డారు. రేవంత్ రెడ్డి చేతగాని, దద్దమ్మ పాలనను చూసి అన్ని వర్గాల ప్రజలు విసిగి వేసారి పోయారని అన్నారు. అందుకే కాంగ్రెస్ నేతలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ నేతల డ్రామాలను బంద్ పెట్టే రోజులు ఇక దగ్గర్లోనే ఉన్నాయని హరీష్ రావు ట్వీట్‌లో పేర్కొన్నారు.


## ఇప్పుడు ఆ దిక్కుమాలిన విషయం ఎందుకు?..
### కవిత ఆరోపణలపై ఈటల కామెంట్స్



హైదరాబాద్, సెప్టెంబర్ 15 (భారత శక్తి) : ఈటల రాజేందర్ సహా పలువురు సీనియర్లు బీఆర్ఎస్ ను వీడిపోవడానికి హరీశ్ రావు, సంతోశ్ రావే కారణం అంటూ తెలంగా జాగృతి అధ్యక్షురాలు కవిత చేసిన వ్యాఖ్యలపై ఈటల రాజేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నన్ను బీఆర్ఎస్ నుంచి బయటకు పంపించి వారు ఏం సాధించారని ప్రశ్నించారు. నేను నవ్వు ముఖంతోనే ఉన్నానని చెప్పారు. ఇవాళ హుజూరాబాద్ లో మీడియాతో మాట్లాడిన సందర్భంగా కవిత ఆరోపణలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నపై ఈటల స్పందించారు. యూరియా, ఫీజు రీయింబర్స్ మెంట్ వంటి ఇంత మంచి సబ్జెక్ట్ పై మాట్లాడాక ఆ దిక్కుమాలిన విషయం గురించి ఎందుకు అని అన్నారు. ఆ పార్టీలో ఉండగా నన్ను హింస పెడితే పెట్టొచ్చు. కానీ నాకేమొచ్చింది వారికి ఏమొచ్చిందో అందరికి తెలుసన్నారు. భూలోకంలోనే నరకం అనుభవించిన వ్యక్తిని నేను అని చెప్పారు. నా జీవితంలో మొదటి సారి చూస్తున్న:ప్రైవేట్ కాలేజీలకు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు, గెస్ట్ లెక్చరర్లు, సిబ్బంది బకాయుల గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన చేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఈసమస్యలను ముఖ్యమంత్రి పట్టించుకోకుండా మాటలతో అదరగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మీ పర్యటనలపై దినపత్రికల్లో వస్తున్న పతాకశీర్షికలను చూసి మురిసిపోతున్నారు కానీ వాటి వెనుక నలిగిపోతున్న ప్రజల గాథను ఆలోచించాలన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ అనేది ప్రైవేట్ కాలేజీల సమస్య కాదని లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, లక్షల మంది లెక్చరర్ల సమస్య అన్నారు. ఈ విషయంలో భేషజాలకు పోకుండా సమస్యను పరిష్కరించాలని బీజేపీ తరపున డిమాండ్ చేశారు. తాను ఇన్నేళ్లుగా ప్రభుత్వంలో ఉండి అనేక బాధ్యతలు చూశానని కానీ ఇంత బాధ్యతారాహిత్యమైన ప్రభుత్వాన్ని మాత్రం తొలిసారి చూస్తున్నానని విమర్శించారు. ఇది మంచిది కాదన్నారు. యూరియా కొరత విషయంలో రాష్ట్ర ప్రభుత్వానిదే నిర్లక్ష్యం అని విమర్శించారు. వర్షాలు బాగా వర్షాలు పడితే యూరియా బాగా వాడుతారని అంతే తప్పా యూరియా వాడకూడదని చెబితే ఎలా అన్నారు. ప్రభుత్వానికి అంచనా ఉండాలి కదా? బఫర్ స్టాక్ పెట్టుకోవాలి కాదా అని ప్రశ్నించారు. కేంద్రప్రభుత్వంపై నిందలు వేయడం ఆపేయాలన్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు.

## సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం.. ఏర్పాట్లను పరిశీలించిన డీజీపీ, అధికారులు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (భారత శక్తి) : సెప్టెంబర్ 17 ను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంగా ప్రకటించిన విషయం తెలిసిందే. పబ్లిక్ గార్డెన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం వేడుకలను ఘనంగా నిర్వహించబోతుంది. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు నిర్వహించే రిహార్సల్స్, ఏర్పాట్లను డీజీపీ జితేందర్ పరిశీలించారు. ఆయనతో పాటు ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్, విద్యుత్ శాఖ ఎండీ ముషారఫ్ అలీ, సమాచార శాఖ కమిషనర్ సీహెచ్ ప్రియాంక, జిల్లా కలెక్టర్ హరిచందన, ప్రోటోకాల్ జాయింట్ సెక్రటరీ శివలింగయ్య, అడిషనల్ సీపీ విక్రమ్ సింగ్ మాన్, వివిధ శాఖల ఉన్నతాధికారులు తదితరులు ఉన్నారు. కాగా, సెప్టెంబర్ 17న, 1948లో హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనం అయింది. ఈ సందర్భంగా సెప్టెంబర్ 17 ను ప్రజా పాలన దినోత్సవంగా జరుపుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2024 లో నిర్ణయించింది. ఈ మేరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పట్టణ స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీలలో జాతీయ జెండాను ఎగురవేస్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్‌లో జరిగే అధికారిక కార్యక్రమంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. మంత్రులు, ఇతర ప్రముఖులు జిల్లా కేంద్రంలో పాల్గొంటారు. అలాగే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం సెప్టెంబర్ 17 ని జాతీయ సమైక్యతా దినోత్సవంగా నిర్వహించింది. మరోవైపు, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవంగా జరుపుకోవాలని గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే.



# ఇందిరమ్మ ఇళ్లకు బిల్లుల కష్టాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (భారత శక్తి) :** : దేవుడు కరుణించినా పూజారి కనికరించని చందంగా ఉంది వైరా మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిస్థితి. మున్సిపాలిటీలోని ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు బేస్మెంట్ లెవల్లో ఇంటి నిర్మాణాలు పూర్తి చేసినప్పటికీ లాగిన్ లో ఫొటోలు అప్లోడ్ చేసే నాథుడు లేక లబ్ధిదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 10 రోజులుగా లాగిన్ లో ఫొటోలు అప్లోడ్ చేయకపోవడంతో బిల్లులు రాక లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను నిలిపివేశారు. వైరా మున్సిపాలిటీలో ఉన్న 20 వార్డుల్లో సుమారు 400 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ళను ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే వైరా పట్టణంతో పాటు మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో సుమారు 100 మంది లబ్ధిదారులు బేస్మెంట్ లెవల్లో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ముందుగా ఖాళీ స్థలంలో ముగ్గు పోసి జియో టాగింగ్ తో ఫొటో తీయాల్సి ఉంటుంది. బేస్మెంట్ లెవెల్ లో నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రభుత్వ లాగిన్ లో వార్డ్ ఆఫీసర్ ఫొటో అప్లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత గృహ నిర్మాణ శాఖ ఏఈ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం చేపట్టారో లేదో చూసి మరో ఫొటో తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా నాలుగు దశల్లో ఫొటోలు తీసుకోవాల్సి ఉంటుంది. బేస్మెంట్ లెవల్ నిర్మాణం పూర్తి చేసిన తర్వాత లక్ష రూపాయలు, రూఫ్ లెవల్ నిర్మాణం చేపట్టిన తర్వాత మరో లక్ష రూపాయలు, స్లాబ్ పోసిన తర్వాత రెండు లక్షల రూపాయలు, పూర్తిస్థాయిలో ఇంటి నిర్మాణం చేపట్టిన తర్వాత లక్ష రూపాయల నగదును ప్రభుత్వం అందజేస్తుంది. వైరా మున్సిపాలిటీలో ఉన్న 20 వార్డ్ ఆఫీసర్లలో 13 మంది రెవెన్యూ గ్రామ పాలన అధికారులుగా ఇక్కడి నుంచి పలు ప్రాంతాలకు బదిలీ అయ్యారు. దీంతో మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లాగిన్ లో ఫొటోలు తీసేవారు కరువయ్యారు. ఈ విషయమై ఇప్పటికే మున్సిపాలిటీ కమిషనర్ కు పలువురు లబ్ధిదారులు రాజకీయ నాయకుల ద్వారా సమస్యను వివరించారు. అయినప్పటికీ ఇందిరమ్మ ఇళ్ల ఫొటోలను తీసేందుకు మున్సిపాలిటీ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయలేకపోయారు. దీంతో వైరా మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఆరంభ శూరత్వంగా మారిందనే విమర్శలు వినవస్తున్నాయి. ప్రభుత్వం ప్రతి సోమవారం లాగిన్ లో అప్లోడ్ అయిన ఫొటోల ఆధారంగా లబ్ధిదారులకు విధిగా నగదును ఖాతాల్లోకి జమ చేస్తుంది. మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్లు లేకపోవడంతో గత రెండు సోమవారాలల్లో లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చే నగదు అందటం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి వైరా మున్సిపాలిటీలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల ఫొటోలను వెంటనే లాగిన్ లో అప్లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

# రూ. 10 కోట్లకు బండి సంజయ్‌పై కేటీఆర్ పరువు నష్టం దావా

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (భారత శక్తి) :** కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రూ.10 కోట్ల పరువు నష్టం దావా వేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తనపై బండి సంజయ్ ఎటువంటి ఆధారాలు లేకుండా తీవ్రమైన ఆరోపణలు చేశారని, దీనివల్ల తన ప్రతిష్ఠకు భంగం కలిగిందని ఆరోపిస్తూ కేటీఆర్ హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. తనపై చేసిన ఆరోపణలకు సంబంధించి బేషరతుగా క్షమాపణ చెప్పాలని కోరుతూ కేటీఆర్ తరఫు న్యాయవాదులు ఆగస్టు 11న బండి సంజయ్‌కు లీగల్ నోటీసు పంపారు. అయితే, ఆ నోటీసులకు బండి సంజయ్ స్పందించకపోవడంతో పాటు, క్షమాపణ చెప్పడానికి నిరాకరించడంతో కేటీఆర్ న్యాయపోరాటానికి దిగారు. ఈ క్రమంలోనే ఆయన సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ దావాలో కేటీఆర్ పలు కీలక విషయాలను ప్రస్తావించారు. బండి సంజయ్ తనపై చేసిన ఆరోపణలకు గాను బేషరతుగా, బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో తన పరువుకు నష్టం కలిగించేలా ఎటువంటి వ్యాఖ్యలు, ప్రసంగాలు, ప్రచురణలు చేయకుండా బండి సంజయ్‌ను నిరోధిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. అలాగే, ఇప్పటికే ఆన్‌లైన్ వేదికలు, సామాజిక మాధ్యమాలు, ఇతర వార్తా మాధ్యమాలలో ఉన్న పరువు నష్టపరిచే కథనాలు, వీడియోలు, పోస్టులను తక్షణమే తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని తన పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు.

# గూగుల్ 'నానో బనానా' ఏఐ టూల్ పై వీసీ సజ్జనార్ హెచ్చరిక!

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (భారత శక్తి) :** సోషల్ మీడియాలో ప్రస్తుతం ఓ కొత్త ట్రెండ్ విపరీతంగా వైరల్ అవుతోంది. తమ ఫొటోలను ప్రత్యేకమైన 3డి బొమ్మల రూపంలోకి, పాతతరం బాలీవుడ్ హీరోయిన్ల చీరకట్టు శైలిలోకి మార్చుకొని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడం బాగా ప్రాచుర్యం పొందింది. గూగుల్ సంస్థకు చెందిన 'జెమిని నానో బనానా' అనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్ ద్వారా ఈ ఫొటోలను క్రియేట్ చేస్తున్నారు. 'నానో బనానా', 'బనానా ఏఐ శారీ' పేర్లతో నడుస్తున్న ఈ ట్రెండ్ చూడటానికి చాలా సరదాగా ఉన్నప్పటికీ, దీని వెనుక తీవ్రమైన ప్రైవసీ, భద్రతాపరమైన ముప్పులు పొంచి ఉన్నాయని టెక్నాలజీ నిపుణులు, సైబర్ క్రైమ్ అధికారులు హెచ్చరిస్తున్నారు.

**వీసీ సజ్జనార్ ఏమన్నారంటే...!**

ఈ ట్రెండ్‌పై తెలంగాణ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ స్పందించారు. అధికారిక ప్లాట్‌ఫామ్‌లను పోలిన నకిలీ వెబ్‌సైట్లు లేదా యాప్‌ల ద్వారా వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించి, ఆర్థిక మోసాలకు పాల్పడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఒకసారి మన డేటా అనధికారిక ప్లాట్‌ఫామ్‌లకు చేరితే, దాన్ని తిరిగి పొందడం దాదాపు అసాధ్యమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకునేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**యువతను ఆకర్షిస్తున్న ట్రెండ్**

గత నెలలో ప్రారంభమైన ఈ ఏఐ టూల్, అప్‌లోడ్ చేసిన ఫొటోలను క్షణాల్లో ఆకర్షణీయమైన చిత్రాలుగా మారుస్తుండటంతో యువత దీనికి బాగా ఆకర్షితులవుతున్నారు. అయితే, ఈ ప్రక్రియలో వినియోగదారులు తమ వ్యక్తిగత ఫొటోలను థర్డ్‌పార్టీ ప్లాట్‌ఫామ్‌లకు అప్పగించాల్సి వస్తోంది. ఇక్కడే అసలు ప్రమాదం మొదలవుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారుల డేటాను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు నకిలీ వెబ్‌సైట్లు, యాప్‌లను సృష్టించే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. కాగా, సున్నితమైన ఫొటోలను, లొకేషన్ వివరాలను ఇలాంటి ఏఐ టూల్స్‌కు అప్‌లోడ్ చేయకపోవడమే మంచిదని నిపుణులు సలహా ఇస్తున్నారు. సోషల్ మీడియాలో ప్రైవసీ సెట్టింగులను కఠినతరం చేసుకోవడం ద్వారా కొంతవరకు ముప్పును తగ్గించుకోవచ్చని వారు పేర్కొన్నారు.

**వాటర్‌మార్క్‌లు ఉన్నా నమ్మకం లేదు!**

తాము రూపొందించిన ఏఐ చిత్రాలపై 'సింథ్ఐడీ' అనే కంటికి కనిపించని డిజిటల్ వాటర్‌మార్క్‌ను ముద్రిస్తున్నట్లు గూగుల్ చెబుతోంది. దీనివల్ల ఏది ఏఐ చిత్రమో గుర్తించవచ్చని పేర్కొంటోంది. కానీ, ఈ వాటర్‌మార్క్‌లను గుర్తించే టూల్స్ సాధారణ ప్రజలకు అందుబాటులో లేవు. పైగా, ఇలాంటి వాటర్‌మార్క్‌లను సులభంగా తొలగించవచ్చని లేదా మార్చేయవచ్చని సైబర్ భద్రతా నిపుణులు స్పష్టం చేస్తున్నారు. "వాటర్‌మార్కింగ్ విధానం ఆశాజనకంగా ఉన్నప్పటికీ, దాన్ని సులభంగా ఫేక్ చేయవచ్చు. నిజ ప్రపంచంలో దీని ప్రభావం చాలా పరిమితం" అని రియాలిటీ డిఫెండర్ సీఈఓ బెన్ కోల్‌మన్ తెలిపారు. యూసీ బర్క్‌లీ ప్రొఫెసర్ హానీ ఫరిద్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ, వాటర్‌మార్కింగ్ మాత్రమే పూర్తిస్థాయి పరిష్కారం కాదని, అదనపు భద్రతా చర్యలు తప్పనిసరి అని అన్నారు.

# నాలాల కబ్జా వల్ల వరద సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (భారత శక్తి) :** భాగ్యనగరంలో నాలాల ఆక్రమణల కారణంగా వరదలు సంభవించి ప్రమాదాలు జరుగుతున్నాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ఆదివారం రాత్రి అఫ్జల్ సాగర్‌లో ఇద్దరు వ్యక్తులు గల్లంతైనట్లు ఆయన వెల్లడించారు. నాలాల ఆక్రమణల వల్లే ఇటువంటి దుర్ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాల కారణంగా అఫ్జల్ సాగర్ ప్రాంతంలో కొన్ని ఇళ్లను తొలగించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. నిన్న ముగ్గురు గల్లంతవ్వగా, అందులో ఇద్దరు మరణించినట్లు ఆయన పేర్కొన్నారు. నగరంలోని సమస్యల పరిష్కారానికి హైడ్రా సంస్థ నిరంతరం కృషి చేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

**స్పందించిన కలెక్టర్**

అఫ్జల్ సాగర్ డ్రైనేజీలో ఇద్దరు గల్లంతైన ఘటనకు సంబంధించి, బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 5 లక్షల నష్టపరిహారాన్ని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన ప్రకటించారు. పాత ఇళ్లలో నివసించేవారు జాగ్రత్తగా ఉండాలని ఆమె సూచించారు. కొన్ని నాలాలపై నిర్మాణాలు ఉన్నాయని, వాటి వల్ల అందరికీ ప్రమాదమని ఆమె హెచ్చరించారు. అఫ్జల్ సాగర్ పరిధిలో నివసిస్తున్న అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు.

# కృత్రిమ మేధపై కేంద్రం కీలక వైఖరి.. నిర్మల సీతారామన్ స్పష్టత

* వేగంగా విస్తరిస్తున్న కృత్రిమ మేధ
* సాంకేతికతతో పాటే నియంత్రణ పరుగెత్తాలన్న నిర్మలా సీతారామన్
* ఆవిష్కరణలను అడ్డుకోని రీతిలో నిబంధనలు ఉండాలని స్పష్టీకరణ
* ఏఐలో భారత్ నాయకత్వ పాత్ర పోషించడమే లక్ష్యమన్న కేంద్ర మంత్రి
* ఉద్యోగాలపై ఏఐ ప్రభావాన్ని జాగ్రత్తగా అంచనా వేయాలని సూచన
* నీతి ఆయోగ్ నివేదిక విడుదల కార్యక్రమంలో మంత్రి కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (భారత శక్తి) :** కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ AI) సాంకేతికత ఒక స్ప్రింటర్ వలె వేగంగా పరుగెడుతోందని, దానికి అనుగుణంగా నియంత్రణ వ్యవస్థ కూడా అంతే వేగంతో కదలాల్సి ఉంటుందని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూనే నైతిక విలువలను విస్మరించకుండా బాధ్యతాయుతమైన వినియోగాన్ని నిర్ధారించాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. సోమవారం ఢిల్లీలో నీతి ఆయోగ్ రూపొందించిన "వికసిత భారత్ కోసం ఏఐ: ఆర్థిక వృద్ధికి అవకాశాలు" అనే నివేదికను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కృత్రిమ మేధ నిరంతరం అభివృద్ధి చెందుతున్న సాంకేతికత అని, దాని విషయంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "సాంకేతికతను పూర్తిగా తుడిచిపెట్టేలా నియంత్రణ ఉండకూడదు. బాధ్యతాయుతమైన వినియోగాన్ని ప్రోత్సహించేందుకే మాకు నిబంధనలు అవసరం" అని ఆమె వివరించారు. ఏఐ రంగంలో ప్రపంచ పరిణామాలకు అనుగుణంగా వెళ్లడమే కాకుండా ఈ సాంకేతికత వినియోగంలో భారత్ నాయకత్వ పాత్ర పోషించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ దిశగా నాస్కామ్ వంటి భాగస్వామ్య పక్షాలతో ప్రభుత్వం నిరంతరం చర్చిస్తోందని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా విద్య, వ్యవసాయం, ఆరోగ్యం, పట్టణ మౌలిక సదుపాయాల వంటి రంగాల్లో ప్రత్యేక ఏఐ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు గుర్తుచేశారు. మెరుగైన నగరాలు, జీవన ప్రమాణాల కోసం ఏఐ పరిష్కారాలను అందించాలని ఆమె ఆకాంక్షించారు. అదే సమయంలో ఏఐ వల్ల ఎదురయ్యే సవాళ్ల పట్ల కూడా మంత్రి హెచ్చరించారు. ముఖ్యంగా ఉద్యోగాలపై దాని ప్రభావాన్ని జాగ్రత్తగా గమనించాలని, దేశ జనాభా ప్రయోజనానికి ఎలాంటి నష్టం కలగకుండా చూసుకోవాలని అన్నారు. వివిధ ఏఐ అప్లికేషన్లను పరీక్షించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఒక ప్రత్యేక శాండ్‌బాక్స్‌ను అభివృద్ధి చేస్తోందని ఆమె వెల్లడించారు. వికసిత భారత్ లక్ష్య సాధనలో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందని, అయితే ఆ ప్రయాణం బాధ్యతాయుతంగా సాగాలని ఆమె పునరుద్ఘాటించారు.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నిక: కవిత కొత్త వ్యూహం.. బరిలో మాజీ ఎమ్మెల్యే?

**హైదరాబాద్, సెప్టెంబర్ 15 (భారత శక్తి) :** తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తి రేపుతున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్‌కు గురైన మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈ ఎన్నికపై పూర్తిస్థాయిలో దృష్టి సారించినట్లు తెలుస్తోంది. తన సత్తా చాటేందుకు ఈ ఉపఎన్నికను వేదికగా మలుచుకోవాలని భావిస్తున్న ఆమె, తెలంగాణ జాగృతి తరఫున సొంత అభ్యర్థిని బరిలోకి దించేందుకు సిద్ధమవుతున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్ రెడ్డి సోమవారం కవితతో భేటీ కావడం ఈ ఊహాగానాలకు మరింత బలాన్నిచ్చింది. దాదాపు అరగంటకు పైగా సాగిన ఈ సమావేశంలో జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో పోటీ సహా పలు కీలక రాజకీయ అంశాలపై వీరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. జాగృతి నుంచి విష్ణువర్ధన్ రెడ్డిని బరిలోకి దించే విషయం దాదాపు ఖరారైందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే, ఈ భేటీ అనంతరం విష్ణువర్ధన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, ఇది కేవలం మర్యాదపూర్వక భేటీ మాత్రమేనని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి ఆలయంలో జరిగే దసరా వేడుకలకు కవితను ఆహ్వానించడానికే తాను కలిశానని, దీనికి రాజకీయాలు ఆపాదించవద్దని ఆయన కోరారు. మరోవైపు, బీఆర్ఎస్ నుంచి బహిష్కరణకు గురైన తర్వాత తనకంటూ ప్రత్యేక రాజకీయ వేదికను ఏర్పాటు చేసుకునే పనిలో కవిత నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ఈ ఏడాది బతుకమ్మ పండుగ సందర్భంగా ఆమె తన కొత్త పార్టీ పేరును ప్రకటించే అవకాశాలు ఉన్నాయని కూడా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే తన రాజకీయ భవిష్యత్తుకు తొలి అడుగుగా జూబ్లీహిల్స్ ఉపఎన్నికను ఆమె ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో జూబ్లీహిల్స్‌కు ఉపఎన్నిక అనివార్యమైంది. త్వరలోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండటంతో ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నాయి.

# పనితీరు బాగుంటేనే కొనసాగింపు.. కలెక్టర్లకు సీఎం చంద్రబాబు స్ట్రాంగ్ మెసేజ్

**అమరావతి, సెప్టెంబర్ 15 (భారత శక్తి) :** "కార్యాలయాల్లో కూర్చుని కాగితాలు చూస్తే అంతా సవ్యంగానే కనిపిస్తుంది. కానీ క్షేత్రస్థాయి వాస్తవాలు వేరుగా ఉంటాయి. అధికారులు మానవతా దృక్పథంతో ఆలోచించి, క్షేత్రస్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను గ్రహించాలి," అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలంటే క్షేత్రస్థాయి అనుభవమే కీలకమని ఆయన నొక్కి చెప్పారు. సచివాలయంలోని ఐదో బ్లాకులో సోమవారం ప్రారంభమైన రెండు రోజుల కలెక్టర్ల సదస్సు తొలి రోజు సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తగా నియమితులైన కలెక్టర్లకు రాష్ట్ర ప్రజలు, మంత్రివర్గం తరఫున శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాలనలో ప్రధాని, ముఖ్యమంత్రి తర్వాత జిల్లా స్థాయిలో కలెక్టర్లే అత్యంత కీలకమైన వ్యక్తులని చంద్రబాబు అభివర్ణించారు. "ఒక జిల్లా రూపురేఖలను మార్చే ప్రధాన బాధ్యత కలెక్టర్లదే. ప్రభుత్వం రూపొందించిన విధానాలను క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేయాల్సింది మీరే. అందుకే సరైన వ్యక్తి సరైన చోట ఉండాలనే లక్ష్యంతోనే సీఎస్, డీజీపీల నుంచి క్షేత్రస్థాయి అధికారుల వరకు నియామకాలు చేపట్టాం. ఎమ్మెల్యేల ఎంపిక, మంత్రివర్గ కూర్పులో ఎలాంటి నిశిత పరిశీలన చేశామో, అదే తరహాలో సమర్థులైన వారిని కలెక్టర్లుగా నియమించాం. మీరంతా ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా పనిచేయాలి," అని ఆయన ఆకాంక్షించారు.

* **పనితీరే కొలమానం.. విఫలమైతే చర్యలు తప్పవు**

అధికారులకు తన సంపూర్ణ మద్దతు ఎప్పుడూ ఉంటుందని భరోసా ఇస్తూనే, పనితీరు విషయంలో కఠినంగా వ్యవహరిస్తానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. "పనితీరు చక్కగా ఉన్న అధికారులను నేను ఎప్పుడూ మార్చలేదు. గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు రిజర్వ్ బ్యాంక్ వంటి ఉన్నత సంస్థలకు వెళ్లారు. మీకు నా పూర్తి మద్దతు ఉంటుంది. కానీ, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమైతే మాత్రం కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి వెనుకాడను. ప్రభుత్వం అందించే ప్రతి సేవలోనూ ప్రజల సంతృప్తే మనకు కొలమానం కావాలి. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలి," అని ఆయన హెచ్చరించారు. ఈ కలెక్టర్ల సదస్సు రాష్ట్ర పాలనలో ఒక కొత్త ఒరవడిని సృష్టించాలని ఆయన ఆకాంక్షించారు.

* **'సూపర్ సిక్స్'తో సంక్షేమంలో నూతన అధ్యాయం**

ఎన్డీఏ కూటమిపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై, అధికారులపై ఉందని చంద్రబాబు గుర్తుచేశారు. "సంపద సృష్టించి, ఆదాయం పెంచి, ఆ ఫలాలను సంక్షేమం ద్వారా ప్రజలకు పంచుతామని చెప్పాం. ఆ మాటను ప్రజలు విశ్వసించే మాకు 94 శాతం స్ట్రైక్ రేట్‌తో అఖండ విజయాన్ని అందించారు. చెప్పినట్టుగానే సూపర్ సిక్స్‌ను విజయవంతంగా అమలు చేస్తున్నాం" అని తెలిపారు. దేశంలోనే అతిపెద్ద సంక్షేమ కార్యక్రమమైన పెన్షన్ల పథకం ద్వారా 64 లక్షల మందికి లబ్ధి చేకూరుస్తున్నామని, 'తల్లికి వందనం'తో ప్రతి విద్యార్థికీ ఆర్థిక చేయూత అందిస్తున్నామని వివరించారు. 'స్త్రీశక్తి' పథకం కింద ఉచిత బస్సు ప్రయాణాన్ని విమర్శించిన వారికి దాని విజయమే సమాధానం చెప్పిందన్నారు. ఈ పథకం వల్ల ఆర్టీసీలో ఆక్యుపెన్సీ 90 శాతానికి పెరిగిందని, ఇందుకు కృషి చేసిన ఆర్టీసీ సిబ్బందిని అభినందించారు. దీపం2 ద్వారా ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు, అన్నదాత సుఖీభవ కింద తొలి విడతగా రూ.7 వేలు అందించామని, అక్టోబర్ 1న ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు అందజేస్తామని ప్రకటించారు.

* **డబుల్ ఇంజిన్ సర్కార్‌తో డబుల్ డిజిట్ గ్రోత్**

"డబుల్ ఇంజిన్ సర్కార్‌తో డబుల్ డిజిట్ గ్రోత్ సాధించాలన్నదే మా లక్ష్యం," అని చంద్రబాబు స్పష్టం చేశారు. 2047 నాటికి 15 శాతం వృద్ధి రేటు సాధించాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ ఏడాది రాష్ట్ర తలసరి ఆదాయాన్ని రూ.3.47 లక్షలకు, 2029 నాటికి జీఎస్‌డీపీని రూ.29 లక్షల కోట్లకు, తలసరి ఆదాయాన్ని రూ.4.67 లక్షలకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు. కేంద్రం రూపొందించిన 'వికసిత్ భారత్ 2047'కు అనుగుణంగా రాష్ట్రం 'స్వర్ణాంధ్ర విజన్ 2047'ను రూపొందించిందని, ఈ విజన్ డాక్యుమెంటే అధికారులందరికీ భగవద్గీత, బైబిల్, ఖురాన్ కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# తిరుమల శ్రీవారికి విద్యుత్ వాహనం అందజేసిన టివోల్ట్ కంపెనీ

**తిరుమల, సెప్టెంబర్ 15 (భారత శక్తి) :** బెంగుళూరుకు చెందిన టివోల్ట్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తిరుమల శ్రీవారికి విద్యుత్ వాహనాన్ని విరాళంగా అందజేసింది. సోమవారం మొంట్రా ఎలక్ట్రిక్ ఏవియేటర్ వాహనాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులకు కంపెనీ ప్రతినిధులు అందజేశారు. రూ.15,94,962 విలువైన ఈ వాహనానికి సోమవారం శ్రీవారి ఆలయం ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంస్థ ప్రతినిధులు వాహనం తాళాలను శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు శ్రీ భాను ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

# అంకితభావంతో నగర పాలక ప్రజలకు సేవలందించాలి

* **సమయ పాలన తప్పనిసరిగా పాటించాలి**
* **జీహెచ్ఎంసీలో 32 మందికి కారుణ్య నియామకం క్రింద నియామక పత్రాలు అందజేసి అభినందించిన జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 15, భారత శక్తి:** ప్రజలకు ఉత్తమ సేవలను అందించడం ద్వారా జీహెచ్ఎంసీకి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. కష్టపడి బాగా పనిచేయాలని సూచించారు. జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తూ.. మృతి చెందిన ఉద్యోగుల వారసులు 32 మందికి కారుణ్య నియామకాల క్రింద జీహెచ్ఎంసీ ఉద్యోగాలు కల్పించింది. వీరికి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సోమవారం సాయంత్రం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నియామ పత్రాలను అందించారు. నియామక పత్రాలు అందుకున్న వారిలో 10 మంది జూనియర్ అసిస్టెంట్ లు, 17 మంది ఆఫీస్ సబార్డినెట్ లు, 5 మంది పబ్లిక్ హెల్త్ వర్కర్ లు ఉన్నారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ... మీకు మంచి భవిష్యత్తు ఉంది. సానుకూల దృక్పథం తో , ఫిర్యాదులు లేకుండా ఉత్తమ పనితీరు కనబరచాన్నారు. విధి నిర్వహణలో సమయ పాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ వేణు గోపాల్ తదితరులు ఉన్నారు.







## మల్లేపల్లి నాలా పూడికతీత, పరిశుభ్రతపై దృష్టి సారించాలి

**: జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్**

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (భారత శక్తి) : మల్లేపల్లి నాలాలో పూడికతీత, పరిశుభ్రత పనులను చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మెహదీపట్నం సర్కిల్ పరిధిలోని మల్లేపల్లి నాలాను ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాలాలో పేరుకుపోయిన మట్టిని తొలగించే చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. తద్వారా భారీ వర్షాల సమయంలో నాలా సమీప ప్రాంతాల్లో నీటి నిల్వలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవచ్చని చెప్పారు. అవసరమైన చోట నాళాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను నిరంతరం కొనసాగించేలా చూడాలని కమిషనర్ సూచించారు. వర్షపు నీరు నిల్వ కాకుండా, నాలాలో స్వేచ్ఛగా ప్రవహించేలా ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆర్.వి. కర్ణన్ ఆదేశించారు.

## నాలాల్లో పడి గల్లంతైనవారికోసం గాలింపు

* **అఫ్జల్‌సాగర్, వినోభా కాలనీలో పర్యటించిన హైడ్రా కమిషనర్**
* **నాలాలపైన ప్రధాన ఆటంకాలను తొలగించేందుకు చర్యలు**

హైదరాబాద్, సెప్టెంబరు 15 (భారత శక్తి) : నాలాల్లో పడి ఆదివారం గల్లంతైన ముగ్గురి ఆచూకీ కోసం హైడ్రా ముమ్మరంగా గాలిస్తోంది. క్యాచ్‌పిట్లన్ని చోట్ల వెతుకుతోంది. ఆసిఫ్‌నగర్లోని అఫ్జల్ సాగర్ నాలాతో పాటు.. ముషీరాబాద్‌లోని వినోభానగర్ నాలా పరిసరాల్లో గాలింపు చర్యలను హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు క్షేత్ర స్థాయిలో సోమవారం ఉదయం పరిశీలించారు. ప్రతి క్యాచ్‌పిట్‌ను తెరిచి చూసిన తర్వాత వెంటనే వాటిని మూసి వేయాలని హైడ్రా సిబ్బందిని ఆదేశించారు. గాలింపు చర్యలను మిగతా శాఖలతో కలిసి ముమ్మరం చేయాలని సూచించారు. హైదరాబాద్ కలెక్టర్ శ్రీమతి హరిచందన గారు కూడా అఫ్జల్ సాగర్ ప్రాంతంలో కమిషనర్‌తో పాటు గాలింపు చర్యలను పరిశీలించారు. ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ కురిసిన భారీ వర్షానికి ఆసిఫ్‌నగర్‌లోని అఫ్జల్ సాగర్ నాలాలో అక్కడే నివాసం ఉంటున్న మామ, అల్లుడు అర్జున్(26), రాము(25)తో పాటు.. ముషీరాబాద్‌లోని వినోభానగర్ నాలాలో దినేష్ అలియాస్ సన్నీ(26) గల్లంతైన విషయం విధితమే. సోమవారం కూడా గాలింపును హైడ్రా ముమ్మరం చేసింది.



* **నాలా ఆక్రమణలే ప్రమాదాలకు కారణం..**

నాలాల ఆక్రమణలే ప్రమాదాలకు కారణమని గాలింపు చర్యలను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్‌గారు చెప్పారు. నాలాలను ఆక్రమించి నిర్మించడమే కాకుండా.. వాటి ప్రవాహాన్ని అశాస్త్రీయంగా దారి మళ్లించడంతో వరద సాఫీగా సాగడంలేదన్నారు. వరద ప్రవాహానికి ప్రధాన అడ్డంకిగా ఉన్న ఒకటి రెండు కట్టడాలనే తొలగిస్తామని.. మిగతా వారు ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని కమిషనర్ స్పష్టం చేశారు. నాలాల చెంతన పేదలే ఎక్కువ సంఖ్యలో నివసిస్తున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుని.. తప్పనిసరైతే కూల్చివేయాల్సి వస్తే వారికి ప్రత్యామ్నాయం ప్రభుత్వం చూస్తుందన్నారు. మిగతావారెవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. పేదల పట్ల ప్రభుత్వానికి ఆ సింపతీ ఉందని.. హైడ్రా కూడా అదే తీరుతో పని చేస్తున్నదని చెప్పారు.

* **ప్రతి ఏటా ఇదే సమస్య..**

ప్రతి ఏటా వర్షాకాలంలో ఈ సమస్య తలెత్తుతోందని స్థానికులతో పాటు నాంపల్లి ఎమ్మెల్యే శ్రీ మాజిద్ హుస్సేన్ గారు తెలిపారు. ఈ సమస్య మూలాలకు వెళ్లి పరిష్కరించాల్సినవసరం ఉందని హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు అన్నారు. జీహెచ్ ఎంసీ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖలతో కలిసి అధ్యయనం చేసిన తర్వాతే ముందుకు వెళ్తామని.. పేదల నివాసాలు పెద్దమొత్తంలో ఉన్నందున అన్ని జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. భారీ వర్షం పడితే అమీర్‌పేట పరిసరాలు నీట మునిగేవని.. అక్కడ అండర్‌గ్రౌండ్ లో పూడుకుపోయిన నాలాలను తెరవడంతో సమస్య పరిష్కారం అయ్యిందన్నారు. 25 లారీల పూడికను ఒకే చోట తీసినట్టు చెప్పారు. ఈ వర్షాకాలంలో ఇప్పటి వరకూ 2200ల లారీల పూడికను తొలగించామని.. ఇది నిరంతరంగా సాగుతోందని.. నగరవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ముమ్మరం చేస్తామన్నారు. హైడ్రా కార్యకలాపాలను పరిశీలిస్తున్న పొరుగు రాష్ట్రాల వారు అక్కడ కూడా ఇలాంటి వ్యవస్థ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నట్టు వార్తలు రావడం గమనించాలన్నారు.

## జీహెచ్ఎంసీ వ్యాప్తంగా ప్రజావాణి' కి 219 ఫిర్యాదులు

హైదరాబాద్, సెప్టెంబర్ 15 (భారత శక్తి) : సోమవారం జీహెచ్ఎంసీ వ్యాప్తంగా నిర్వహించిన ప్రజావాణి' కి మొత్తం 219 ఫిర్యాదులు, వినతులు వచ్చాయి. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంకు మొత్తం 68 విన్నపాలు రాగా, జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 151 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్ లో 55, సికింద్రాబాద్ జోన్ లో 33, శేరిలింగంపల్లి జోన్ లో 30, ఎల్బీనగర్ జోన్ లో15, చార్మినార్ జోన్ లో 11, ఖైరతాబాద్ జోన్ లో 7 ఫిర్యాదులు అందాయి. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 68 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 43, ఇంజనీరింగ్ 6, హెల్త్ అండ్ శానిటేషన్, స్పోర్ట్స్ విభాగాలకు 5 చొప్పున, ట్యాక్స్ సెక్షన్, అడ్మిన్, ఫైనాన్స్, ల్యాండ్ అక్విజిషన్ విభాగాలకు 2 చొప్పున, ఎలక్షన్ విభానికి ఒక ఫిర్యాదు అందింది. ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులను స్వీకరించిన జిహెచ్ఎంసి అధికారులు సత్వర పరిష్కారానికి సంబంధిత విభాగాల అధికారులకు అందజేశారు. జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్, సత్యనారాయణ, సిసిపి శ్రీనివాస్, అడిషనల్ సిసీపీ గంగాధర్, విజిలెన్స్ డి.ఎస్.పి నర్సింహా రెడ్డి, జేసీ శానిటేషన్ మోహన్ రెడ్డి, జేసి హెల్త్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి వివేక్

మంచిర్యాల, సెప్టెంబర్ 15 (భారత శక్తి) : అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని రాష్ట్ర గనులు భూగర్భ, కార్మిక శిక్షణ శాఖ మంత్రి గడ్డం. వివేక్ అన్నారు. సోమవారం మంచిర్యాల పట్టణంలోని సున్నం బట్టి వాడలో గల కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేకానంద మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టి, అన్ని వర్గాల అభివృద్ధికి ప్రణాళికలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో సాంస్కృతిక కార్యక్రమాల కోసం కమ్యూనిటీ హాల్ 2వ అంతస్తు నిర్మాణం చేపట్టబడిందని, ఈ పనులకు ఎంపీ లాడ్స్ 202425 నిధులలో రూ.50 లక్షలు కేటాయించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. 2వ అంతస్తు నిర్మాణాన్ని పూర్తి చేసి జనవరి 1న



ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం.వంశీకృష్ణ, పంచాయతీరాజ్ అధికారులు ఈ.ఈ. రామ్ మోహన్, సంబంధిత అధికారులు తదితరులు కూడా పాల్గొన్నారు.

## ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల బంద్‌కు భాజపా మద్దతు: రామచందర్‌రావు

హైదరాబాద్, సెప్టెంబరు 15 (భారత శక్తి) : ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు చేపట్టిన బంద్‌కు మద్దతు తెలుపుతున్నామని భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. సిబ్బందికి జీతాలు ఇవ్వలేని పరిస్థితి ప్రైవేటు కళాశాలలకు ఉందని చెప్పారు. విద్యావ్యవస్థను గత ప్రభుత్వం చెడగొట్టిందని ఆరోపించారు. ఈ ప్రభుత్వమైనా యాజమాన్యాలతో చర్చించి వారికి సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. విద్యపై ప్రభుత్వ వైఖరిని భాజపా తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు.



## తెలంగాణ జర్నలిస్టులకు గుడ్ న్యూస్.. అక్రిడిటేషన్‌లపై మంత్రి పొంగులేటి కీలక అప్డేట్

మంచిర్యాల, సెప్టెంబర్ 15 (భారత శక్తి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందేలా విధివిధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో హోమ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రవి గుప్తా, ప్రెస్ అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాసరెడ్డి, ఐ&పీఆర్ స్పెషల్ కమిషనర్ సీహెచ్. ప్రియాంక, సీపీఆర్‌వో జీ.మల్సూర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా అక్రిడిటేషన్ పాలసీ, జర్నలిస్టల హెల్త్ పాలసీ, జర్నలిస్టుల అవార్డులు, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి హైపవర్ కమిటీ తదతర అంశాలపై




సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జర్నలిస్టులపై దాడులు జరగకుండా ప్రభుత్వం అన్నీ చర్యలు తీసుకుంటుందని, ఇందుకోసం హైపవర్ కమిటీని కూడా పునరుద్ధరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఉమ్మడి రాష్ట్రంలో 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జీవో జారీ చేసిందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆ ఊసే ఎత్తలేదని విమర్శించారు. అలాగే, జర్నలిస్టుల జీత భత్యాలకు సంబంధించి త్రైపాక్షిక కమిటీని కూడా పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల హెల్త్ పాలసీపై సమగ్రంగా చర్చించామని, ఇన్సూరెన్స్ పాలసీలో ఏది జర్నలిస్టులకు ప్రయోజనకరంగా ఉంటుందో అనే అంశంపై ఆరోగ్యశ్రీ విభాగంతో కలిసి లోతైన అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. అక్రిడిటేషన్ పాలసీపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. జర్నలిస్టుల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రత్యేక వెబ్ సైట్‌ను తక్షణమే రూపొందించాలని అధికారులకు సూచించారు. జర్నలిస్టులకు అవార్డులను పునరుద్ధరించాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్, కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.